www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 27-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 150 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: చవితి మ.3.45 తదుపరి పంచమి, నక్షత్రం: హస్త ఉ.6.04 తదుపరి చిత్త, వర్జ్యం: మ.2.57-4.44, దుర్ముహూర్తం: ఉ.11.51-12.41, అమృతఘడియలు: రా.1.37-3.24, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.04, సూర్యాస్తమయం: 6.29 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సౌండ్ సిస్టం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకే..

ధ్వని స్థాయిని పోలీసులు పర్యవేక్షించాలి

ట్రాఫిక్ సమస్య ఏర్పడనివ్వొద్దు

నిబంధనలు పాటించాలి.. నిమజ్జనం తర్వాత మండపాల ప్రాంగణం శుభ్రం చేయాలి

గణేశ్ మండపాల నిర్వాహకులకు హైకోర్టు మార్గదర్శకాల జారీ 14

రాహుల్.. ప్రియాంక..
మధ్యలో రేవంత్!

బిహార్‌లో అత్యంత ప్రాధాన్యమిచ్చిన కాంగ్రెస్ అగ్రనేతలు

ఢిల్లీ నుంచి వారితోపాటు ప్రత్యేక విమానంలో ప్రయాణం

రాహుల్, ప్రియాంకతో కలిసి ఓటర్ అధికార్ యాత్రలో..

బిహార్ ఎన్నికల్లో పార్టీ పరిస్థితిపై రాహుల్‌గాంధీతో చర్చ

తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపైనా!

రేవంత్‌తోపాటు పాల్గొన్న మహేశ్‌గౌడ్, మంత్రులు

ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తిరిగి రాక

వ్యక్తిగత దాడులే ఆర్‌ఎస్‌ఎస్ విధానం

గాంధీజీపైనా వారు అదే పని చేశారు: రాహుల్‌గాంధీ

కుట్రతో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారు: ప్రియాంకాగాంధీ



బిహార్‌లో ఓటర్ అధికార్ యాత్రలో ప్రియాంక, రేవంత్, రాహుల్

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): 'ఓటర్ అధికార్ యాత్ర'లో పాల్గొనేందుకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి.. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. మంగళవారం ఢిల్లీ నుంచి బిహార్ రాష్ట్రంలోని దర్భంగా వరకు ప్రత్యేక విమానంలో వెళ్లిన ఇద్దరు నేతలు.. రేవంత్‌రెడ్డిని కూడా వెంటబెట్టుకుని వెళ్లారు. ఓటర్ అధికార్ యాత్రలో కూడా రాహుల్, ప్రియాంకతోపాటే ప్రత్యేక వాహనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. తనకు ఇరువైపులా.. రాహుల్, ప్రియాంకతో ఆ యాత్రలో రేవంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కాగా, ప్రత్యేక విమానంలో ప్రయాణిస్తున్నప్పుడు.. రేవంత్‌తో బిహార్ ఎన్నికలు, తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై రాహుల్‌గాంధీ ముచ్చటించారు. ఎన్నికల

మిగతా 13వ పేజీలో...

ఎస్ఐఆర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ!

ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన, విపక్షాల ఆరోపణలకు బదులు చెప్పేందుకు ఈసీ కసరత్తు

ఓట్ చోరీ విమర్శల వేళ బిహార్‌లో అమలుకు ప్రణాళిక 2



సాదాబైనామాల రిజిస్ట్రేషన్‌కు
పచ్చజెండా

2020 నాటి స్టే ఎత్తేసిన హైకోర్టు

భూభారతి చట్టంతో సర్కార్‌కు హక్కుంది

కొత్త చట్టం వచ్చినందున పాత జీవోకు కాలం చెల్లింది 11

కావాలంటే భూభారతిని సవాల్ చేసుకోవచ్చని పిటిషనర్‌కు సూచన

ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ ముగించిన న్యాయస్థానం



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి'

వినాయక చవితి శుభాకాంక్షలు

సెలవు

వినాయక చవితి సందర్భంగా బుధవారం మా కార్యాలయాలకు సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' గురువారం (28-08-2025) సంచిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.

- మేనేజింగ్ డైరెక్టర్

30 నుంచి అసెంబ్లీ

కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక మీద చర్చ

డిప్యూటీ స్పీకర్‌గా రాంచందర్‌నాయక్ ఎన్నిక!.. అదే రోజు క్యాబినెట్ సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతంపై చర్చించనున్న మంత్రివర్గం



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30 నుంచి జరగనున్నాయి. శాసనసభతోపాటు శాసనమండలి సమావేశాలు 30న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయి. ఉభయ సభల నిర్వహణకు రాష్ట్ర గవర్నర్ అనుమతి ఇవ్వడంతో శాసనసభ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, అదే రోజు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కూడా జరుగుతుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం ఒంటి గంటకు శాసనసభలోని కమిటీ హాల్‌లో క్యాబినెట్ భేటీ ప్రారంభమవుతుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రివర్గ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్ల కేటాయింపు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించనున్నారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో.. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రవేశపెట్టి చర్చించనున్నారు. ఈ చర్చలో వివిధ పార్టీల నుంచి వచ్చే అభిప్రాయాలను పరిశీలించి తదుపరి అడుగు వేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ సమావేశాల్లోనే డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కూడా జరగనుంది. 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగలేదు. స్పీకర్ లేని సమయంలో ప్యానెల్ స్పీకర్ల ఆధ్వర్యంలోనే శాసనసభ నడుస్తోంది. అయితే ఇటీవల డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్‌ను డిప్యూటీ స్పీకర్ పదవికి ఎంపిక చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ దృష్ట్యా 30 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకునే అవకాశాలున్నాయి.

వచ్చే నెల 2న పంచాయతీల తుది ఓటరు జాబితా

స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న ఎస్ఈసీ

ఓటరు జాబితా రూపకల్పనకు నోటిఫికేషన్

28న ముసాయిదా.. 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

తొలుత సర్పంచ్ ఎన్నికలు జరిపే అవకాశం? 11

మహీంద్ర వర్సిటీలో డ్రగ్స్ కలకలం!

మత్తు మందుకు అలవాటుపడ్డ 50 మంది విద్యార్థులు.. ముగ్గురి అరెస్టు

ఈగల్ బృందాల విస్తృత తనిఖీలు

గంజాయి, ఓజీ కుష్ స్వాధీనం 14

నైజీరియన్ నుంచి మత్తుమందులు

ఢిల్లీ, బీదర్ నుంచి గంజాయి సరఫరా

తొలుత మత్తుమందుకు బానిసలై.. తర్వాత డ్రగ్ పెడ్లర్లుగా విద్యార్థులు

'మల్నాడు' లింకులతో బయటపడ్డ దందా

నేటి నుంచే అమెరికా
'అదనపు' మోత!

అమల్లోకి మరో 25% సుంకాలు

మొత్తంగా 50 శాతానికి చేరుతున్న టారిఫ్‌లు

5.25 లక్షల కోట్ల భారత ఎగుమతులపై ప్రభావం

వస్త్ర పరిశ్రమ, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, రొయ్యల ఎగుమతులపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ, ఆగస్టు 26: రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దన్నా వినడం లేదంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాలు బుధవారం (27వ తేదీ) నుంచి అమల్లోకి వస్తున్నాయి. ఇప్పటికే భారత్ నుంచి వచ్చే దిగుమతులపై 25శాతం సుంకాలు వసూలు చేస్తుండగా.. దీనితో కలిపి

మిగతా 2వ పేజీలో...



రక్షణ శాఖ కాదు యుద్ధ శాఖ!

అమెరికా టెక్ కంపెనీలపై డిజిటల్ ట్యాక్స్‌లు వేసే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తా

చైనాతో స్నేహమే.. అయస్కాంతాల సరఫరా తగ్గిస్తే మాత్రం 200% సుంకాలు: ట్రంప్ 2

2036 ఒలింపిక్ బిడ్‌కు కసరత్తు

రేపు తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు కీలక సమావేశం

హాజరుకానున్న సీఎం రేవంత్, క్రీడా ప్రముఖులు

స్టేడియాల ఆధునికీకరణ, 56 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాల నిర్మాణంపై చర్చ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ వేదికగా 2036 ఒలింపిక్స్ నిర్వహణకు గాను బిడ్ వేసేందుకు గల అవకాశాలపై చర్చించడమే ప్రధాన ఎజెండాగా గురువారం (ఈనెల 28న) తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు గవర్నర్స్ సమావేశం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవనుండటం గమనార్హం. ఈ భేటీలో రాష్ట్రాన్ని క్రీడాహబ్‌గా తీర్చిదిద్దే దిశగా కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది. సమావేశంలో గచ్చిబౌలి, హకీంపేటలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ క్యాంపస్‌లు, ఎక్సలెన్స్ సెంటర్లు, స్పోర్ట్స్ సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు, ఎంపిక చేసిన 14 క్రీడాంశాల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్

మిగతా 13వ పేజీలో...

ఈ కేసు విచారణ నుంచి నేను తప్పుకొంటున్నా!

ఇందులో ఒక పక్షానికి అనుకూలంగా ఉండమన్నారు..

ఉన్నత న్యాయవ్యవస్థకు చెందిన సభ్యుడొకరు కోరారు 13

నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ న్యాయమూర్తి శరద్‌కుమార్ శర్మ

హైదరాబాద్‌కు చెందిన కెఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, ఏఎస్ మెట్ కార్ప్ కేసులో..

గవర్నర్లు బిల్లుల్ని తొక్కిపెట్టొచ్చంటే..
ద్రవ్యబిల్లునూ ఆపేయొచ్చుగా?

అలాంటి పరిస్థితి సమస్యాత్మకం: సుప్రీంకోర్టు

శాసనసభ ఆమోదించిన ద్రవ్య బిల్లు గవర్నర్ సూచనలకు భిన్నంగా ఉంటే నిలిపేయొచ్చు

సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వెల్లడి

రాజ్యాంగం ప్రకారం బిల్లులకు ఆమోదం తెలిపే అధికారం రాష్ట్రపతికి, గవర్నర్లకు మాత్రమే ఉంది

సుప్రీంకోర్టులో బీజేపీ పాలిత రాష్ట్రాల వాదన

రేపు తమిళనాడు, కేరళ ప్రభుత్వాల వాదనలు

అంబానీల 'వనతార'పై సుప్రీం సిట్

జస్టిస్ చలమేశ్వర్ నేతృత్వంలో ఏర్పాటు

ఏనుగుల సంరక్షణపై ఆరోపణల మీద దర్యాప్తు



న్యూఢిల్లీ, ఆగస్టు 26: ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదించి పంపిన బిల్లులను తిప్పి పంపకుండా, ఆమోదం తెలపకుండా తొక్కిపట్టడం ద్వారా గవర్నర్లు వాటిని వీటో చేయగలరంటే.. ద్రవ్యబిల్లులను సైతం అలాగే ఆపే అవకాశం ఉందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. అలాంటి పరిస్థితే వస్తే అది సమస్యాత్మకమని వ్యాఖ్యానించింది. అయితే.. బిల్లులకు ఆమోదం విషయంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి ఉన్న స్వతంత్ర అధికారాలను బీజేపీ పాలిత రాష్ట్రాలు

మిగతా 2వ పేజీలో...

పెంపుడు తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

14

సుప్రీంకోర్టు తీర్పుతో నలుగురు పిల్లలను అప్పగించిన శిశు విహార్ అధికారులు

మరో ఐదుగురు చిన్నారుల కేసుపై రేపు హైకోర్టులో విచారణ

ఆస్టిన్ సాయిబాబా గుడిలో నిధుల గోల్‌మాల్!

17 కోట్లు తినేసిన ఆలయ పాలకవర్గం

డొల్లకంపెనీలకు మ్యాచింగ్ గ్రాంట్ నిధుల బదిలీ.. ఇద్దరు ప్రవాసాంధ్రుల హస్తం 13

బాధితుల్లో యాపిల్, వీసా, డెల్ కంపెనీల ఉద్యోగులు.. రంగంలోకి ఫెడరల్ సంస్థలు

జాతీయ ఉత్తమ అధ్యాపకులుగా నలుగురు తెలుగువాళ్లు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు చొప్పున.. 3

హైదరాబాద్ బిట్స్‌పిలానీ ప్రొఫెసర్ సంకేత్ గోయల్, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ వినీత్ ఎంపిక

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని..

నిర్మల్ జిల్లాలో దారుణం 13

టార్చ్‌లైట్‌తో తలపై కొట్టి భర్త హత్య

ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లాలో ఘటన

భారత్‌లో 8.74 లక్షల క్యాన్సర్ మరణాలు

» 2024లో 15.60 లక్షల కొత్త కేసులు: ఐసీఎంఆర్



న్యూఢిల్లీ, ఆగస్టు 26: భారత్‌లో క్యాన్సర్ మరణాలు పెరిగిపోతున్నాయి. 2024లో దేశంలో 15.60 లక్షల కొత్త కేసులు వెలుగు చూడగా వీరిలో 8,74,404 మంది మరణించారని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) పేర్కొంది. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే 2045 నాటికి భారత్‌లో 24.60 లక్షల కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఐసీఎంఆర్ నిర్వహించిన అధ్యయనం వివరాలు తాజాగా జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మెడికల్ అసోసియేషన్(జేఏఎంఏ)లో ప్రచురితమయ్యాయి. ఆ నివేదిక ప్రకారం...

దేశంలో ఈ క్యాన్సర్లు ఎక్కువ

మన దేశంలో పురుషులు సాధారణంగా నోటి, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్ క్యాన్సర్ల బారిన పడుతుంటారు. 2024లో నమోదైన కొత్త కేసుల్లో 1.13 లక్షలకు పైగా నోటి క్యాన్సర్‌కి సంబంధించినవే కావడం గమనార్హం. ఇక మహిళల్లో రొమ్ము, గర్భాశయ, అండాశయ క్యాన్సర్లు ఎక్కువ.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

కేన్సర్ ముప్పు తగ్గించడానికి జీవన శైలిలో మార్పులు చేసుకోవడం అత్యావశ్యకమని అధ్యయనం పేర్కొంది. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, కొద్దిపాటి నడక, మెట్లు ఎక్కడం వంటి చిన్న చిన్న వ్యాయామాలు నిత్యం చేయడం, వేపుళ్ల, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉండటంతో పాటు తాజా పండ్లు, కూరగాయలు తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలి. కాగా, క్యాన్సర్ నియంత్రణ ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోందని ఐసీఎంఆర్ వెల్లడించింది. 30 ఏళ్ల నిండిన వారంతా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకొనేలా ప్రోత్సహిస్తోంది.

చాపకింద నీరులా ఊబకాయం..!

» మార్గదర్శకాల రూపకల్పనకు కేంద్ర ప్రభుత్వం చర్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 26: భారత్‌లో ఊబకాయం సమస్య చాపకింద నీరులా విస్తరిస్తోందని ఇటీవల ప్రధాని మోదీ హెచ్చరించారు. ప్రతిఒక్కరూ దీనిపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నొక్కిచెప్పారు. ప్రస్తుతం భారత్‌లో ప్రతి నలుగురిలో ఒకరు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో ఊబకాయాన్ని నియంత్రించేందుకు కేంద్రం తొలిసారిగా మార్గదర్శకాలు రూపొందించడంపై దృష్టిపెట్టింది. ఈ అంశంపై భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ అధ్యక్షతన ఆరోగ్య మంత్రిత్వశాఖ అధికారులు, హార్మోన్ సంబంధిత వ్యాధి నిపుణులు, పోషకాహార నిపుణులు, మధుమేహ, ఇతర వైద్య నిపుణులు ఇటీవలే సమావేశమయ్యారు. భారత్‌లో స్థూలకాయానికి సంబంధించి ఇప్పటివరకూ జాతీయస్థాయి మార్గదర్శకాలేమీ లేవు. డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసిన మార్గదర్శకాలనే వైద్యులు అనుసరిస్తున్నారు. 2018లో ఐసీఎంఆర్ టైప్-2 డయాబెటిస్‌పై మార్గదర్శకాలు విడుదల చేసింది. దీనిలోనే ఊబకాయం గురించి కూడా పరిమిత సూచనలు చేసింది. అందులో.. స్థూలకాయం ఉన్నవారు జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా బరువు తగ్గడానికి ప్రయత్నించాలని పేర్కొంది. ప్రస్తుతం సూచించే మార్గదర్శకాల్లో ఊబకాయంపై ముందు జాగ్రత్త చర్యలు, నివారణ, స్క్రీనింగ్, రోగ నిర్ధారణ, చికిత్సపై దృష్టి సారించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

లోకం తీరు



రక్షణ శాఖ కాదు యుద్ధ శాఖ!

» అమెరికా టెక్ కంపెనీలపై డిజిటల్ ట్యాక్స్‌లు వేసే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తా: ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 26: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చిత్రమైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా రక్షణ శాఖ పేరు తనకు నచ్చలేదన్నారు శ్వేతసౌధంలో దక్షిణ కొరియా అధ్యక్షుడితో భేటీ అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. "రక్షణ శాఖ.. ఈ పేరు నాకు నచ్చలేదు. దేన్నుంచి మనం రక్షించుకోవాలి? ఎందుకు రక్షించుకోవాలి? మొదట్లో దీనిని యుద్ధ శాఖగా పిలిచేవారు. అది బాగుండేది. మనకు రక్షించుకోవడం మాత్రమే కాదు.. దూకుడుగా ఉండటం కూడా కావాలి" అని పేర్కొన్నారు. మనకన్నా ఎక్కువగా రష్యా చమురు కొంటున్న చైనా విషయంలో మాత్రం భిన్నమైన వైఖరి అవలంబిస్తున్నారు. చైనాతో అమెరికా 'గొప్ప బంధం' కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేకమైన 'రేర్ ఎర్త్' అయస్కాంతాల అంశంలో చైనాకు పట్టు ఉందని, కానీ విమానయాన రంగానికి సంబంధించి అమెరికా ఆధిపత్యం కొనసాగుతోందని చెప్పారు. ఒకవేళ అయస్కాంతాల సరఫరా తగ్గిస్తే మాత్రం చైనాపై 200% సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అయితే అలా సుంకాలు విధించడం వల్ల చైనాతో వాణిజ్యం నడపలేమని పేర్కొన్నారు. కాగా, అమెరికాకు చెందిన అమెజాన్, ఫేస్‌బుక్, వాట్సాప్, గూగుల్ వంటి కంపెనీలపై వివిధ దేశాలు డిజిటల్ సర్వీసుల పన్ను(డీఎస్టీ)లు వసూలు చేయడం సరి కాదని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా టెక్నాలజీ కంపెనీలపై డిజిటల్ పన్నులు, నియంత్రణలు విధించే దేశాలపై భారీగా సుంకాలు విధిస్తానని సామాజిక మాధ్యమం ట్రూత్‌లో పోస్టు పెట్టారు.

వ్యక్తిగత దాడులే ఆర్‌ఎస్‌ఎస్ విధానం

» గాంధీజీపైనా అదే పని చేశారు: రాహుల్ గాంధీ

» కుట్రతో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారు: ప్రియాంకాగాంధీ



అరారియా, మధుబని, సుపాల్(బిహార్), ఆగస్టు 26: వ్యక్తిగత దాడులే ఆర్‌ఎస్‌ఎస్ విధానమని.. జాతిపిత మహాత్మాగాంధీ పైనా వారు అదే పని చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం ఆరోపించారు. బిహార్‌లో కాంగ్రెస్ మిత్రపక్షాలైన మహాఘట్‌బంధన్ సభ్యులతో నిర్వహించిన చర్చలో ఈమేరకు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో ఒక దాబా వద్ద రాహుల్‌గాంధీ ఆర్జేడీకి చెందిన తేజస్వీయాదవ్, సీపీఐ ఎంఎల్‌కి చెందిన దీపాంకర్ భట్టాచార్య, మహాత్మాగాంధీ ముని మనవడు తుషార్‌గాంధీ, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్‌కుమార్‌లతో కలిసి టీ తాగుతూ కనిపించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. గాంధీజీపై ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ అబద్ధాలే ప్రచారం చేసిందన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో వ్యక్తిగత దాడులు చేయడం అధికారికం అయిపోయిందని తుషార్‌గాంధీ అన్నారు. తేజస్వీయాదవ్ మాట్లాడుతూ.. 2014 నుంచే ఈ సంస్కృతి మొదలైందని పేర్కొన్నారు. కాగా బిహార్‌లోని సుపాల్‌లో మంగళవారం జరిగిన ఓటర్ అధికార్ యాత్ర కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకాగాంధీ వాద్రా మాట్లాడుతూ.. ప్రత్యేక ఓట్ల తనిఖీ ద్వారా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బిహార్‌లో కుట్రపూరితంగా ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

'సర్'పై ప్రజాభిప్రాయ సేకరణ!

» ఐదు ప్రశ్నలతో ప్రజల ముందుకు ఈసీ

న్యూఢిల్లీ, పట్నా, ఆగస్టు26: బిహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో ఎన్నికల సంఘం(ఈసీ) కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సర్‌పై బిహార్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టేందుకు ఈసీ సిద్ధమైనట్టు సమాచారం. ప్రజాభిప్రాయసేకరణ ద్వారా సర్‌పై ప్రజలకు అవగాహనం కల్పించడంతోపాటు ఓట్ చోరీ అంటూ ప్రతిపక్షాలు చేస్తోన్న విమర్శలకు బదులు చెప్పవచ్చునని ఈసీ ఆలోచనగా తెలిసింది. అలాగే, సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కూడా వేగవంతం అవుతుందని ఈసీ అనుకుంటోంది. ఈ మేరకు సర్‌పై ప్రజాభిప్రాయ సేకరణకు ఈసీ ఐదు ప్రశ్నలను సిద్ధం చేసినట్టు తెలిసింది.

'వనతార'పై సుప్రీం సిట్

» మాజీ జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలో ఏర్పాటు

» ఏనుగుల సంరక్షణలో వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు

న్యూఢిల్లీ, ఆగస్టు 26: రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ కుటుంబం గుజరాత్‌లోని వనతారలో నిర్వహిస్తున్న జంతు సంరక్షణ, పునరావాస కేంద్రంపై వచ్చిన ఆరోపణలను నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) సుప్రీంకోర్టు ఏర్పాటుచేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌కు 'సిట్' నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర చౌహాన్, ముంబై రిటైర్డు పోలీస్ కమిషనర్ హేమంత్ నగరాలే, కస్టమ్స్ శాఖ అడిషనల్ కమిషనర్ అనీశ్ గుప్తా ఈ బృందంలో ఇతర సభ్యులు. సెప్టెంబరు 12వ తేదీనాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని 'సిట్'ను కోర్టు ఆదేశించింది. చట్టపరమైన అనుమతులు లేకుండా ఏనుగులను దేశంలోని ఇతర ప్రాంతాలనుంచీ, విదేశాలనుంచీ 'వనతార' సేకరిస్తున్నదంటూ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాలను ఆధారం చేసుకుని రెండు పిటిషన్లు ఈ నెల 14న సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై మంగళవారం జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం విచారణ చేపట్టింది.

పంచోలీకి పదోన్నతిపై జస్టిస్ నాగరత్న అసమ్మతి

» న్యాయవ్యవస్థకు ప్రతికూల ఫలితాలనిస్తుందని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 26: పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనుభాయి పంచోలీకి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ అత్యున్నత న్యాయస్థానం కొలీజియం తీసుకున్న నిర్ణయానికి సీనియర్ జస్టిస్ బీవీ నాగరత్న గట్టి అసమ్మతి తెలిపారు. కొలీజియం వ్యవస్థకున్న విశ్వసనీయతను జస్టిస్ పంచోలీ నియామకం దెబ్బ తీస్తుందని పేర్కొన్నారు. పట్నా, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పంచోలీ, ఆలోక్ అరాదేలకు పదోన్నతి కల్పిస్తూ సోమవారం సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. ఐదుగురు సభ్యుల కొలీజియంలో 4:1 తేడాతో పంచోలీ నియామకానికి ఆమోదం తెలిపిందని మీడియాలో వార్తలొచ్చాయి. జస్టిస్ పంచోలీకి పదోన్నతి కల్పన వల్ల న్యాయం జరుగదని జస్టిస్ బీవీ నాగరత్న పేర్కొన్నట్లు సమాచారం. గత మే నెలలోనూ జస్టిస్ పంచోలీని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడూ జస్టిస్ నాగరత్న అసమ్మతి తెలిపినప్పుడు.. జస్టిస్ ఎన్‌వీ అంజారియాను కొలీజియం ఎంపిక చేసింది. 3 నెలల తర్వాత మళ్లీ కొలీజియం జస్టిస్ పంచోలీ పేరును ముందుకు తేవడంతో ఆమె తీవ్రమైన అసమ్మతి నోటు రాశారని సమాచారం.

నేటి నుంచే అమెరికా 'అదనపు' మోత!



(మొదటి పేజీ తరువాయి)

50శాతానికి చేరుతున్నాయి. ఈ మేరకు అమెరికా అంతర్గత భద్రతా విభాగం తాజాగా నోటీసు జారీ చేసింది. వివిధ దేశాలపై అమెరికా విధించిన సుంకాల్లో.. భారత్‌పై విధించిన సుంకాలే అత్యధికం కావడం గమనార్హం. తాజా పెంపుతో అమెరికాకు భారత్ నుంచి జరిగే సుమారు రూ.5.25 లక్షల కోట్ల (60 బిలియన్ డాలర్ల) ఎగుమతులపై ప్రభావం పడుతుందని అంచనా. ప్రస్తుతానికి అదనపు సుంకాల నుంచి మినహాయింపు ఉన్న మొబైల్ ఫోన్లు, పలు రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫార్మా మినహా.. మిగతా అన్ని రంగాలకు సుంకాల దెబ్బ తగలనుంది.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముడిపెట్టి..

అమెరికాకు భారత్ భారీగా ఎగుమతులు చేస్తూ.. అమెరికా ఉత్పత్తుల దిగుమతిపై మాత్రం భారీగా టారిఫ్‌లు విధిస్తోందని ట్రంప్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అమెరికా వ్యవసాయ, డెయిరీ ఉత్పత్తుల దిగుమతులకు అనుమతించాలని, టారిఫ్‌లు తగ్గించాలని.. ఈ మేరకు వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. కానీ దేశంలోని రైతులు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుందంటూ భారత్ నిరాకరిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే ట్రంప్ భారత్‌పై 25శాతం సుంకాలు విధించారు. అవి ఆగస్టు 7వ తేదీ నుంచే అమల్లోకి వచ్చాయి. ఇక రష్యా చమురును విక్రయించడం ద్వారా వస్తున్న సొమ్ముతోనే ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగిస్తోందని.. ఈ క్రమంలో రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం నిలిపేయాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తెచ్చే క్రమంలోనే భారత్‌పై అదనపు సుంకాలు విధించినట్టు కూడా ప్రకటించారు. ప్రస్తుతం భారత్‌తోపాటు బ్రెజిల్‌పై 50శాతం, మయన్మార్‌పై 40, థాయ్‌లాండ్, కాంబోడియాలపై 36, బంగ్లాదేశ్‌పై 35, ఇండోనేషియాపై 32, చైనా, శ్రీలంకలపై 30, మలేసియాపై 25, ఫిలిప్పీన్స్, వియత్నాంలపై 20, పాకిస్థాన్‌పై 19శాతం టారిఫ్‌లను అమెరికా అమలు చేస్తోంది.

ఏయే రంగాలు, ప్రాంతాలపై ఎంత ప్రభావం?

2024-25లో భారత్-అమెరికా మధ్య సుమారు 11.5 లక్షల కోట్ల (131.8 బిలియన్ డాలర్లు) వాణిజ్యం జరిగింది. ఇందులో భారత్ నుంచి రూ.7.57 లక్షల కోట్ల (86.5 బిలియన్ డాలర్లు) ఎగుమతులు జరగ్గా.. రూ.4లక్షల కోట్ల (45.3 బిలియన్ డాలర్లు) మేర దిగుమతులు జరిగాయి. ప్రస్తుతం 50శాతం టారిఫ్‌లతో భారత్ నుంచి జరిగే రూ.5.25 లక్షల కోట్ల ఎగుమతులపై ప్రభావం పడనుంది. ఈ అధిక సుంకాల కారణంగా అమెరికాలో భారత ఉత్పత్తుల ధరలు ఏకంగా 50శాతం పెరిగిపోతాయి. అదే సమయంలో టారిఫ్‌లు తక్కువగా ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, వియత్నాం, కాంబోడియా, ఇండోనేషియా వంటి దేశాల ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటాయి. దీనితో భారత ఉత్పత్తులకు డిమాండ్ పడిపోయి ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోతాయి.

- ప్రధానంగా విశాఖపట్నం కేంద్రంగా తూర్పు తీర ప్రాంతాల నుంచి అమెరికాకు సుమారు రూ.20 వేల కోట్లకుపైగా విలువైన రొయ్యలు ఎగుమతి అవుతాయి. ఇప్పుడు 50శాతం సుంకంతో ఈ పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడనుంది.
- ముంబై, సూరత్ వేదికగా ఉన్న రత్నాలు, ఆభరణాల పరిశ్రమలు (రూ.87 వేల కోట్ల ఎగుమతులు).. తమిళనాడు, ఢిల్లీ, కర్ణాటకల నుంచి ఎగుమతయ్యే వస్త్రాల పరిశ్రమలు (రూ.95 వేల కోట్ల ఎగుమతులు) దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. "అదనపు సుంకాలు భారత వస్త్ర పరిశ్రమపై తీవ్ర భారంగా మారుతాయి. ఉద్యోగుల తొలగింపు, ఇతర వ్యయాల తగ్గింపుపై పరిశ్రమలు దృష్టిపెట్టాల్సి వస్తుంది.." అని అప్పెరల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఏఈపీసీ) ప్రధాన కార్యదర్శి మిథిలేశ్వర్ ఠాకూర్ పేర్కొన్నారు.
- కార్పెట్లు, హస్తకళాకృతులు, ఫర్నీచర్, పాదరక్షలు, బాస్మతి బియ్యం, మసాలాలు, టీ, స్టీలు, అల్యూమినియం, రాగి, ఆర్గానిక్ రసాయనాలు, యంత్ర పరికరాల తయారీ పరిశ్రమలపైనా గణనీయంగా ప్రభావం పడుతుంది.
- అదనపు సుంకాల ప్రభావంతో 2025-26లో అమెరికాకు భారత ఎగుమతులు రూ.4.34 లక్షల కోట్ల (49.6 బిలియన్ డాలర్ల)కు పడిపోవచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు.



ఉత్పత్తుల్లో మనదేశీయుల చెమట చిందాలి!

» పెట్టుబడి ఎవరు పెట్టినా ఉత్పత్తులు మనదేశంలో జరగాలి: మోదీ

అహ్మదాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 26: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామన్న కారణంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనదేశంపై విధించిన 25% అదనపు సుంకాల అమలుకు ఒకరోజు ముందు ప్రధాని మోదీ 'స్వదేశీ ఉత్పత్తుల' ఆవశ్యకతను నొక్కి చెప్పారు. స్వదేశీ, మేక్ ఇండి యా అనేవి కొత్త కొలువులు సృష్టించేందుకు సహాయపడతాయని పేర్కొన్నారు. పెట్టుబడులు ఎక్కడి నుంచి వచ్చినా ఉత్పత్తి మాత్రం మనదేశంలోనే జరగాలని స్పష్టం చేస్తూ.. స్వదేశీ అనేది ప్రతి ఒక్కరి జీవిత మంత్రంగా ఉండాలని పిలుపునిచ్చారు. రానున్న ఐదారేళ్లలో జపాన్ సంస్థ సుజుకి మోటర్ కార్పొరేషన్ భారత్‌లో రూ.70వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లోని హన్సల్‌పూర్ కర్మాగారంలో విదేశాల ఎగుమతుల కోసం 'విటారా' అనే ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ నుంచి తయారైన మొట్టమొదటి వాహనాన్ని మోదీ మంగళవారం ఇక్కడ జెండా ఊపి ఎగుమతులను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే ఈవీల్లో కీలకమైన లిథియం-అయాన్ బ్యాటరీ, సెల్, ఎలక్ట్రోడ్ ఉత్పత్తుల ఫ్యాక్టరీని కూడా మోదీ ప్రారంభించారు. కాగా, ప్రధాని మోదీ రెండ్రోజుల పర్యటన నిమిత్తం గురువారం (28న) జపాన్ బయల్దేరనున్నారు. 29, 30 తేదీల్లో ఆ దేశ ప్రధాని షిగెరు ఇషిబాతో కీలక చర్చలు జరుపనున్నారు. 15వ భారత్-జపాన్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. ఇషిబాతో మోదీ సమావేశం కానుండడం ఇదే మొదటిసారి. 2014లో ఆయన ప్రధానిగా పగ్గాలు స్వీకరించాక జపాన్ వెళ్లడం ఇది ఎనిమిదోసారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మంగళవారం తెలిపారు. 'అటు నుంచి అటే చైనాలోని టియాంజిన్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సుకు వెళ్తారు. 31, 1 తేదీ ల్లో అక్కడే ఉంటారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో వేర్వేరుగా ముఖాముఖి భేటీలు నిర్వహిస్తారు' అని ఆయన తెలిపారు.

చాముండేశ్వరిదేవిని గౌరవిస్తా

» రచయిత్రి బాను ముస్తాక్

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మైసూరు చాముండేశ్వరి దేవిని గౌరవిస్తానని, దసరాను నాడహబ్బగా (రాష్ట్ర పండుగ) వ్యవహరిస్తారని, తాను గౌరవిస్తానని బుకర్ ప్రైజ్ విజేత, రచయిత్రి బాను ముస్తాక్ తెలిపారు. మైసూరు దసరా ఉత్సవాలను బాను ముస్తాక్ చేత ప్రారంభించాలనే కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ, హిందూ సంఘాల నేతలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆమె స్పందించారు. బెంగళూరుకు చెందిన అమ్మనమడిలు సంస్థ గౌరీ పండుగ సందర్భంగా బాను ముస్తాక్‌కు హాసన్‌లో మంగళవారం వాయనం అందచేశారు. ఈ సం దర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. దసరా ఉత్సవాలకు ప్రభుత్వం తనను ఆహ్వానించడం సంతోషం కలిగించిందన్నారు.

గ్రీన్‌కార్డ్ దరఖాస్తుదారుల పిల్లలకు అమెరికా బిగ్ షాక్!

» దరఖాస్తుల పరిశీలన సమయానికి 21 ఏళ్లు నిండిన వారికి నో చాన్స్



వాషింగ్టన్, ఆగస్టు 26: అమెరికాలో ఉంటున్న విదేశీయుల పిల్లలకు గ్రీన్ కార్డ్ ఇచ్చే విషయంలో సిటిజన్ షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) సంచలన నిర్ణయం తీసుకుంది. హెచ్-1బీ వీసాపై అగ్రరాజ్యంలో ఉంటూ గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి పిల్లలకు.. ఆయా దరఖాస్తుల తుది పరిశీలన సమయానికి 21 ఏళ్లు నిండితే అనుమతించబోమని తేల్చి చెప్పింది. ఈ మేరకు యూఎస్‌సీఐఎస్ ఆకస్మిక నిర్ణయం తీసుకుంది. అంటే.. దరఖాస్తు చేసే సమయానికి పిల్లలకు 21 ఏళ్లలోపు ఉన్నప్పటికీ.. వాటిని పరిశీలించి, గ్రీన్ కార్డు మంజూరు చేసే సమయానికి కనుక వారు నిర్ణీత వయసును మించిపోతే.. వారిని గ్రీన్‌కార్డ్‌కు అనర్హులుగా గుర్తిస్తారు. ఇలాంటి వారు ప్రత్యేక వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. లేదా దేశం వదిలి వెళ్లాల్సి ఉంటుందని యూఎస్‌సీఐఎస్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయం ఈ నెల 15 నుంచే అమల్లోకి వచ్చినట్టు పేర్కొంది. వాస్తవానికి హెచ్-1బీ వీసాలు దక్కడమే గగనంగా మారింది. ఏళ్ల తరబడి సమయం పడుతోంది. ఇక, గ్రీన్ కార్డుల దరఖాస్తులు కూడా ఏళ్ల తరబడి మూలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత అధ్యక్షుడు జో బైడెన్.. గ్రీన్‌కార్డు దరఖాస్తు దారులకు వెసులుబాటు కల్పించారు. హెచ్-1బీ వీసాదారుల దరఖాస్తు సమయానికి వారి పిల్లలకు 21 ఏళ్లలోపు వయసు ఉంటే.. గ్రీన్‌కార్డు ఎప్పుడు మంజూ రు చేసినా ఆ వయసునే పరిగణనలోకి తీసుకునేవారు. దీనివల్ల వేలాది మందికి గ్రీన్‌కార్డులు లభించాయి. అయితేప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ మాత్రం గ్రీన్‌కార్డు కోరుకునేవారి పిల్లలకు 21ఏళ్లకు మించరాదన్న నిర్ణయాన్ని మరింత కఠినంగా అమలు చేస్తున్నారు. కాగా, ఈ నిర్ణయం భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనుంది. ఎందుకంటే హెచ్-1బీ వీసాదారులు ఏళ్ల తరబడి అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు వీరి పిల్లలకు ఈ నిబంధన వర్తిస్తే గ్రీన్‌కార్డుకు అనర్హులవుతారు. గ్రీన్‌కార్డు దరఖాస్తులు పరిశీలించి, తుదిచర్యలు తీసుకునే సమయానికి చిన్నారుల వయసు 21 ఏళ్లలోపు ఉంటేనే అనుమతిస్తారు. కానీ, ఇప్పుడున్న పరిస్థితిలో దరఖాస్తుల పరిశీలనకే ఏళ్ల తరబడి సమయం పడుతోంది. ఫలితంగా 21 ఏళ్ల దాటిన వారిని గ్రీన్‌కార్డుకు అనర్హులుగా పేర్కొంటారు.

ద్రవ్యబిల్లులనూ ఆపేయొచ్చుగా?

మొదటి పేజీ తరువాయి)



సమర్థించాయి. చట్టాలకు కోర్టులు ఆమోదం ఇవ్వలేవని.. ప్రతి వ్యాధికీ కోర్టు ఔషధం కాజాలదని వాదించాయి. బిల్లులకు ఆమోదం ఇవ్వగల అధికారం రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతికి, గవర్నర్లకు మాత్రమే ఉందని.. అంతే తప్ప 'ఆమోదం ఇచ్చినట్టుగా పరిగణించడం' అనే పద్ధతే రాజ్యాంగంలో లేదని మహారాష్ట్ర తరఫున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే స్పష్టం చేశారు. "బిల్లులకు ఆమోదం తెలపాలంటూ కోర్టులు రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయలేవు. ఒక చట్టానికి కోర్టు ఆమోదం ఇవ్వలేదు. ఆ అధికారం గవర్నర్లకు లేదా రాష్ట్రపతికి మాత్రమే ఉంది" అని తేల్చిచెప్పారు. బిల్లులను నిలిపివేయడం అనేది గవర్నర్‌కు ఉన్న నాలుగో ప్రత్యామ్నాయమని (మిగతా మూడూ.. ఆమోదం తెలపడం, శాసనసభకు తిప్పి పంపడం, రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేయడం) వివరించారు. బిల్లులకు ఆమోదం ఇవ్వకుండా నిలిపివేసేందుకు గవర్నర్లకు ఉన్న అధికారాన్ని రాజ్యాంగం గుర్తించిందని.. దాన్ని వీటోగా పేర్కొనడం తప్పుదోవ పట్టించడమేనని అభ్యంతరం తెలిపారు. రాష్ట్రాల శాసనసభలు పంపిన బిల్లులకు ఆమోదం తెలపడంపై న్యాయస్థానాలు రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధించగలవా అనే అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143(1) అధికరణం ప్రకారం.. 14 సందేహాలతో సుప్రీంకోర్టుకు లేఖ (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) రాసిన సంగతి తెలిసిందే. దీనిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహన్, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం గవర్నర్లకు ఒక బిల్లును శాసనసభకు తిప్పి పంపకుండా తొక్కిపట్టే స్వతంత్ర అధికారం ఉందని అర్థం చేసుకోవడం పట్ల ఆందోళన వెలిబుచ్చింది. దీన్ని ఆమోదిస్తేగనక.. గవర్నర్లు ద్రవ్యబిల్లులకు సైతం ఆమోదం తెలపకుండా నిలిపివేయగలరన్న అర్థం వస్తుందని.. అలాంటి పరిస్థితే వస్తే అది చాలా సమస్యాత్మకమని కోర్టు వ్యాఖ్యానించింది. "గవర్నర్‌కు ఒక బిల్లుకు ఆమోదం తెలపకుండా నిలిపివేసే అధికారం ఉందని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అలా (బిల్లుల్ని) తొక్కిపట్టే అధికారాన్ని గవర్నర్లు స్వతంత్రంగా అమలు చేయడం మొదలుపెడితే అది సమస్యగా మారుతుంది. ఎందుకంటే.. ఈ అధికారంతో గవర్నర్లు ద్రవ్యబిల్లుతో సహా ఏ బిల్లునైనా తమ వద్దకు రాగానే నిలిపివేయగలరు" అని జస్టిస్ పీఎస్ నరసింహన్ ఆందోళన వెలిబుచ్చారు.

ఆ ప్రశ్నే ఉత్పన్నం కాదు..

గవర్నర్ తన వద్దకు వచ్చిన బిల్లు ద్రవ్యబిల్లు కానప్పుడు మాత్రమే దాన్ని శాసనసభ పునఃపరిశీలనకు తిప్పి పంపగలరు కదా? మరి ఆర్టికల్ 200లోని ప్రధాన నిబంధన ప్రకారం ద్రవ్య బిల్లును సైతం గవర్నర్ తిరస్కరించవచ్చనే విషయాన్ని మీరెలా సమన్వయం చేస్తారని జస్టిస్ నరసింహన్ ప్రశ్నించగా.. ఈ ప్రశ్నకు సమాధానం రాజ్యాంగంలోని 207వ అధికరణలో ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జవాబిచ్చారు. గవర్నర్ సూచనతోనే (సిఫారసు) ద్రవ్యబిల్లును సభలో ప్రవేశపెడతారు కాబట్టి.. గవర్నర్ ద్రవ్యబిల్లును నిలిపివేయడమనే సమస్యే ఉత్పన్నం కాదని వివరణ ఇచ్చారు. హరీశ్ సాల్వే జోక్యం చేసుకుని.. సభ ఆమోదించిన బిల్లు గవర్నర్ సూచించినదానికి భిన్నంగా ఉంటే గవర్నర్ దానికి ఆమోదాన్ని నిలిపివేసే సందర్భం తలెత్తవచ్చని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతలే గవర్నర్ల అధికారాలపై ఎలాంటి పరిమితులూ విధించనప్పుడు.. అటువంటి పరిమితులను వ్యాఖ్యానాల (ఇంటర్‌ప్రెటేషన్) ద్వారా విధించలేమని, బిల్లులపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితి విధించడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. గవర్నర్ ఒక బిల్లును ఎందుకు తొక్కిపట్టారో సమీక్షించే అధికారం కోర్టుకు లేదని ఆయన వాదించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న సీజేఐ.. "గవర్నర్ ఏదైనా బిల్లుకు ఆమోదం తెలపకుండా నిలిపివేస్తే.. అలా ఎందుకు చేశారని కోర్టు అడగగలదా?" అని ప్రశ్నించగా.. "అడగలేదు" అని సాల్వే తేల్చిచెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం రాష్ట్రపతి/గవర్నర్లు తమ అధికారాలు, బాధ్యతలను నిర్వహించే క్రమంలో తీసుకున్న చర్యల గురించి ఏ కోర్టుకూ జవాబుదారీ కారని చెప్పారు. "మీ నిర్ణయం ఏమిటి?" అని మాత్రమే కోర్టులు వారిని అడగగలవుగానీ.. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించలేవని స్పష్టం చేశారు.

భారత రాజ్యాంగంలో లేదు..

ఈ కేసులో కేంద్ర ప్రభుత్వ వాదనలను సమర్థిస్తూ మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల తరఫున సీనియర్ న్యాయవాదులు నీరజ్ కిషన్ కౌల్, మణీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఉత్తరప్రదేశ్, ఒడిసా తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్.. రాష్ట్రపతి, గవర్నర్లకు కార్యనిర్వహణలో స్వతంత్రత ఉందని.. బిల్లులకు ఆమోదం ఇచ్చే విషయంలో వారికి సంపూర్ణ వివేచనాధికారం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లుల విషయంలో కోర్టులు వారికి ఎలాంటి గడువూ నిర్దేశించలేవని తెలిపారు. గోవా సర్కారు తరఫున వాదనలు వినిపించిన ఏఎస్జీ విక్రమ్‌జిత్ బెనర్జీ కూడా.. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ఆమో దం లేనిదే బిల్లు చట్టరూపం దాల్చే ప్రక్రియ సంపూర్ణం కాదని.. కాబట్టి, 'ఆమోదం ఇచ్చినట్టుగా పరిగణించడం' అనే భావనకు అవకాశమే లేదని వాదించారు.

సంచలనం సృష్టించిన గర్భిణి స్వాతి హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ కేసు దర్యాప్తు పారదర్శకంగా జరగాలని, కేసు పూర్తి వివరాలతో నివేదికను మూడు రోజుల్లోగా తమకు అందజేయాలని కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహత్కర్ డీజీపీకి నోటీసు పంపారు.

కార్లలో వచ్చి... మేకలు, గొర్రెల చోరీ

» 4 ముఠాల ఆగడాలు.. నల్లగొండలో 16 మంది అరెస్టు

» ఇద్దరు పరారీలో.. నిందితుల్లో ఇద్దరు మహిళలు

» రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్ల సీజ్

నల్లగొండ క్రైం, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): పగటిపూట కార్లలో వచ్చి రెక్కీ చేసి.. రాత్రిపూట అవేకార్లలో మేకలు, గొర్రెలను దొంగిలిస్తున్న నాలుగు ముఠాల ఆటను పోలీసులు కట్టించారు. ఈ ముఠాలకు చెందిన 18 మంది.. ఇప్పటిదాకా 26 ఘటనల్లో రెండొందలకుపైగా జీవాలను దొంగిలించినట్లుగా తేల్చారు. నిందితుల్లో ఇద్దరు మహిళలున్నారు. నల్లగొండలో జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం శాలిగౌరారం మండలం బైరవబండ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఓ కారులో ఉన్న ముగ్గురు పురుషులు, ఒక మహిళ వాహనం దిగి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు ఆ నలుగురిని పట్టుకుని వారి వేలిముద్రలను స్కాన్ చేయగా పాత నేరస్థులైన సంపంగి వెంకటేశ్, వేంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సంపంగి శారద, దాసర్ల వినోద్‌కుమార్ అలియాస్‌గా కోటిగా గుర్తించారు. ఈ నలుగురిపై గతంలో నల్లగొండ రూరల్, దేవరకొండ, శాలిగౌరారం సహా జిల్లాలోని 12 పోలీస్‌స్టేషన్లలో మేకల దొంగతనాల కేసులు నమోదైనట్లు గుర్తించారు. వీరు తమకు పరిచయం ఉన్న మరో 14 మందితో కలిసి 4ముఠాలుగా ఏర్పడి మేకలు, గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్నారు. నల్లగొండ జిల్లాలోని 15 ప్రాంతాల్లో.. అలాగే రాచకొండ, సైబరాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌జిల్లాల్లోని 11 చోట్ల ఈ ముఠాల సభ్యులు దొంగతనాలకు పాల్పడ్డారు. 16 మందిని అరెస్టు చేశారు. ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, రూ.17లక్షల విలువైన 8 కార్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో అమ్ములూరి విజయ్ ఏపీకి చెందిన వ్యక్తి.

వ్యవసాయమే కాదు.. వైద్యసేవల్లోనూ కాంగ్రెస్ సర్కారు విఫలం

» పాలమూరు రైతు మరణం ప్రభుత్వ హత్యే: హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి):వ్యవసాయరంగమే కాదు.. ప్రాథమిక వైద్యసేవలు అందించడంలోనూ కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వ ఆస్పత్రులు చూపిన నిర్లక్ష్యవైఖరి రైతు మరణానికి కారణమైందని, ఇది ప్రభుత్వ హత్య అని మంగళవారం ఎక్స్‌లో ఆరోపించారు. అప్పుల బాధతో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లిలో రైతు రవినాయక్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తనను కలిచివేసిందన్నారు. రైతులను నిరాశలోకి నెట్టి, జీవితంలోనూ మరణంలోనూ వారికి గౌరవం లేకుండా చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

యూరియా కోసం రైతుల అవస్థలు

» ముఖ్యమంత్రి, మంత్రులెక్కడ?: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతుంటే.. ముఖ్యమంత్రి, మంత్రులు ఎక్కడ ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఎక్కడ ఎన్నికలుంటే అక్కడికి ఎగిరిపోతారా? సమస్యలు ఇక్కడ ఉంటే, సీఎం, మంత్రులు ఢిల్లీ, బిహార్‌లోనా అని మంగళవారం ఎక్స్‌లో నిలదీశారు. రైతుల కష్టాలపై దృష్టి పెట్టకుండా, రాష్ట్ర సమస్యలను గాలికొదిలేసి జాతీయ రాజకీయాల కోసం అంతా ఢిల్లీ, బిహార్‌కు వెళ్లారని మండిపడ్డారు. జాతీయ పార్టీలకు ఓట్లు తప్ప.. రాష్ట్ర ప్రజల పాట్లు పట్టవని, యూరియా సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని ఆరోపించారు.

జాతీయ ఉత్తమ అధ్యాపకులుగా నలుగురు తెలుగువాళ్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని ఉన్నత విద్యాసంస్థలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్న నలుగురు లెక్చరర్లు, ప్రొఫెసర్లు జాతీయ ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. 2025కు గానూ కేంద్ర విద్య మంత్రిత్వ శాఖ.. దేశవ్యాప్తంగా 21 మంది లెక్చరర్లు, ప్రొఫెసర్లను జాతీయ ఉత్తమ అధ్యాపకులుగా మంగళవారం ఎంపిక చేసింది. ఇందులో ఏపీ నుంచి ప్రొఫెసర్ జె. విజయలక్ష్మి (స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ), డాక్టర్ మెండా దేవానంద కుమార్ (డాక్టర్ లాకిరెడ్డి హన్మిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, మైలావరం), తెలంగాణ నుంచి ప్రొఫెసర్ సాంకేత్ గోయల్ (బిట్స్‌పిలాని, హైదరాబాద్), ప్రొఫెసర్ వినీత్ ఎన్‌బీ (ఐఐటీ హైదరాబాద్)లు ఉన్నారు.

అక్టోబరు 8 నుంచి టీసీఎస్ భాగస్వామ్యంతో ఐఐటీహెచ్‌లో చిప్ డిజైన్ కోర్సు

కంది, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సంస్థతో కలిసి వీఎల్ఎస్ఐ చిప్ డిజైన్ సర్టిఫికేషన్ కోర్స్‌ను ప్రారంభించనుంది. ఈ కోర్సు ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్ రంగంలో పెరుగుతున్న నిపుణుల కొరతను తీర్చడానికి ఉపయోగపడుతుందని ఐఐటీహెచ్ అధికారులు తెలిపారు. వీఎల్ఎస్ఐ (వెరీ లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్) చిప్ డిజైన్ కోర్స్ అక్టోబరు 8న ప్రారంభమవుతుందని వారు పేర్కొన్నారు.

తెలంగాణలో నేడు, రేపు భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణలో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం మంచిర్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్, ములుగు, సిరిసిల్ల, హన్మకొండ, వరంగల్, భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, జనగాం, మెదక్, కామారెడ్డి, నిర్మల్, నారాయణపేట్, వనపర్తి జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు డాక్టర్ నాగరత్న వెల్లడించారు. హైదరాబాద్‌లో మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

సీఏ చదువుతూనే మోసాలు

» ఆస్పత్రి బిల్లులిప్పిస్తామని 118 మందికి బురిడీ

» రూ.90 లక్షలు స్వాహా.. ఢిల్లీ యువకుడి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని శిశు విహార్ వాసి సత్యం కుమార్ అలియాస్ సత్యం (26).. చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) చదువుతూనే జల్సాల కోసం మోసాలకు అలవాటు పడ్డాడు. ఇతనికి ఆంధ్రప్రదేశ్‌లోని జమ్మల మడుగు వాసి ముల్లుంటి సలీం మాలిక్ జత కలిశాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారిని వీరిద్దరు లక్ష్యంగా చేసుకున్నారు. తాము ఆరోగ్యశాఖ నుంచి మాట్లాడుతున్నామని, ఆస్పత్రి ఖర్చులు రీఫండ్ చేయిస్తామని నమ్మ బలికేవారు. ఒక లింక్ పంపి, అది ఓపెన్ చేసి యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే మీ ఖాతాలో డబ్బులు క్రెడిట్ అవుతాయని చెప్పి మోసాలకు పాల్పడేవారు. అలా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 118 మందిని బురిడీ కొట్టించి రూ.90 లక్షలు స్వాహా చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ ఎస్ఐ గణేశ్, సైబర్ క్రైం పోలీసులు ఢిల్లీలో సత్యంకుమార్ అలియాస్ సత్యంను రాజన్న-సిరిసిల్ల జిల్లా పోలీసులు అరెస్టు చేశారని ఎస్పీ మహేశ్ బీ గీతే మంగళవారం మీడియాకు చెప్పారు. సహ నిందితుడు సలీం మాలిక్‌ను కొన్ని రోజుల క్రితమే అరెస్టు చేసి రిమాండ్‌పై పంపామన్నారు.

డెంగీతో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

» పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్.. ఏఎన్‌ఎం తొలగింపు

» కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన



అనురాగ్(ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం పంగిడి మాదర గిరిజన ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి ఆత్రం అనురాగ్ (11) డెంగీ జ్వరంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ నెల 15న జ్వరంతో బాధ పడుతున్న అనురాగ్‌ను తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు తిర్యాణి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పారు. 3 రోజులు చికిత్స నందించినా తగ్గక పోవడంతో 19న మంచిర్యాల ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ నిర్వహించిన వైద్య పరీక్షల్లో డెంగీ జ్వరంగా నిర్ధారించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు అనురాగ్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. దీంతో విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగర్‌ను సస్పెండ్ చేసిన ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా.. ఏఎన్ఎం సువార్తను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలిచ్చారు. విద్యార్థి ఆరోగ్యం విషయమై సమాచారం తెలిస్తే కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించే వారమని గిరిజన సంక్షేమశాఖ అధికారి రమాదేవి తెలిపారు.

ఆ ప్రైవేట్ జెట్ వేలానికి.. కోర్టులో ఈడీ అభ్యర్థన

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఫాల్కన్ స్కామ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) అధికారులు స్వాధీనం చేసుకున్న ప్రైవేట్ జెట్ విమానాన్ని వేలం వేసేందుకు కసరత్తు ప్రారంభించారు. చాలాకాలంగా విమానాన్ని ఉపయోగించకుండా హ్యాంగర్‌లో ఉంచడం వల్ల సాంకేతిక సమస్యలు రావడంతో పాటు నిర్వహణ ఫీజు పెద్ద మొత్తంలో అవుతున్న నేపథ్యంలో వేలం వేయాలన్న ప్రతిపాదనను ఈడీ అధికారులు కోర్టు ముందుంచారు. ముందుగా దాని విలువను నిర్ధారించి ఆపై కోర్టు అనుమతితో వేలానికి వెళ్లాలని ఈడీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇరుగు పొరుగు దేశాలతో వైషమ్యాలు ఉన్నప్పుడు జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లవచ్చు. ఆ ప్రమాదాన్ని నివారించుకోవడానికి రెండు మార్గాలున్నాయి: ఒకటి రాజనీతిజ్ఞత, రెండోది సైనిక సంసిద్ధత. దక్షిణాసియాలోను, విశాల ప్రపంచంలోను ప్రస్తుతమున్న పరిస్థితుల దృష్ట్యా సైనిక పాటవాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. నిన్నగాక మొన్న శనివారం నాడు విజయవంతమైన దేశ తొలి సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ పరీక్ష ఆ అవసరాన్ని సమర్థంగా, ప్రభావదాయకంగా తీర్చింది.

'ఎదుటి పక్షం వారు నీ మాట మన్నించి, నీ మార్గాన్ని అనుసరించేలా చేయడమే దౌత్య కళ' అని తలపండిన రాజనీతిజ్ఞుడు ఒకరు ఏనాడో సుభాషించారు. గత పదకొండేళ్లుగా మనం అనుసరిస్తున్న దౌత్య విధానాలు ఈ సత్యాన్ని సార్థకం చేశాయా? సర్వోన్నత విధానకర్త వైయక్తిక పోకడలు మన పట్ల సమీప, సుదూర దేశాల సుహృద్భావాన్ని తగ్గించి వేశాయి. హరించివేశాయనడమే సబబుగా ఉంటుందేమో? ఆ సర్వోన్నతుడి చిత్తశుద్ధిని శంకించవలసిన అవసరం లేకపోయినా సునిశ్చిత దౌత్య సూత్రాలను పాటించనప్పుడు ఇటువంటి పరిస్థితి తప్పకపోవచ్చు. మనపై అహేతుక ద్వేషంతో రగిలిపోతున్న ఒక పొరుగుదేశం మారిన అంతర్జాతీయ పరిస్థితులను అదునుగా తీసుకుని అమానుష ఉగ్రవాద ఘాతుకానికి పాల్పడినప్పుడు ప్రతీకార చర్య చేపట్టడం అనివార్యమయింది. అయితే అది చిత్రంగా మనం అంతర్జాతీయ రాజకీయ చాణక్యాలలో ఎంత అవాస్తవికంగా వ్యవహరిస్తున్నామో తెలియజెప్పింది. దేశాన్ని ఏకాకిని చేస్తున్న దుస్తర పరిస్థితులను అధిగమించేందుకు కేవలం రాజనీతిజ్ఞతపైనే ఆధారపడకుండా సైనిక సంసిద్ధతను కూడా ఆలంబన చేసుకోవాలన్న సత్యాన్ని మన విధానకర్తలు గ్రహించారు.

ఆ సత్య గ్రహణతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 79వ స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) నాడు శత్రు దాడులను తటస్థీకరించడానికి మాత్రమే కాకుండా బలంగా ఎదురుదాడి చేయడానికి కూడా స్వదేశీ వైమానిక రక్షణ వ్యవస్థను అభివృద్ధిపరచనున్నట్టు ప్రకటించారు.

జయ మంగళం!

'రాబోయే పదేళ్ల కాలంలో అంటే 2035 సంవత్సరం నాటికి దేశంలోని సమస్త వ్యూహాత్మక, పౌర ప్రదేశాలూ కొత్త సాంకేతిక వేదికల ద్వారా సంపూర్ణ భద్రతా కవచాన్ని పొందుతాయని ఆయన అన్నారు. ప్రతి పౌరుడూ సురక్షితంగా ఉండేంతవరకు ఆ భద్రతాకవచం విస్తరిస్తూనే ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు. అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ ప్రధాన పాత్ర పోషించే, బహుళ స్థాయిలలో ఉండే ఈ భద్రతా కవచ వ్యవస్థకు శ్రీకృష్ణుని స్ఫూర్తితో 'సుదర్శన్ చక్ర' అని నామకరణం చేశారు. రక్షణ పరిశోధన సంస్థలు, సాయుధ బలగాల వ్యవస్థలు, ప్రైవేట్ సంస్థల సమన్వయ సహకారాలతో 'సుదర్శన్ చక్ర'ను నిర్మిస్తారు.

మిషన్ సుదర్శన్ చక్ర పరిపూర్తికి తొలి అడుగే శనివారం నాడు ఒడిషా తీరంలో విజయవంతంగా నిర్వహించిన సమీకృత రక్షణ ఆయుధ వ్యవస్థ తొలి పరీక్ష. శత్రు క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్ల నుంచి రక్షణ కల్పించే బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ ఇది. మూడు భిన్న ఆయుధాలు– ఉపరితలం నుంచి గగనతలంలోకి వేగంగా దూసుకు వెళ్లే క్షిపణి, స్వల్పశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ, లేజర్ ఆధారిత డైరెక్టెడ్ ఎనర్జీ ఆయుధ వ్యవస్థ ఇందులో అనుసంధానమై ఉండి మూడు భిన్న లక్ష్యాలను ఏకకాలంలో కూల్చివేయగలుగతాయి. ఇటువంటి అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు ఇంతవరకు అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, జర్మనీ, ఇజ్రాయెల్‌కు మాత్రమే ఉన్నాయి. కనుకనే భారత్ అభివృద్ధి పరచుకున్న సమీకృత గగనతల రక్షణ వ్యవస్థ చాలా ప్రాముఖ్యమున్న సైనిక పాటవ పురోగతి అని చైనీస్ రక్షణ వ్యవహారాల ఉన్నతస్థాయి నిపుణుడు ఒకరు అంగీకరించక తప్పలేదు.

సమీకృత గగనతల రక్షణ వ్యవస్థ విజయం వినూత్న సైనిక సాంకేతికత సముపార్జనలో అద్భుతమైన ముందుడగు కాగా ఆదివారం నాడు శ్రీహరికోటలో గగన్ యాన్ ప్రాజెక్టులో భాగంగా వ్యోమగాములను సురక్షితంగా తీసుకొచ్చే పారాచూట్ వ్యవస్థను పరీక్షించడానికి ఇస్రో చేపట్టిన మొదటి సమీకృత ఎయిర్ డ్రాప్ పరీక్ష విజయవంతమవడం భారతీయ వైజ్ఞానిక మేధకు ఒక దివ్యమైన వెలుగుదారి. భారతీయులు త్రివిక్రములు కాగలరనే భరోసాను ఇస్రో తాజా విజయం కల్పిస్తోంది. ఈ విజయాలు రెండూ ఉత్కృష్టమైనవే. మన పురోగతికి విశేషంగా తోడ్పడేవే. అయితే ఇదే సమయంలో మనం విస్మరిస్తున్న ఒక వాస్తవం ఉన్నది. అది మన ప్రాకృతిక వ్యవస్థలను మనమే స్వయంగా ధ్వంసం చేసుకోవడం. మన ఉనికికి ఆలవాలమైన ధరిత్రిని నిర్జీవం చేసుకోవడం విజ్ఞత ఎలా అవుతుంది? మన వైజ్ఞానిక విజయాలు 'ధరనుచొచ్చి, దివిని విచ్చి/ విరులు తాల్చు తరువు'లా నిత్య హరితంగా వర్ధిల్లాలంటే మనం మన ధాత్రిని సంరక్షించుకోవాలి. సజీవంగా ఉంచుకోవాలి. వినాయక చవితి శుభవేళ అటువంటి సంకల్పం వహించడమే ఆ ఆత్మీయ పురాణ పురుషునికి నిజమైన పూజ అవుతుంది.

ఆధార్ అనుసంధానంతోనే ఓటు అక్రమాలకు చెక్!

రాహుల్‌గాంధీ ఇటీవల ఓటు చోరీ ఆరోపణలతో లేవనెత్తిన డూప్లికేట్ ఓటర్ ఐడీ, అనుకూల ఓట్ల చేర్పు, అననుకూల ఓట్ల తొలగింపు వంటివి కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నవి. ఈ సమస్యను మూలాల్లోకి వెళ్లి చూడాలి. అసలు భారత ప్రభుత్వ హోమ్ శాఖ నిర్వహించే నేషనల్ సిటిజెన్ రిజిస్టర్ సమగ్రమైనది కాదు. అంతర్జాతీయ సరిహద్దు గల ప్రాంతాలలో వలసలు ఒక కారణం అయితే, 95శాతం జనాభా ఉన్న మిగతా రాష్ట్రాలలో ప్రతి పౌరుడికి ప్రత్యేకంగా గుర్తించే విధానం లేకపోవడం అతి పెద్ద కారణం.

అనవసరంగా డేటా సేకరించే పాత అలవాటు ఉన్న అధికార గణం వల్ల ఆధార్ ప్రాజెక్ట్ డిజైనులో ఒక లోపం జరిగింది. ఆధార్ కార్డుని బహుళార్థ సాధక ప్రాజెక్ట్ చేసే ప్రయత్నంలో భాగంగా కార్డుకి అడ్రస్, తల్లి, తండ్రి, ఫోన్ మాత్రమే గాక, మొదట్లో గ్యాస్ కనెక్షన్ నెంబర్ కూడా తీసుకున్నారు. ఇప్పటికీ అనేక కార్డుల పైన ఫోన్ నెంబర్ ముద్రించి ఇస్తున్నారు. ఇందులో వ్యక్తిగత గోప్యత అంశాలు ఇమిడి ఉన్నాయి. ఇంతకుముందు ఎలక్షన్ కమిషన్ ఓటర్ ఐడీకి ఆధార్‌ను అనుసంధానం చేసి డూప్లికేట్స్‌ను తీసివేసే ప్రక్రియ చేపట్టింది. పైన చెప్పిన లోపం చేత సుప్రీంకోర్ట్ ఆదేశాల వల్ల ఆధార్ అనుసంధానం ఐచ్ఛికం అయ్యింది. మొత్తానికి లక్ష్యం నీరు గారిపోయింది. ప్రస్తుతం ఆధార్ కార్డు వల్ల పౌరులకు అనేక సేవలు అందుతున్నప్పటికిని అది ఐచ్ఛికం చేయడం వల్ల అసలు లక్ష్యాలు దెబ్బతిన్నాయి. పౌరులు ప్రయోజనం పొందే దగ్గర ఆధార్ సమర్పించి, ఎగవేతల దగ్గర మిగతా ఐడీలు వాడుతున్నారు.



ప్రస్తుతం ఆధార్ కార్డు వల్ల పౌరులకు అనేక సేవలు అందుతున్నప్పటికి, అది ఐచ్ఛికం చేయడం వల్ల అసలు లక్ష్యాలు దెబ్బతిన్నాయి. ప్రయోజనం పొందే దగ్గర పౌరులు ఆధార్ సమర్పించి, ఎగవేతల దగ్గర మిగతా ఐడీలు వాడుతున్నారు.

భారత ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్ ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేయాలి. 1) ఆధార్ కార్డును ఆధార్ ఐడీ గాను, ఆధార్ అడ్రస్ గాను రెండుగా విభజించాలి. ఐడీ కార్డులో కేవలం వ్యక్తి ఫోటో, పేరు, యూనీక్ నెంబర్ మాత్రమే ఉంచి మిగతావి తొలగించి ఐడీకి మాత్రమే పరిమితం చేయాలి. 2) ఆధార్ అడ్రస్ అని కొత్త కార్డు ప్రవేశపెట్టి అందులో, శాశ్వత చిరునామా, ప్రస్తుత చిరునామాల పేరిట రెండు క్యాటగిరీలుగా అడ్రస్ తీసుకోవాలి. ప్రస్తుత చిరునామాని వ్యక్తులు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా అప్డేట్ చేసుకొనే అవకాశం ఇవ్వాలి. అది డిజిటల్‌గా లోకేట్ చేసే విధంగా ఉండాలి. కార్డులో ఉండే అడ్రస్ ఆధారంగా మాత్రమే యుటిలిటీ సర్వీసెస్‌ను ప్రజలకు అందచేయాలి. ఎప్పటికప్పుడు అడ్రస్ అప్డేట్ రికార్డు చేసుకోవడం వల్ల ఒక వ్యక్తి అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా, పట్టణాల, గ్రామాల వలస చరిత్ర మొత్తం రికార్డు అవుతుంది. 3) పుట్టిన, మరణించిన ప్రతి మనిషికి ఆధార్ తప్పనిసరి చేయాలి. 4) ఆధార్ ఐడీ ఆధారంగా దేశపరిధిలో ఉన్న ప్రతి మనిషికి నెంబర్ కేటాయించి, జీవించి వున్న మనుషుల జాబితాను (నేషనల్ హ్యూమన్ రిజిస్టర్‌ని) డూప్లికేట్ లేకుండా తయారు చేసుకొన్న తర్వాత, ప్రస్తుతం ఉన్న చట్టాలు, ఆధార్ కార్డు ఆధారంగా పౌరసత్వపు కార్డు మంజూరు చేయవచ్చు (నేషనల్ సిటిజెన్‌షిప్ రిజిస్టర్ తయారు చేయవచ్చు). లేదా ఆధార్ ఐడీని సిటిజెన్‌షిప్‌కి ఎనేబుల్ చేయవచ్చు. అట్లాగే ఓటర్ ఐడీ, ఇతర కార్డులు జారీ చేయవచ్చు. 5) జనన మరణాలు నేషనల్ హ్యూమన్ రిజిస్టర్‌కి అనుసంధానం చేసి ప్రతి జననం తర్వాత, మరణం తర్వాత ఆధార్ ఐడీ కూడిక/ తీసివేత చేసిన తర్వాతే జనన/ మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి.

ఈ చర్యల ద్వారా భారత ప్రభుత్వం వద్ద డైనమిక్‌గా లిస్ట్ అప్డేట్ అవుతుంది. ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోనవసరం లేకుండా పుట్టిన తేదీ ఆధారంగా నేషనల్ హ్యూమన్ రిజిస్టర్ నుండి 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులకు ఓటర్ ఐడీ జారీ కావాలి, లేదా ఆధార్ ఐడీని ఓటింగ్‌కి ఎనేబుల్ చేయాలి. ఈ చర్యలు తీసుకున్న తర్వాత ఎలక్షన్ కమిషన్ ప్రతి ఎన్నికకూ ముందు ఓటర్ జాబితా సవరణ చేపట్టాల్సిన అవసరం ఉండదు. హోమ్ మినిస్ట్రీ దగ్గర ఉన్న నేషనల్ సిటిజెన్ రిజిస్టర్ ద్వారా ఎన్నికలకు సిద్ధం కావచ్చు.

ఎలక్షన్ కమిషన్ కూడా పోలింగ్ బూత్‌లో ట్యాబుల వాడకం మొదలుపెట్టాలి. నియోజకవర్గానికి చెందిన మొత్తం ఓటర్ లిస్ట్‌తో లోడ్ చేసిన ట్యాబు పోలింగ్ బూత్‌కి ఇవ్వాలి. ఓటర్ ఐడీ కార్డులో ఉండే బార్ కోడ్ స్కాన్ చేసుకొని, వచ్చిన వివరాలతో థంబ్ ద్వారా, లేదా ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకొని ఓటింగ్‌కి అవకాశం ఇవ్వాలి. అవసరం అయితే ఓటర్ ఫోటోను కూడా ట్యాబులో తీసుకోవచ్చు. దీని ద్వారా ఫేక్, బినామీ ఓటర్లను అరికట్టవచ్చు. డిజిటల్ లిస్ట్ ట్యాబ్‌లో ఉంటుంది కాబట్టి ఎన్నిక జరుగుతున్న ప్రాదేశిక నియోజకవర్గం పరిధిలో ఏ బూత్‌లోనైనా ఓటింగ్‌కి అవకాశం కల్పించవచ్చు. తద్వారా ఓటింగ్ శాతం పెరిగే, రియల్ టైమ్‌లో ట్యాబ్‌ల ద్వారా ఓటింగ్ శాతం మోనిటర్ చేసే అవకాశం ఉంది. పోలైన ఓట్లు, సంతకాలు పెట్టిన ఓట్లు తేడా వచ్చే అవకాశం లేదు. ఈ విధంగా ఎలక్షన్ కమిషన్ సాంకేతికతను ఆలంబన చేసుకొని మరింత పకడ్బందీ ఎన్నికలు నిర్వహించాలి.

• వంశీకృష్ణ

నేరచరితుల ఆటకట్టు సాధ్యమేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'నీకెంత సేన ఉన్నా వ్యూహం లేకపోతే నీవు జనరల్ కాలేవు..' అన్న ఒక సైనిక నిపుణుడి ఉవాచ రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. రాజకీయాల్లో వ్యూహరచన చేసే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంత సిద్ధహస్తుడు మరొకరు లేరు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఆయన ఇప్పటి నుంచే సిద్ధపడుతున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొద్ది రోజుల క్రితమే వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే వచ్చే సెప్టెంబర్ నెలాఖరులో షెడ్యూలు ప్రకటించబోతున్న బిహార్ ఎన్నికలకు ఆయన ఎంత ముందుగా సన్నాహాలు చేసి ఉంటారో వేరే చెప్పనక్కర్లేదు.

సాధారణంగా ఏవైనా ఎన్నికలకు ముందు పార్లమెంట్ సమావేశాలు పెద్దగా జరిగే అవకాశాలు లేవు. పార్లమెంట్‌లో లేవనెత్తే అంశాలే తర్వాత జరగబోయే ఎన్నికలకు ప్రధాన ప్రచారాస్త్రాలవుతాయని అటు అధికార పక్షానికీ, ఇటు ప్రతిపక్షాలకూ తెలుసు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను తమకు అనుకూలంగా తిప్పుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తే బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ, గత మేలో పాకిస్థాన్‌పై ప్రారంభించిన యుద్ధాన్ని ఆకస్మికంగా విరమించడం లాంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి. ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసేందుకు కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. దీనితో మోదీ ప్రభుత్వం తన వ్యూహ రచనపై పునరాలోచనలో పడ్డది.

నిజానికి ఆగస్టు 12నే ఉభయ సభలను వాయిదా వేయాలని తొలుత నిర్ణయం తీసుకుని ఆ విషయం ఫ్లోర్ నేతల సమావేశంలో తెలియజేశారు. కాని మోదీ, షా ఏమి ఆలోచించారో కానీ ఆమోదించాల్సిన బిల్లులేవీ లేకున్నా యథా ప్రకారం ఆగస్టు 21 వరకు పార్లమెంట్‌ను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 19 రాత్రి పొద్దుపోయిన తర్వాత ఉన్నట్లుండి 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, అందుకు సంబంధించిన ఇతర బిల్లులను మరునాడు ప్రవేశపెట్టనున్నట్లు బులెటిన్ విడుదల చేశారు. పార్లమెంట్ సభ్యులు అందరికీ బిల్లుల ప్రతిని పంపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు అయిదేళ్లపాటు శిక్షపడదగిన నేరానికి అరెస్టయి నెలరోజుల పాటు జైలులో ఉంటే రాజీనామా చేయాలని, లేకపోతే వారు ఆ పదవులను కోల్పోయినట్లేనని ఈ బిల్లు సారాంశం. ఇప్పటి వరకూ మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రిని పోస్టుల నుంచి తొలగించేందుకు చట్టపరమైన నిబంధనలేవీ లేవు. లిల్లీ థామస్ కేసులో ఎమ్మెల్యే, ఎంపీలకు రెండేళ్లు, అంతకు మించి శిక్ష పడితే వారు సభ్యులుగా కొనసాగకూడదని 2013లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసు ఆధారంగానే గుజరాత్‌లో సూరత్ కోర్టు ఒక పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి రెండేళ్ల శిక్ష విధించడంతో ఆయన సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

అసలీ బిల్లును ఇంత ఆగమేఘాలపై ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చింది? జమిలి ఎన్నికల వంటి ముఖ్యమైన అంశంపై అఖిలపక్ష సమావేశాల్లో చర్చించిన ప్రభుత్వం ప్రధాన పదవుల్లో ఉన్నవారి నేర చరిత్ర గురించి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ముందు ఎవరితోనూ చర్చించనవసరం లేదా? అందుకోసం కనీసం కేబినెట్ సమావేశంలోనైనా చర్చ జరిగిందా? అన్న ప్రశ్నలకు జవాబులు లేవు. అసలీ దేశంలో ప్రధాన మంత్రులను కేంద్ర సంస్థలు ఎప్పుడైనా అరెస్టు చేసే అవకాశాలున్నాయా? అన్నది ఆసక్తికరమైన ప్రశ్న. విచిత్రమేమంటే కస్టడీ నుంచి విడుదలైన తర్వాత మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి, మళ్లీ పదవులు స్వీకరించేందుకు ఎలాంటి అడ్డంకులూ లేవని కూడా ఈ బిల్లు పేర్కొంటోంది. అటువంటప్పుడు ఈ బిల్లు ప్రవేశపెట్టడం వల్ల ప్రయోజనమేమిటి?

ఈ బిల్లుకు ప్రచారం కంటే పెద్ద ప్రయోజనం లేదని అధికారపక్షానికి తెలియనిది కాదు. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నందువల్ల దాన్నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ బిల్లు ప్రవేశపెట్టారన్న విశ్లేషణలూ లేకపోలేదు. ప్రభుత్వం ఊహించినట్లుగానే బిల్లుపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. తద్వారా అవినీతిపై తాము చేస్తున్న పోరాటాన్ని వారు వ్యతిరేకిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర నేతలు ఆరోపించేందుకు ఆస్కారం కలిగింది.

ఏమైనా ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయనడంలో సందేహం లేదు. రాహుల్‌గాంధీ ఇప్పటికే యాత్రలు ప్రారంభించి ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. పహల్గాం దాడి కాగానే మోదీ కూడా బిహార్‌కే వెళ్లి పాకిస్థాన్‌కు బుద్ధి చెబుతానని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌కు తోడు రాజ్యాంగ సవరణ బిల్లు కూడా ప్రతిపక్షాలను ఎండగట్టేందుకు మోదీ సేన ఉపయోగించుకుంటుందనడంలో సందేహం లేదు.

రాజ్యాంగ సవరణ బిల్లు పట్ల ప్రతిపక్షాలు ఆందోళన చెందేందుకు కారణాలు లేకపోలేదు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కుప్పకూల్చేందుకు కేంద్రం సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ఏజెన్సీలను తప్పక ఉపయోగించుకోగలదని విపక్షాలు గట్టిగా విశ్వసిస్తున్నాయి. మనీలాండరింగ్ చట్టం ప్రకారం ఒక ముఖ్యమంత్రిని కానీ, మంత్రిని కానీ అరెస్టు చేస్తే వారికి 30 రోజుల వరకు బెయిల్ దొరికేందుకు అవకాశం లేదు. అదే అదనుగా వారిని తొలగించవచ్చు. ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వం కుప్పకూలిపోతుందని లేదా అధికారంలో ఉన్న పార్టీలో లుకలుకలు బయలుదేరుతాయనేది కూడా ప్రతిపక్షాల వారి ఆందోళన. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు ముఖ్యమంత్రి పదవికోసం మంత్రి పదవులకోసం అర్రులు చాస్తూ ఉంటారు. కనుక ఆ పార్టీని దెబ్బతీయడం కేంద్రంలో ఉన్న పార్టీకి సులభం.

ఈ బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వానికి అనేక కారణాలున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో అరెస్టయి 156 రోజులు జైలులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. ఆయన మంత్రివర్గంలో ఉన్న సత్యేంద్ర జైన్ హవాలా కేసులో అరెస్టయినప్పటికీ చాలా కాలం మంత్రి పదవిలో కొనసాగారు. తమిళనాడులో కూడా డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ తన మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలుపాలైనప్పటికీ అతడిని మంత్రివర్గంలో కొనసాగించారు. మంత్రివర్గం నుంచి తొలగించాలని గవర్నర్ రవి ఆదేశించినప్పటికీ స్టాలిన్ ఒప్పుకోలేదు.

నిజానికి గతంలో ఆరోపణలు వచ్చినా, కోర్టు వ్యాఖ్యలు చేసినా, తమ మంత్రిత్వశాఖ పరిధిలో ఏవైనా దుర్ఘటనలు జరిగినా మంత్రులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసేవారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాపిటేషన్ ఫీజులపై హైకోర్టు తప్పుపట్టడంతో ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని రాజీనామా చేయించారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న యడ్యూరప్ప, తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత, బిహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ తమను అరెస్టు చేయకముందే పదవులనుంచి తప్పుకున్నారు.



రాజకీయాల్లో నేరచరితులను అదుపు చేయడానికి చిత్తశుద్ధి ఉంటే అందుకు సవాలక్ష మార్గాలున్నాయి. వోహ్రా కమిషన్ తన నివేదికలో చేసిన సిఫారసులను ఏ ప్రభుత్వమూ అమలుపరచనేలేదు. లోక్‌పాల్ వ్యవస్థ ఇప్పుడు నామ మాత్రంగా పనిచేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 1618 మంది అభ్యర్థుల్లో 16 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా బీజేపీతో పాటు అన్ని రాజకీయ పార్టీలు నేరచరితులకు టిక్కెట్లు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకోగలవా?

రాజకీయ నాయకులు చాలా మందికి ఈ అరెస్టుల వల్ల పెద్దగా నష్టం జరిగిన దాఖలాలు లేవు. హేమంత్ సోరెన్ జైలు నుంచి వచ్చిన తర్వాత ఎన్నికల్లో పోరాడి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. లాలూప్రసాద్ తాను అరెస్టయ్యే ముందు రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేసినప్పటికీ ఆయన ప్రభుత్వం పడిపోలేదు. జయలలిత తాను అరెస్ట్ అయిన రెండుసార్లూ ఒకసారి పన్నీర్‌సెల్వన్‌ను, రెండవ సారి పళనిస్వామిని ముఖ్యమంత్రి చేశారు. రెండుసార్లూ ఆమె ప్రభుత్వానికి పెద్దగా ఢోకా రాలేదు. గత ఏడాది జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టుకు ముందే రాజీనామా చేసి చంపాయి సోరెన్‌ను ముఖ్యమంత్రి చేశారు. బహుశా కేజ్రీవాల్ కూడా ముందే రాజీనామా చేసి ఉంటే మళ్లీ మెజారిటీ సాధించేవారేమో. అప్పుడు కేంద్రం ఈ బిల్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం కూడా ఉండేది కాదు.

అయినా ప్రభుత్వాలను పడగొట్టాలంటే ఇలాంటి బిల్లులు ఏ మాత్రం అవసరం లేదు. గతంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే, కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి ప్రభుత్వాలను పడగొట్టేందుకు బీజేపీ వేర్వేరు మార్గాలను అనుసరించింది. ముఖ్యమంత్రులనో, మంత్రులనో అరెస్టు చేసినంత మాత్రాన ప్రభుత్వాలు పడిపోతాయని చెప్పడానికి లేదు. పైగా అసంబద్ధంగా కుట్రపూరితంగా అరెస్టులు జరిగితే న్యాయవ్యవస్థ చేతులు ముడుచుకుకూర్చునే అవకాశాలు తక్కువ. కేంద్రం కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, మంత్రులను కేసుల్లో ఇరికిస్తే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర మంత్రులపై తమ పోలీసులను, ఏజెన్సీలను ప్రయోగించేందుకు పూనుకోవచ్చు. ఇది ఒక గందరగోళ పరిస్థితికి దారితీస్తుంది. అయినా ఇప్పుడున్న కేంద్ర ఏజెన్సీలనే రాష్ట్ర నేతలపై ప్రయోగించే అవకాశం ఉండగా రాజ్యాంగ సవరణ తేవాల్సిన అవసరం ఏమున్నది?

రాజకీయాల్లో నేరచరితులను అంతం చేయడానికి చిత్తశుద్ధి ఉంటే అందుకు సవాలక్ష మార్గాలున్నాయి. నేరచరితులపై వోహ్రా కమిషన్ తన నివేదికలో చేసిన సిఫారసులను ఏ ప్రభుత్వమూ అమలుపరచనేలేదు. లోక్‌పాల్ వంటి వ్యవస్థ కోసం బీజేపీ గతంలో పోరాడింది. కానీ ఆ వ్యవస్థ ఇప్పుడు నామమాత్రంగా పనిచేస్తోంది. ప్రధానమంత్రి, కేంద్రమంత్రులపై వచ్చిన ఫిర్యాదులపై లోక్‌పాల్ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నదో ఎవరికీ తెలియదు. జగన్మోహన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి లాంటి వారిపై తీవ్ర ఆరోపణలున్నా ఏజెన్సీలు సరిగా పనిచేయడంలేదనే వాదనలూ లేకపోలేదు. నేరచరితులు అధికార పార్టీలో చేరగానే వారి నేరాలు ప్రక్షాళన అయ్యాయన్న విమర్శలూ వచ్చాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల్లో న్యాయమూర్తులను సరైన సంఖ్యలో నియమించకపోవడంతో అనేకమంది నేరచరితులు తప్పించుకుంటున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన 1618 మంది అభ్యర్థుల్లో 16 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. చార్జిషీటు దాఖలైనప్పుడే అనర్హత వేటు వేయాలని లా కమిషన్ కూడా సూచించింది. అయినా త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా బీజేపీతో పాటు అన్ని రాజకీయ పార్టీలు నేరచరితులకు టిక్కెట్లు ఇవ్వకూడదని నిర్ణయం తీసుకోగలవా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)


'సల్వాజుడుం' తీర్పుపై రాజకీయ దాడి

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం ఎన్డీఏ కూటమికి ఆందోళన కలిగిస్తున్నట్లుంది. లేదంటే సుదర్శన్‌రెడ్డిపై కేంద్ర హోం మినిస్టర్ అంత తీవ్రంగా ఆరోపణలు చేయవలసిన అవసరం లేదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి నక్సలైట్ల మద్దతుదారు అనీ, అందుకే సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పు ఇచ్చారనీ, ఈ తీర్పు ఇవ్వకపోతే 2020 వరకే దేశంలో నక్సలిజం అంతం అయ్యేదనీ హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పులలో లోపాలు ఉంటే ఎత్తి చూపడం తప్పు ఏమీ కాదు. కానీ ఎటువంటి ఆధారాలూ చూపకుండా, తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు ఉద్దేశాలను అంటగడుతూ వ్యక్తిగత దాడి చేయడం కోర్టు ధిక్కారం కిందకు రాగల నేరం!

ఇంతకూ సల్వాజుడుం అంటే ఏమిటో, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సుదర్శన్‌రెడ్డి దానిపైన ఇచ్చిన తీర్పు ఏమిటో ఒకసారి చూద్దాం. 2005లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమానికి వ్యతిరేకంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కొంతమంది స్థానిక ఆదివాసీ యువకులను చేరదీసి, వారికి తుపాకులు ఇచ్చి స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీఓలు)గా నియమించింది. వీరూ, స్థానిక పెత్తందారులూ కలసి మావోయిస్టు పార్టీకి చెందిన సంఘాలు ఉన్న గ్రామాలపైన దాడులు చేశారు. హత్యలు, అత్యాచారాలు చేశారు. గ్రామాలకు గ్రామాలను తగుల బెట్టారు. బలవంతంగా దాదాపు లక్ష మంది ఆదివాసీలను 'సల్వాజుడుం శిబిరాలు' పేరిట కాన్సన్‌ట్రేషన్ క్యాంపుల్లో పెట్టి వేధించారు. ఒక లెక్క ప్రకారం రెండేళ్ళలో 600 గ్రామాలను తగులబెట్టి, 23 సల్వాజుడుం శిబిరాలలో యాభై వేలమంది ప్రజలను బలవంతంగా ఉంచారు. ఈ ఎస్పీఓల నాయకత్వంలో జరిగిన ఈ దాడులకు 'సల్వాజుడుం' అని పేరు పెట్టారు. ఈ పదానికి 'శాంతి కొరకు పోరాటం' అని అర్థం చెప్పుకున్నారు. కానీ దాని అసలు అర్థం బలి కోసం చేసే వేట. సల్వాజుడుం వలన హింసాత్మక ఘటనలు పెరిగిపోతున్నాయని స్థానిక పత్రికలు ఎన్నో వార్తలు ప్రచురించాయి. దేశవ్యాప్తంగా హక్కుల సంఘాలు దీనికి వ్యతిరేకంగా నిరసనలు చేశాయి.

2007లో సల్వాజుడుం వ్యవహారాలను, దానికి ప్రభుత్వ మద్దతును సవాలు చేస్తూ ప్రముఖ విద్యావేత్త నందినీ సుందర్, సుప్రసిద్ధ విశ్రాంత పాలనాధికారి, భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇ.ఎ.ఎస్.శర్మ; చరిత్ర పరిశోధకులు రామచంద్ర గుహ తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సుదర్శన్‌రెడ్డి, సహ న్యాయమూర్తి సురేందర్ సింగ్ నిజ్జర్‌లు కలిసి సుదీర్ఘమైన వాదప్రతివాదాలు విన్న తర్వాత, 2011లో సల్వాజుడుం పైన చరిత్రాత్మకమైన తీర్పును ఇచ్చారు. తుది తీర్పు ఇచ్చిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సురేందర్‌సింగ్ నిజ్జర్‌లు మాత్రమే గాక, అంతకు ముందు విచారించిన న్యాయమూర్తులు– జస్టిస్ బాలకృష్ణన్, జస్టిస్ కపాడియా, జస్టిస్ అల్తాబ్ ఆలంలు కూడా ప్రభుత్వమే ప్రజలకు ఆయుధాలు ఇచ్చి హింసకు ప్రోత్సహించడం రాజ్యాంగ విరుద్ధం అని స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుతో ఛత్తీస్‌గఢ్‌లో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ల నియామకం ఆగిపోవటం వల్లనే నక్సలిజం కొనసాగింది అన్నది అమిత్ షా ఆరోపణ. కానీ ఈ తీర్పుతో ఎస్పీఓల వ్యవస్థ ఆగిపోలేదు. ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ పోలీసు చట్టాన్ని తీసుకువచ్చి రకరకాల పేర్లు మార్చి, రూల్స్ మార్చి అటువంటి వ్యవస్థలనే ఆ తర్వాత కూడా కొనసాగించారు. ఎస్పీఓల వ్యవస్థ ఆ తర్వాత డీఆర్జీగా అవతారం ఎత్తింది. కాబట్టి అమిత్ షా ఆరోపణలకు ఎటువంటి ఆధారమూ లేదు.



ఏమీ తెలియని ఆదివాసీ యువకులను స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా చేసి, వారికి ఆయుధాలను ఇచ్చి మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో ముందు నిలబెట్టడాన్ని ఈ తీర్పు తప్పుపట్టింది: "వారిని కేవలం తాత్కాలికంగా నియమించడం, గౌరవవేతనం మాత్రమే ఇవ్వడం ఆర్టికల్స్ 21, 14లను భంగపరచడమే! వారికి సాధారణ పోలీసులతో సమానమైన బాధ్యతలు ఇచ్చి, వారికన్నా ప్రమాదకరమైన పరిస్థితులలో నిలబెట్టి ఈ విధులు నిర్వర్తించడం ఆర్టికల్ 14కు వ్యతిరేకం. ఇతర పోలీసుల కన్నా ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సిన ఈ ఎస్పీఓలకు వారి కంటే తక్కువ వేతనం ఇవ్వడం వారి జీవితం విలువను కించపరచడమే! వారి పేదరికాన్నీ, ఆవేశాన్నీ, క్రూర సామాజిక స్థితికి బాధితులై పగతీర్చుకోవాలన్న వారి తపననీ వాడుకుని ఆ యువకులను ప్రమాదకరమైన ఇలాంటి పనుల్లో నియమించడం అంటే– వారి మనోభావాలను దుర్వినియోగం చేయడమే!" అని ఈ తీర్పు నిర్ధారించింది. 'నక్సలైటు వ్యతిరేక ఫిరంగులకు ఈ ఆదివాసీ యువకులను గ్రాసంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వాడుకుంటున్నదా?' అని కూడా ప్రశ్నించింది.

మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే– కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలు విద్యార్థులకు చెందిన స్కూళ్లను, హాస్టళ్లను, అంగన్వాడీ భవనాలను వెంటనే ఖాళీ చేయాలని కూడా కోర్టు తన తీర్పులో చెప్పింది. దీనిపై స్పందిస్తూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం భద్రతాదళాల స్వాధీనంలో ఏ భవనాలూ లేవనీ, అన్నిటినీ ఖాళీ చేశామనీ చెప్పింది. కాని పరిశీలనలో ఆ భవనాలన్నీ భద్రతా దళాల స్వాధీనంలోనే ఉన్నాయని తేలింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం విడిగా మరో ప్రమాణ పత్రం సమర్పించి సుప్రీంకోర్టు ఉత్తర్వులను అమలు చేయడానికి సమయాన్ని కోరింది. సుప్రీంకోర్టు వల్లనే భద్రతా బలగాలు ఇతర ప్రభుత్వ విభాగాల భవనాలను ఖాళీ చేశాయి.

సుప్రీంకోర్టు తీర్పుతో ఛత్తీస్‌గఢ్‌లో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ల నియామకం ఆగిపోవటం వల్లనే నక్సలిజం కొనసాగింది అన్నది అమిత్ షా ఆరోపణ. కానీ ఈ తీర్పుతో ఎస్పీఓల వ్యవస్థ ఆగిపోలేదు. ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ పోలీసు చట్టాన్ని తీసుకువచ్చి రకరకాల పేర్లు మార్చి, రూల్స్ మార్చి అటువంటి వ్యవస్థలనే ఆ తర్వాత కూడా కొనసాగించారు. ఎస్పీఓల వ్యవస్థ ఆ తర్వాత డీఆర్జీగా అవతారం ఎత్తింది. కాబట్టి అమిత్ షా ఆరోపణలకు ఎటువంటి ఆధారమూ లేదు.

ఈ వ్యవస్థ ఆగలేదు కాబట్టే– సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంపై కోర్టు ధిక్కారం కింద చర్యలు తీసుకోవాలని నందినీ సుందర్, రామచంద్ర గుహ పిటిషన్ దాఖలు చేశారు. దీనికి స్పందిస్తూ సుప్రీంకోర్టు జూలై 24, 2012లో ప్రస్తుత పరిస్థితిని వివరించాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా ఆ రాష్ట్ర ప్రభుత్వం తను చేయాలనుకున్నదే చేసింది. ఎంతో అనుభవం ఉన్న న్యాయవాదుల బృందం, సమాజంలోని ప్రముఖ వ్యక్తులు, సంవత్సరాల తరబడి చేసిన శ్రమ, ఒక చరిత్రాత్మకమైన తీర్పు... ఇవేవీ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనను ఆపలేకపోయాయి.

ఇంతకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నక్సలైట్ల పక్షం తీసుకున్నారనే వాదనలో నిజం ఎంత ఉన్నదో వారు ఇచ్చిన తీర్పులోని మరొక భాగం చూస్తే అర్థమవుతుంది. తీర్పులోని 68వ పాయింట్ ఇలా చెబుతోంది: "మావోయిస్టు లేదా నక్సలైట్ హింస వల్ల ఛత్తీస్‌గఢ్ రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నది వాస్తవమేనని మేము గుర్తించాం. ఎన్నో సామాజిక, ఆర్థిక కారణాలు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన కొన్ని విధానాలు నక్సల్ హింసకు కారణం అయినప్పటికీ, నక్సలైట్ హింసను మేము క్షమించలేం. రాజ్యాన్ని కూలదోయడం, రాజ్య ప్రతినిధులను చంపడం, అమాయక పౌరులను హింసించడం అంటే చట్టబద్ధమైన జీవన విధానాన్ని ధ్వంసం చేయడమే. ఇటువంటి హింసాయుత తీవ్రవాదాన్ని ఎదిరించి పోరాడిన దేశ ప్రజలకు భద్రత కల్పించవలసిన నైతిక రాజ్యాంగపరమైన బాధ్యత రాజ్యంపైన ఉంది. ఇది ప్రాథమిక అవసరం అని కూడా మేము భావిస్తున్నాం". తీర్పులోని ఈ చిన్న భాగం చూసినా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నక్సలైట్ల పక్షం వహించారన్న ఆరోపణలు అవాస్తవాలని తెలిసిపోతుంది. అమిత్ షా ఆరోపణ ఉపరాష్ట్రపతి ఎన్నికలో భాగంగా చేసిన ఒక రాజకీయ ఎత్తుగడ మాత్రమే.

■ లంకా పాపిరెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- ఎంజీఎం ఆస్పత్రిలో తనిఖీలు... వైద్యులతో సమీక్ష



ఎంజీఎం ఆస్పత్రిలో మందుల పంపిణీ కేంద్రం వద్ద మాట్లాడుతున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

6

అక్రమ నిర్మాణాలపై కొరడా

- ప్రతాపరుద్ర కాలనీ, సాయిగణేశ్ కాలనీలో కూల్చివేసిన జీడబ్ల్యూఎంసీ
- సిబ్బందిపై రాళ్లు రువ్విన గుర్తుతెలియని వ్యక్తులు

6

ప్రేమ..పెళ్లి...మోసం

6

మొదటి భార్యకు తెలియకుండా రెండో పెళ్లి చేసుకున్న ఘనుడు

జయములివ్వు బొజ్జ గణేశా!

- నవరాత్రి వేడుకలకు వాడవాడనా సిద్ధమైన మండపాలు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో దుకాణాల్లో సందడి
- భారీగా విగ్రహాల విక్రయాలు
- ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ
- మండపాలకు ఉచితంగా విద్యుత్
- ఎటుచూసినా ఆధ్యాత్మిక పరిమళాలే...

నేడు వినాయక చవితి పర్వదినం

7



భద్రకాళి ఆలయ అభివృద్ధికి కృషి

మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్



అమ్మవారిని దర్శించుకున్న బలరాం నాయక్

వరంగల్ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చారిత్రక భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేక క్యారిడార్ ద్వారా అభివృద్ధి చేస్తామని, ఇందుకోసం ప్రసాద్ యోజన పథకం ద్వారా రూ. 150 కోట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామని మహబూబాబాద్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ అన్నారు. మంగళవారం ఆయన భద్రకాళి అమ్మవారితో పాటు వల్లభ గణపతిని, భద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.30 కోట్లు కేటాయించారని, దానికి తోడు ప్రసాద్ యోజన పథకం కింద రూ. 150 కోట్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామని అన్నారు. ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

బిహార్‌లో రానున్నది ఇండియా కూటమే

వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య



బిహార్‌లోని సుపాల్ ప్రాంతంలో ఓట్ అధికార యాత్రలో పాల్గొన్న ఎంపీ డాక్టర్ కావ్య

హనుమకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇరవై ఏళ్ల ప్రజా కంటక నితీష్ బీజేపీ పాలన నుంచి బిహారీలకు విముక్తి లభించబోతున్నదని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. బిహార్ మిథిలాంచల్ ప్రాంతంలోని సుపాల్‌లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ఓట్ అధికార యాత్రలో కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంక గాంధీతో కలిసి డాక్టర్ కావ్య పాల్గొన్నారు. అక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యలను అక్కడ మారుతున్న రాజకీయ వాతావరణాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ బీహార్‌లో నితీష్ కుమార్, బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. అందుకే బీహార్ ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారన్నారు.

ముగియనున్న ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ

హనుమకొండలో ముగియగా, వరంగల్‌లో ఒక్క రోజు ఆలస్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ సజావుగా ముగిసిందని హనుమకొండ డీఈవో డి.వాసంతి పేర్కొన్నారు. 137స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉండగా 104మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. వీరందరికి మంగళవారం ఉత్తర్వులు అందజేయగా వారు 15రోజుల్లో పదోన్నతులు పొందిన స్థానాల్లో జాయిన్ కావాల్సి ఉంది. అయితే వరంగల్ జిల్లాల్లో మాత్రం పదోన్నతుల ప్రక్రియ ఒక రోజు ఆలస్యంగా ముగియనుంది. ఇటీవలే డీఈవో బదిలీ కావడం, ఖాళీల సంఖ్య ఖచ్చితంగా తేలకపోవడంతో ఒక్క రోజు ఆలస్యమైంది, మంగళవారం ఉపాధ్యాయులకు ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యి బుధవారం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు అందనున్నాయి. కాగా, వరంగల్ జిల్లాలో 129స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉండగా 82మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు రానున్నాయి. అర్హులు లేకపోవడంతో 47పోస్టులు ఖాళీలుగానే ఉండనున్నాయి.

రేపటి నుంచి కేయూ కామర్స్ విభాగంలో కార్యశాల

కేయూ క్యాంపస్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కార్యశాల నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అమరవేణి తెలిపారు. డేటా డ్రివెన్ టీచింగ్ బిజినెస్ అనాలటిక్స్ అండ్ పవర్ బీఐ ఫర్ ఎడ్యుకేటర్ అనే అంశంపై జరిగే కార్యశాలకు ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, బీవోఎస్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, సుబేదారి యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నరసింహాచారిలు హాజరుకానున్నట్లు తెలిపారు. వరంగల్ నిట్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రాహుల్ తండేడ, హైదరాబాద్ టాలీ కార్పొరేట్ ట్రైనర్ ఆలోక్‌కుమార్‌సింగ్, నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

- ప్రతాపరుద్ర కాలనీ, సాయి గణేశ్ కాలనీలో కూల్చివేసిన జీడబ్ల్యూఎంసీ
- సిబ్బందిపై రాళ్లు రువ్విన గుర్తు తెలియని వ్యక్తులు



ప్రతాపరుద్ర కాలనీలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అక్రమంగా కట్టడాలపై గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) అధికారులు కొరడా ఝుళిపించారు. 14వ డివిజన్‌లో 100 ఫీట్ల రోడ్డును అనుసంధానం చేసే ప్రతాపరుద్ర కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలను మునిసిపల్ అధికారులు కోర్టు ఉత్తర్వులు ప్రకారం పోలీసులు రక్షణతో కూల్చివేతలు చేపట్టారు. అదే విధంగా సాయిగణేశ్ కాలనీలో అనుమతులు లేకుండా నిర్మించిన రేకుల షెడ్డును నేల మట్టం చేశారు. వరంగల్ ప్రతాపరుద్ర కాలనీలో ఓ వ్యక్తి గతంలో 30 ఫీట్ల రోడ్డును వదిలి వేసి ప్లాట్లు విక్రయించాడు. ఇటీవల భూముల రేట్లకు రెక్కలు రావడంతో 30 ఫీట్ల రోడ్డును సైతం మరో వ్యక్తికి విక్రయించాడు. ఇది గుర్తించిన స్థానికులు మునిసిపల్ అధికారులతో పాటు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఉత్తర్వులు అందడంతో మంగళవారం పోలీసుల సహకారంతో డీఆర్ఎఫ్ సిబ్బంది ఎక్స్‌కవేటర్లతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. అదే విధంగా సాయిగణేశ్ కాలనీలో ఓ వ్యక్తిని 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి ప్రభుత్వ అనుమతులు లేకుండా రేకుల షెడ్డును నిర్మించాడు.స్థానికులు ప్రజావాణి ద్వారా కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పూర్తిస్థాయి విచారణ జరిపి కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు రేకుల షెడ్డును కూల్చివేశారు.



సాయిగణేశ్‌కాలనీలో రేకుల షెడ్డును కూలుస్తున్న అధికారులు

కాగా, అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న విషయం తెలుసుకుని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు టౌన్‌ప్లానింగ్ అధికారులతో పాటు ఎక్స్‌కవేటర్‌పై రాళ్ల రువ్వారు. సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రాళ్ల దాడిపై సంబంధిత పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసినట్టు టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. ఈ కూల్చివేతలలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, ఖలీలుద్దీన్, టీపీఎస్‌లు అవినాష్, శ్రీకాంత్‌లతో పాటు బీఐలు రూపాల్, అఖిల్ ప్రకాశ్, అన్వేశ్, అవినాష్‌లు పాల్గొన్నారు.

ప్రేమ.. పెళ్లి.. మోసం

- మొదటి భార్యకు తెలియకుండా రెండో పెళ్లి చేసుకున్న ఘనుడు
- ఇద్దరు పిల్లలయ్యాక విషయం తెలుసుకున్న రెండో భార్య
- న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు

కరీమాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని చెప్పాడు.. నువ్వు లేనిదే ఉండలేనని నమ్మించాడు.. పెళ్లి చేసుకుందామన్నాడు.. అతడి మాయ మాటలను ఆ యువతి నమ్మింది. ఇద్దరి సామాజిక వర్గాలు వేరు కావడంతో పెద్దలు ఒప్పుకోరని భావించి రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. తర్వాత అసలు విషయం బయటపడింది. అతడికి అంతకుముందే వివాహమైందని, భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిసింది. దీంతో అవాక్కయిన సదరు యువతి మిల్స్‌కాలనీ పోలీసులుకు ఫిర్యాదు చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన కన్నెబోయిన అశ్విని నగరంలోని ఓ కళాశాలలో 2015లో ఏఎన్ఎం చదువుతుండగా అదే కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న కన్నెబోయిన మధు యాదవ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. 2016లో ప్రేమిస్తున్నానని చెప్పాడు. నాలుగు సంవత్సరాల తర్వాత 23 ఆగస్టు 2020లో గోపాలపురంలో గల అశ్విని పెద్దమ్మ కుమారుడు బోనాల శ్రీనివాస్ ప్రసన్నకుమారి దంపతుల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకుని అక్కడే కాపురం పెట్టారు. 2021లో కరీమాబాద్‌కి మకాం మార్చారు. వీరికి 2022లో పాప, 2024లో బాబు జన్మించారు. కొద్ది రోజుల తర్వాత మధు వేరే మహిళను తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా చూసిన అశ్విని గట్టిగా నిలదీసింది. దీంతో అసలు విషయం బయటపెట్టాడు. తనకు గతంలోనే వివాహమైందని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పడంతో అశ్విని అవాక్కయింది. ఈ విషయాన్ని కరీమాబాద్ జన్మభూమి జంక్షన్‌లోని మధు కుటుంబ సభ్యులకు తెలుపగా వారు కూడా మధుకే వత్తాసు పలకుతూ అశ్వినిని కులం పేరుతో దూషించారు. ఈ విషయాన్ని అశ్విని నర్సంపేటలోని తన బంధువులకు తెలిపింది. వారు నిలదీయడంతో అశ్వినితో పాటు పిల్లలను బాధ్యతగా చూసుకుంటామని చెప్పాడు. కాని ఇంటికి రాకపోవడంతో హనుమకొండలో తన భర్త పనిచేస్తున్న ఆఫీస్‌కు వెళ్ళింది. విషయం తెలుసుకున్న మధు తన మొదటి భార్య అయిన అశ్వినికి (మొదటి భార్య పేరు కూడా అశ్విని) ఫోన్ చేయడంతో ఆమె ఇద్దరు మహిళలను తీసుకొచ్చి రెండో భార్యపై దాడి చేసింది. దీంతో రెండో భార్య హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనను పిల్లలను బాధ్యతగా చూసుకోవాలని మధును కోరింది. దీంతో తను ప్లేటు ఫిరాయించాడు. అసలు నిన్ను వివాహం చేసుకోలేదని, ఆ ఇద్దరు పిల్లలు తనకు జన్మించలేదని బుకాయించాడు. కులం పేరుతో దూషించాడు. ఇంకోసారి తనను కలిస్తే చంపేస్తానని బెదిరించాడు. దీంతో తనను మోసం చేసిన తన భర్త కన్నెబోయిన మధు, అతడి తల్లి వెంకటమ్మ, ఆడపడుచు సునిత, అతడి సోదరుడు శివకుమార్‌లపై చర్య తీసుకోవాలని మంగళవారం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా మందుల నిల్వ

- 35 రకాల అల్లోపతి మందుల స్వాధీనం
- క్లినిక్ నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు



వావిలాలలో ప్రైవేటు క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డ్రగ్స్ నియంత్రణ అధికారులు

పాలకుర్తి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఔషధాలు నిల్వ చేసిన మండలంలోని ఓ క్లినిక్‌ను ఔషధ తనిఖీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. వావిలాలలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీనివాస క్లినిక్‌ను మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఔషధ నియంత్రణ విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. వరంగల్ నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మీ పర్యవేక్షణలో జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు ఏలే బాలకృష్ణ, జన్ను కిరన్‌కుమార్ శ్రీనివాస క్లీనిక్‌పై దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా నిల్వ చేసిన 35రకాల అల్లోపతి మందులను సీజ్ చేసి నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. అక్రమంగా నిల్వచేసిన ఔషధాల విలువ సుమారు రూ.20వేల వరకు ఉంటుందని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ కోర్టులో సంబంధిత కేసు పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏలే బాలకృష్ణ, జన్ను కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఔషధ విక్రయాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ లేకుండా మందులను నిల్వ చేయడం డ్రగ్స్ కాస్మోటిక్స్ చట్టం ప్రకారం నేరమని తెలిపారు. కొందరు గ్రామీణ వైద్యులు అనుమతి లేకుండా క్లీనిక్‌లు నిర్వహిస్తూ నిషేదిత మందులను ఇండ్లలో నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అర్హత గుర్తింపు లేని వావిలాల శ్రీనివాస క్లీనిక్ షదాలు సరఫరా చేస్తున్న ఏజెన్సీలపై సైతం చర్యలు తీసుకుంటామన్నారు.

కవయిత్రి లావణ్యకు జాతీయ పురస్కారం



బుదారపు లావణ్య

జనగామకల్చరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన తెలుగు తేజం జాతీయ పురస్కారానికి జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కవయిత్రి బుదారపు లావణ్య ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహక సంస్థ అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ మంగళవారం ఆహ్వానం అందించారు. ఈనెల 31న ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడులో లావణ్య పురస్కారాన్ని అందుకోనుంది. జాతీయ స్థాయిలో నిరంతరంగా సాహితీ సృజన చేస్తున్న తెలుగు కవులు, కవయిత్రులను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. లావణ్యకు అవార్డు రావడంపై జిల్లా కవులు, కళాకారులు, సాహితీ సంస్థల ప్రతినిధులు జి.కృష్ణ, అయిలా సోమనర్సింహాచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, లగిశెట్టి ప్రభాకర్, పొట్టబత్తిని భాస్కర్, వేముల సదానందం, గడ్డం మనోజ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, కొట్టె శ్రీలత, త్రిపురారి పద్మ, వరూధిని హర్షం వ్యక్తం చేశారు.

29న బల్లార్షా సెక్షన్‌లో పలు రైళ్లు రద్దు

కాజీపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి, ఉప్పల్, జమ్మికుంట రైల్వే స్టేషన్‌లలో రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల దృష్ట్యా కాజీపేట - బల్లార్ష సెక్షన్‌లో నడిచే పలు రైళ్లను ఈనెల 29న రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. రద్దైన రైళ్ల వివరాలు... (17003) కాజీపేట - సిర్పూర్ టౌన్‌ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్, (17004) బల్లార్షా - కాజీపేట జంక్షన్‌ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్, ((17035 /36) కాజీపేట -బల్లార్షల మధ్య నడిచే బల్లార్ష ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి.

పాక్షికంగా రద్దైన రైళ్లు.. (17033/34) భద్రాచలంరోడ్ - బల్లార్షల మధ్య నడిచే సింగరేణి రైలు ఈనెల 29న కాజీపేట - బల్లార్షల మధ్య మాత్రమే నడుస్తుంది. (17233/34) సికింద్రాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేట- సికింద్రాబాద్‌ల మధ్య మాత్రమే నడుస్తుంది. ఈ రైళ్లకు ఈనెల 29న ఉప్పల్, జమ్మికుంట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ ఎత్తివేసి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల అనంతరం ఈ నెల 29 తర్వాత ఈ రైళ్లు గతంలో లాగే యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు చెప్పారు.





నగరంలో నీటి కుక్క

ఓటర్స్ అని ఆంగ్లంలో పిలవబడే ఈ నీటి కుక్క సముద్ర తీరం, నది ప్రవాహంలో కనిపిస్తుంది. చూడడానికి అచ్చం కుక్కలా కనిపించే ఈ అరుదైన జంతువు నగరంలో ప్రత్యక్షమైంది. ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కాని మంగళవారం 49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో కనిపించింది. మనుషులకు ఎలాంటి హాని చేయని ఈ జీవి చేపలను మాత్రమే ఆహారంగా తీసుకుంటుంది. మొదటిసారిగా ప్రత్యక్షంగా కనిపించిన ఈ జంతువును నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. కాగా, దీని శాస్త్రీయ నామం లుట్ర..లుట్రా అని కాకతీయ జంతు ప్రదర్శనశాల పూర్వపు వన్యప్రాణి డాక్టర్ ప్రవీణ్ తెలిపారు.

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, వరంగల్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వం

దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్



సమావేశంలో మాట్లాడుతున్న కోగిల మహేష్

వడ్డెపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేష్ దుయ్యబట్టారు. మంగళవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని రోస్ గార్డెన్‌లో దళిత బంధు సాధన సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ ఇమ్మడి రాజు అధ్యక్షతన నిర్వహించిన దళిత బంధు సాధన సమితి రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం మహేష్ మాట్లాడుతూ.. దళిత బంధు, చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. దళిత బంధు పథకాన్ని నిధులు విడుదల చేస్తామని నమ్మబలికి దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దళితుల ఊసెత్తడం లేదని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దళిత బంధు పథకానికి వెంటనే నిధులు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత బంధు సాధన సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ మడికొండ రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భువనగిరి శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారు దర్శనాల సంజీవ, చిట్టిమల్ల సమ్మయ్య, కావేరి చిన్ని కృష్ణ, అక్కినపల్లి జయ, గద్దల శంకర్, దుర్గం రాజేష్, బాలనర్సు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- ఎంజీఎం ఆస్పత్రిలో తనిఖీలు.. వైద్యులతో సమీక్ష



డాక్టర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ మెడికల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం ఎంజీఎం ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, సైకియాట్రిక్, ఇంటెన్సివ్ కేర్, సర్జికల్ యూనిట్, ఎమర్జెన్సీ క్యాజువాలిటీ తదితర విభాగాలను స్వయంగా పరిశీలించి ఆయా వార్డులలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆస్పత్రిలోని ఫార్మసీ స్టోర్‌లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని పరిశీలించారు.

అధికారులతో సమావేశం

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంజీఎం ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి సారించారని కలెక్టర్ సత్యశారద తెలిపారు. ఆకస్మిక తనిఖీ అనంతరం ఆస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగ డాక్టర్లు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పేషంట్ల సౌకర్యార్థం ఆస్పత్రిలో వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి అన్ని విభాగాల వార్డుల వద్ద ప్రదర్శించాలన్నారు. అప్పటి వరకు కలెక్టరేట్‌లోని టోల్‌ఫ్రీ నెంబర్ 18004253424ను సంప్రదించి వైద్య చికిత్సకు సంబంధించిన ఫిర్యాదు చేయవచ్చన్నారు. డాక్టర్లు, సిబ్బంది అందరూ ఎఫ్ఆర్‌సీ ద్వారానే హాజరు కచ్చితంగా వేయాలన్నారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 20ఫిర్యాదుల పెట్టెలలో వేసిన ఫిర్యాదులను డాక్టర్ల సమక్షంలో తెరిచి సమీక్షించారు. ప్రజలు పేర్కొన్న సమస్యలు లేకుండా చూడాలని, డబ్బులు అడిగిన సెక్యూరిటీగార్డుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నర్సుల సేవలపై వచ్చిన ఫిర్యాదులను హెడ్ నర్స్‌చే చదివించి సంబంధిత నర్సుపై తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మురళీ, ఆర్ఎంవోలు అశ్విన్ కుమార్, శశికుమార్, వసంత్, ఆయా విభాగాల హెచ్ఓడీలు, వైద్యులు పాల్గొన్నారు.



జయములివ్వు బొజ్జ గణేశా!

నేడు వినాయక చవితి పర్వదినం

నవరాత్రి వేడుకలకు వాడవాడనా సిద్ధమైన మండపాలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జై గణేశా.. జై జై గణేశా.. అంటూ చేసే పూజలకు సమయం ఆసన్నమైంది. భాద్రపద శుద్ధ చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం గణేష్ చతుర్థి పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు ఇంటింటా ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అలాగే వాడవాడనా గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు మండపాలు సిద్ధమయ్యాయి. వినాయక చవితి అంటేనే ప్రకృతి సిద్ధమైన పండుగ. పిండి వంటలతో వివిధ రకాల పత్రులతో సంప్రదాయ బద్ధంగా జరుపుకుంటారు. లంబోదరుడిని పత్రులతో పూజిస్తే విశేష ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. 21 రకాల పత్రులతో స్వామిని పూజిస్తారు. ఇందుకు సంబంధించిన పత్రులు, పండ్లు, పూల కొనుగోళ్లతో బజార్లన్నీ సందడిగా మారాయి. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో వినాయక విగ్రహాల అమ్మకాలు కొనసాగుతున్నాయి. చిన్న నుంచి పెద్ద విగ్రహాల వరకు భారీగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఎంజీఎం సెంటర్, భద్రకాళి ఆర్చీ, కేఎంసీ సెంటర్ వద్ద నుంచి భారీ గణపతి విగ్రహాలను ప్రత్యేక వాహనాల ద్వారా మండపాలకు తరలిస్తున్నారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం గణేష్ మండళ్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో నిర్వాహకులు విద్యుత్ దీపాలను పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో 6 ఫీట్ల మట్టి గణపయ్యను చౌరస్తాలోని పున్నంచందర్ స్వగృహం నుంచి బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మేళతాళాలతో తీసుకువచ్చి ప్రతిష్ఠింపజేయనున్నట్లు ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. అదే విధంగా హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో గణేష్ నవరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలను అలంకరింపజేయడమే కాక తొమ్మిది రోజులపాటు వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. హనుమకొండలోని టైలర్‌స్ట్రీట్, సుధానగర్, రెవెన్యూ కాలనీ, సుబేదారి, ఎక్సైజ్ కాలనీ, బ్రాహ్మణవాడ, రాగన్నదర్వాజ తదితర ప్రాంతాల్లో సుమారుగా వేయికి పైగా గణేష్ మండపాలు వెలిశాయి.

నగరంలోని అన్ని ప్రధాన అపార్ట్‌మెంట్లలోనూ గణేష్ ప్రతిమలకు పూజలు నిర్వహించనున్నారు. అలాగే వరంగల్ పిన్నవారి వీధి, బట్టల బజార్, రామన్నపేట, రైల్వే గేట్, గీతా భవన్, దుర్గేశ్వరాలయం, జేపీఎన్‌రోడ్డు, చౌరస్తా, పోచమ్మమైదాన్, కొత్తవాడ, కాశిబుగ్గ, చమన్, మార్కెట్, దేశాయిపేట, లేబర్‌కాలనీ, కరీమాబాద్, ఉర్సు, రంగశాయిపేట, శివనగర్, ఓసిటీ, బ్యాంకు కాలనీ ప్రాంతాలతో పాటు వ్యాపార సంస్థలు, దేవాలయాల్లో, ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతి మండపాలను ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించడానికి సిద్ధం చేశారు.


బట్టల బజార్‌లో పూజ సామగ్రి కొంటున్న మహిళలు


ఎంజీఎం సెంటర్‌లో వినాయక విగ్రహాల కొనుగోళ్లు

పూలు పండ్లకు భలే గిరాకీ..

వినాయక పండుగ వచ్చిందంటే ఎటుచూసినా సందడే ఉంటుంది. వినాయక విగ్రహాలతో పాటు పిండి వంటలు, కూరగాయలు, పండ్లు నైవేద్యంగా స్వామికి ఆరగింపు చేసి బొజ్జ గణపయ్యకు ప్రీతికరమైన ఉండ్రాళ్లను తయారు చేసి పూలు, పండ్లతో అలంకరిస్తారు. దీంతో పూలు, పండ్లు, కూరగాయలకు భలే గిరాకీ ఉంటుంది. కిలో చామంతి పూలు, గులాబీలు రూ. 400 నుంచి 500 వరకు పలికాయి. వినాయక విగ్రహాలకు అలంకరించడానికి భారీ గజమాలలను తయారు చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఇక కొబ్బరికాయ ధర కొండెక్కింది. ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు.

5వ తేదీనే నిమజ్జనం

ప్రతిసారి గణేష్ నవరాత్రి వేడుకల అనంతరం 10, లేదా 11వ రోజు నిమజ్జనం చేసే సాంప్రదాయం ఉంది. అయితే ఈసారి 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం ఉన్నందున సిద్ధాంతులు, పంచాంగకర్తలు 8 రాత్రులు పూర్తయిన క్రమంలో 9వ రోజునే అంటే సెప్టెంబరు 5వ తేదీ శుక్రవారం నిమజ్జనం చేయాలని తేల్చిచెప్పడంతో ఈసారి ఉమ్మడి జిల్లాలో 5వ తేదీన నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

మట్టి గణపయ్యల పంపిణీ


పర్యావరణానికి విఘాతం కలిగించకుండా మట్టి గణపతులను ప్రతిష్ఠింపజేయాలన్న ప్రభుత్వ సూచనల మేరకు నగరంలోని పలు విద్యాసంస్థలతోపాటు స్వచ్ఛంద సంస్థలు పోటీలుపడి మంగళవారం బుల్లి మట్టి గణపతులను అనేక ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీ చేశారు. ప్రసిద్ధ వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ ఇచ్చిన పిలుపుమేరకు ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో 300 మట్టి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. వరంగల్ చౌరస్తాతో పాటు ఆలయాల్లో, భద్రకాళి దేవాలయంలో మట్టి గణపతులను ఉచితంగా అందజేశారు. అదే విధంగా హనుమకొండ జూలైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలతోపాటు అనేక పాఠశాలల్లో మట్టి గణపతులను విద్యార్థులకు అందజేశారు.


వినాయక చవితిని పురస్కరించుకొని హనుమకొండ రాంనగర్‌లోని ఓ పాఠశాలలో చిన్నారులను శివపార్వతులు, గణేశుడు, కుమారస్వామిగా అలంకరించిన దృశ్యం




జూలైవాడ ఉన్నత పాఠశాలలో మట్టి గణపతులతో విద్యార్థులు


ఎంజీఎం సెంటర్ నుంచి గణపతి విగ్రహాలను తీసుకువెళ్తున్న దృశ్యం


కలశం అలంకరణలో ప్రత్యేక లడ్డూ


శివలింగాకారంలో ప్రత్యేక లడ్డూ


విక్రయానికి సిద్ధంగా ఉంచిన భారీ లడ్డూలు

- 100 గ్రాముల నుంచి వంద కిలోల వరకు తయారీ
- పండుగకు 5 టన్నుల లడ్డూల విక్రయాలు

లడ్డూ ప్రసాదం సిద్ధం

వరంగల్ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం రోజున ప్రతీ ఇంటా, ప్రతీ గణపతి మండపంలో స్వామివారికి ప్రీతికరమైన లడ్డూను నైవేద్యంగా పెడతారు. ఇందుకోసం భక్తులకు విక్రయించడానికి వ్యాపారులు ప్రత్యేక లడ్డూలు తయారు చేశారు. బట్టల బజార్‌లోని ఓ మిఠాయి దుకాణంలో దాదాపు 5 టన్నుల లడ్డూలను తయారు చేసి విక్రయించడానికి సిద్ధం చేశారు. ప్రత్యేక ఆకర్షణగా శివ లింగం లడ్డూ, కలశం లడ్డూ తదితర రకాల లడ్డూలను తయారు చేశారు. 100 గ్రాముల నుంచి వంద కిలోల వరకు తయారు చేసి ఆర్డర్‌పై అందజేస్తున్నారు.

పుచ్చ గింజపై గణనాథుడు

మైక్రో ఆర్టిస్ట్ కుసుమ లింగమూర్తి సృష్టి


కుసుమ లింగమూర్తి

వరంగల్ సిటీ, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాశిబుగ్గ సాయిగణేష్ కాలనీకి చెందిన మైక్రో ఆర్టిస్ట్ కుసుమ లింగమూర్తి పుచ్చ గింజపై వినాయకుడి చిత్రాన్ని చిత్రీకరించారు. లింగమూర్తి గతంలో బియ్యపు గింజపై శ్రీరాముడు, శనగపప్పు పలుకుపై వివేకానందస్వామి చిత్రాన్ని గీసి ఆకట్టుకున్నారు. ఇపుడు వినాయకుడి చిత్రాన్ని గీశారు. దీంతో ఆయనను కాలనీ వాసులతో పాటు అలయెన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.


పుచ్చ గింజపై వినాయకుడి చిత్రం

నాట్య గణపతి సూక్ష్మశిల్పం

మట్టెవాడ ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు చెందిన అంతర్జాతీయ సూక్ష్మ శిల్ప కళాకారుడు మట్టెవాడ అజయ్‌కుమార్‌కు సూది రంధ్రంలో, కనురెప్ప వెంట్రుకలపైన, గుండు సూదిపైన శిల్పాలు చెక్కడంలో నైపుణ్యం ఉంది. ప్రస్తుతం వినాయక చవితిని పురస్కరించుకుని కనురెప్ప వెంట్రుక చివరన నాట్యం చేస్తున్న వినాయకుడి సూక్ష్మ శిల్పం చెక్కారు. ఇది 0.37 ఎంఎం (370 మైక్రాన్స్) ఎత్తు మాత్రమే ఉంటుంది. కేవలం మైక్రో స్కోపుతోనే వీక్షించవచ్చు. దీన్ని తయారు చేసేందుకు మెత్తని మైనం, ఇసుక రేణువులు, ప్లాస్టిక్ పౌడర్, స్వయంగా తయారు చేసుకున్న సూక్ష్మ పరికరాలు, రంగులు అద్దడానికి గొంగళి పురుగు వెంట్రుకను ఉపయోగించారు. ఇది తయారు చేయడానికి 120 గంటల సమయం పట్టిందని అజయ్‌కుమార్ తెలిపారు.


కనురెప్ప వెంట్రుక అంచున నాట్య గణపతి సూక్ష్మ శిల్పం


కళాకారుడు అజయ్‌కుమార్

మట్టితో 'సిందూర్' గణపతి

నర్సంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ కామోజు జయకుమార్ పర్యావరణ పరిరక్షణ కోసం పదిహేడు సంవత్సరాలుగా విభిన్న సూక్ష్మ గణపతులను తయారు చేస్తున్నారు.

ఈ సంవత్సరం రెండు అంగుళాల కన్నా తక్కువ పరిమాణంలో సైనికుడి రూపంలో వినాయకుడి ప్రతిమను తయారు చేశాడు. మట్టితో చేసి వాటర్ కలర్స్‌తో తీర్చిదిద్దారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలని జయకుమార్ కోరారు.


జయకుమార్



మట్టితో తయారు చేసిన సిందూర్ గణపతి

విత్తన మట్టి గణపతులు

తయారు చేసిన పర్యావరణవేత్త రామస్వామి

నర్సంపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పర్యావరణవేత్త గోక రామస్వామి పిలుపునిచ్చారు. గత 40 సంవత్సరాలుగా తాను తయారు చేయడంతో పాటు విద్యార్థులతో మట్టి విగ్రహాలను తయారు చేసి వినాయక చవితి రోజు ఉచితంగా అందిస్తున్నారు. ఈ ఏడాది మట్టితో విత్తన గణపతులను తయారు చేశారు. ప్రతీ మట్టి విగ్రహంలో పనస, స్టార్ ఫ్రూట్, నేరేడు, ఉసిరి, సీతాఫలం వంటి పండ్ల విత్తనాలను పెడుతున్నారు. విత్తన మట్టి విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత మట్టి కరిగిపోయి విత్తనాలు మొలకెత్తుతాయన్నారు. ప్రజలు మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని రామస్వామి కోరారు. నేడు విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.




విత్తన మట్టి గణపతి విగ్రహాలను చూపుతున్న గోక రామస్వామి

ఉన్నత విద్యాప్రమాణాలే ఎన్‌ఐటీ లక్ష్యం

- విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయం
- డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి
- ఘనంగా యూజీ విద్యార్థుల ఓరియంటేషన్

హనుమకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్ఐటీ అత్యున్నత విద్యా ప్రమాణాలను కొనసాగించడానికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి అన్నారు. నిట్‌లో కొత్తగా ప్రవేశం పొందిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. 1245 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, బహుముఖ వికాసమే ఎన్ఐటీ ప్రధాన లక్ష్యం అన్నారు. నిట్ క్యాంపస్‌లోకి కొత్తగా అడుగుపెట్టిన విద్యార్థులు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలనీ, తద్వారా దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని పిలుపు నిచ్చారు. నిట్ కళాశాల విశిష్టత, దేశంలో అగ్రగామి విద్యా సంస్థగా ఎదగడం వెనుకగల నేపథ్యాన్ని, కృషిని వివరించారు. అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి క్యాంపస్ జీవితం, విద్యార్థులు పాటించాల్సిన నియమ నిబంధలను వివరించారు. విద్యార్థుల స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె.కిరణ్ కుమార్ నిట్ విద్యార్థుల సంక్షేమం కోసం కళాశాల తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి హరి ప్రసాద్ రెడ్డి క్యాంపస్‌లో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, కళారంగాల్లో వారు రాణించడానికి ఏర్పాటు చేసిన వివిధ క్లబ్‌ల గురించి పరిచయం చేశారు. చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ అబ్దుల్ అజీం హాస్టల్ జీవితం గురించి చెప్పారు. కెరీర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ అధిపతి ప్రొఫెసర్ పీవీ.సురేష్ క్యాంపస్ ప్లేస్‌మెంట్, ఉద్యోగావకాశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల సందేహాలకు వివిధ విభాగాల అధిపతులు నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులు తమ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా విభాగాధిపతులు విద్యార్థులకు స్వాగతం పలుకుతూ అధ్యాపకులను, ఫ్యాకల్టీ సలహాదారులను పరిచయం చేశారు.


అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

అంతర్‌జిల్లా చైన్ స్నాచర్ అరెస్టు

- రూ. 23.56 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- ద్విచక్ర వాహనాలు, సెల్ ఫోన్ సీజ్

వరంగల్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని కేయూసీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.23.53 లక్షల విలువైన 237 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు 3 ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్, రూ. 10 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ స్నాచింగ్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన మంతుర్తి హరీశ్ డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ సిమెంట్ కంపెనీలో క్వాలిటీ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. ఆ సమయంలో కంపెనీలో ఇంజనీరింగ్ పని చేస్తున్న ఉద్యోగి ఇంట్లో బంగారు గొలుసు చోరీ చేసి మణప్పురం గోల్డ్‌లోన్ కంపెనీలో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఈ కేసులో నెరెడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. బెయిల్‌పై వచ్చిన నిందితుడు జల్సాల కోసం రోడ్డుపై ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో నుంచి చైన్ స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. నిందితుడు ముందుగా చైన్‌స్నాచింగ్‌ల కోసం ద్విచక్రవాహనాలు చోరీ చేయాలనుకున్నాడు. వెంటనే హనుమకొండ రెడ్డికాలనీలోని కిరాయి ఇంట్లోకి మకాం మార్చి వరంగల్ కమిషనరేట్ లోని కేయూసీ, రాయపర్తి, సుబేదారి, కాజీపేట, హసన్‌పర్తి, కమలాపూర్‌తో పాటు కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌లో చైన్ స్నాచింగ్ చేయడంతో పాటు హనుమకొండ, హసన్‌పర్తి, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో 3 ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. వరుస స్నాచింగ్‌లపై అప్రమత్తమైన సీసీఎస్, కేయూసీ పోలీసులు మంగళవారం ఉదయం యాదవనగర్ క్రాస్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న యువకుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డట్టు ఒప్పుకోవడం జరిగిందన్నారు.

నిందితుడు కిరాయి ఉంటున్న ఇంటి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, క్రైం డీసీపీ గుణశేఖర్, ఏసీపీ సదయ్య, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, సీఐలు, సీసీఎస్, కేయూసీ సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్



'తాళ్ల పద్మావతి'లో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

కాజీపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సోమిడి తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి హాజరై విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థి దశలో మంచిగా చదువుకుని ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ డా, వేలు, సిబ్బంది మహేందర్ రెడ్డి, సృజన్, ఎండీ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా కాజీపేట పోలీసుల ఆధ్వర్యంలో నేతాజీ ఫార్మసి కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



విజేతలుగా నిలిచిన కళాకారులు

టెంపుల్ డాన్స్ కళాకారులకు బహుమతులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హనుమకొండకు చెందిన ప్రముఖ జాతీయ నాట్యాచారిణి ది టెంపుల్ డాన్స్ నిర్వాహకురాలు కాట్రగడ్డ హిమాన్సి శిష్య బృందం బెంగుళూరు, హైదరాబాద్‌లలో నిర్వహించిన నృత్యోత్సవాల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించి కళారంగంలో ఓరుగల్లు ప్రతిభను చాటారు. బెంగుళూరులో రెండు రోజుల క్రితం నృత్య వసంతం పేరిట నిర్వహించిన జాతీయ నృత్యోత్సవాల్లో కూచిపూడి విభాగం సబ్ జూనియర్స్ విభాగంలో వి.జనన్య, జూనియర్స్ విభాగంలో చన్విత‌లు ప్రథమ విజేతలుగా, సీనియర్ కేటగిరిలో ఎస్.సంజన ద్వితీయ బహుమతిని అందుకున్నారని హిమాన్సి చెప్పారు. కె.లక్ష్మీ, హర్షిత, డి.హాన్వికలు డ్యూయెట్ విభాగంలో ప్రథమ బహుమతిని సాధించినట్లు ఆమె తెలిపారు. అదే విధంగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కళారాధన జాతీయ నృత్య పోటీల్లోనూ తమ విద్యార్థులు సబ్ జూనియర్స్‌లో ఆరాధ్య, అక్షర ప్రథమ, ద్వితీయ, జూనియర్స్ విభాగంలో అరూశి తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు.

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా కృష్ణవేణి గౌరీశంకర్



హనుమకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాకు చెందిన రేషన్ డీలర్ మహేశ్వరం కృష్ణవేణి గౌరీశంకర్‌కు తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శిగా ప్రాతినిధ్యం లభించింది. గౌరీశంకర్ విశిష్ట సేవలను గుర్తించి ఆయనను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నట్టు తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే హనుమకొండ డీలర్ బొల్లు వెంకన్నను హనుమకొండ జిల్లా డీలర్ల సంఘం సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గంలో సభ్యులుగా తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కేఎంసీ హాస్టల్ వర్కర్స్ ధర్నా

వరంగల్ మెడికల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాల మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లలో పని చేస్తున్న వర్కర్స్‌కు సుమారు 8 నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యాదనాయక్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి సుధాకర్‌లు మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ గత 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేశ్, రాణి, రాజకుమారి, ఎండీ.అతిక్, రాము, మంద కవిత, రవి, బాబు, యాకయ్య పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి

కాజీపేట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమానగర్‌లో మంగళవారం మదర్‌థెరిస్సా జయంతిని ఘనంగా జరిగాయి. ఫాతిమా కథ్రడిల్ చర్చీ ఫాదర్ కాసుమరెడ్డి, విచారణ కౌన్సిల్ అధ్యక్షుడు బొక్క దయాసాగర్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఆర్. రాజ్‌మోహన్ రావులు ఫాతిమానగర్‌లోని థెరిస్సా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చీ కార్యదర్శి టీడీ టామి, కోశాధికారి అల్లం ప్రకాశ్‌రెడ్డి, క్రైస్తవులు పెద్దఎత్తున హాజరయ్యారు.

మానవతకు ప్రతిరూపం మదర్ థెరిస్సా

హనుమకొండ సిటీ (ఆంధ్రజ్యోతి): మానవతకు ప్రతి రూపం మదర్ థెరిస్సా అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని హనుమకొండలోని ప్రజాభవన్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. మదర్ థెరిస్సా చిత్రపటానికి రాజేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో బంక సంపత్ యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) నక్కలగుట్ట ల్యాండ్‌మార్క్ హోటల్‌లోని ఓ గదిలో మంగళవారం రాత్రి పేకాటడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ. 81, 400, 5 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న రాయపర్తి కొత్తూర్ తండాకు చెందిన హలావత్ వినోద్, పెగడపల్లి డబ్బాలకు చెందిన కొర్ర ప్రమోద్, కొమటిపల్లి మధు తండాకు చెందిన భూక్య రవి, అదాలత్ ఎస్సీ కాలనీకి చెందిన నూనవత్ తిరుపతి, టీచర్స్ కాలనీకి చెందిన గుర్రం శ్రీకాంత్‌లను తదుపరి చర్యలు కోసం సుబేదారి పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

వడ్డేపల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ 60వ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ, వడ్డేపల్లి మసీదు ప్రాంతంలో రూ.40 లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్లు, డ్రైయినేజీల పనులకు స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని అన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు చిర్ర రఘుపతి రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 60వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నం చందర్, కాంగ్రెస్ శ్రేణులు జనగాం శ్రీనివాస్ గౌడ్, బుస్స నవీన్, కమల్, శేఖర్, 60వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రోకుల సతీష్, బీజేపీ జిల్లా నాయకులు నాగపురి అశోక్, మట్టిపల్లి రాంరాజ్, అశోక్, గడ్డం క్రాంతి పాల్గొన్నారు.

ఏటీసీలతో విస్తృతంగా ఉద్యోగావకాశాలు

హనుమకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని అన్ని ఐటీఐలతో పాటు ప్రతీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) వల్ల విద్యార్థులకు విస్తృతంగా ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఏటీసీల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఉపాధి శిక్షణా సంస్థ ఆర్‌డీడీతో పాటు వరంగల్, హనుమకొండ, కాజీపేటలలోని ఐటీఐలు, ఏటీసీల ప్రిన్సిపాళ్లు మంగళవారం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిని హనుమకొండ బాలసముద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన మూడు ఐటీసీలను సందర్శించాల్సిందిగా ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఒక సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. ఏటీసీలపై ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మట్టి గణపతులను పూజిద్దాం

వివిధ డివిజన్లలో పంపిణీ

హనుమకొండ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మట్టి వినాయకుడిని పూజిస్తే... మహాగణపతిని పూజించినట్లేనని ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఎంత భక్తి శ్రద్ధలతో వినాయకుడిని పూజించామన్నది ముఖ్యం కానీ ఎంత రంగు రంగుల పెద్ద వినాయకుడిని పెట్టుకున్నామన్నది కాదని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసిన విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేస్తే అందుల్లోని జీవరాశులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే ముక్తి, పర్యావరణానికి శక్తి లభిస్తుందన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎంపీ డాక్టర్ కావ్య వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

క్రెడాయ్ ఆధ్వర్యంలో

ఆదిదేవుడైన గణపతిని పూజించడంతో పాటు ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత అని క్రెడాయ్ వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని క్రెడాయ్ కార్యాలయంలో మంగళవారం క్రెడాయ్ వరంగల్ శాఖ మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ మట్టి విగ్రహాలు పర్యావరణ హితమైనవని, కాలుష్యం నుంచి వనరులను కాపాడుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతగా క్రెడాయ్ వరంగల్ శాఖ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ రాష్ట్ర బాధ్యుడు సత్యనారాయణ రెడ్డి, చైర్మన్ ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడు జి రాజేందర్ రెడ్డి, ఎల్ రజనీకాంత్ రెడ్డి, కోశాధికారి వరుణ్ అగర్వాల్, మెతుకు రాజ్ కుమార్, మహిళా కార్యవర్గ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

- కేయూ క్యాంపస్ : వడ్డేపల్లి ప్రభుత్వ అటానమస్ పింగళి డిగ్రీ, పీజీ కళాశాల మంగళవారం కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మొక్కల ఆకులు, కూరగాయాలతో పర్యావరణహిత వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఆయా గణపతి విగ్రహాలను వడ్డేపల్లి పరిసరాల ప్రాంతాల ప్రజలకు, విద్యార్థులకు ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి పాల్గొని మాట్లాడారు. కాలుష్యాన్ని నివారించే విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయాలని సూచించారు.



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న బీజేపీ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, రావు పద్మ



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

- మడికొండ : మట్టి గణపతులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అని జీడబ్ల్యూఎంసీ 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి అన్నారు. మంగళవారం మడికొండ బురుజు వద్ద, ఉన్కిచెర్లలో మట్టి గణపతి విగ్రహాలను కార్పొరేటర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బుర్ర రాజ్‌కుమార్, బత్తిని కిరణ్, సత్యం, పున్నం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.
- జూలైవాడ : 59వ డివిజన్‌లోని ఇందిరానగర్ కాలనీలో కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కుమారస్వామి, నారాయణరెడ్డి, వీరారెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కమిషనరేట్ సిబ్బందికి

వరంగల్ క్రైం : పర్యావరణ పరిరక్షణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం సిబ్బందికి సీపీ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మట్టి గణపతులు పంపిణీ

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆధ్వర్యంలో 57 డివిజన్‌లో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ హాజరై మట్టి గణపతులను స్థానికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

- హనుమకొండ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): బాలసముద్రంలోని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైంగిక దాడిని నిరోధించడంలో ఎన్జీవోల పాత్ర కీలకం

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్‌లో బాలలపై జరుగుతున్న లైంగిక దాడిని నిరోధించడంలో ఎన్జీవోల పాత్ర కీలకమని చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఇండియా, నేపాల్ ప్రోగ్రాం మేనేజర్ శుభ్రత్ పాండే అన్నారు. హనుమకొండ సుబేదారిలోని అనంత భవన్‌లో రాష్ట్రస్థాయి ఎన్జీవోలతో జరుగుతున్న రెండు రోజుల ముగింపు సమావేశం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా శుభ్రత్ పాండే మాట్లాడుతూ.. పిల్లలపైన అనేక వేధింపులు, దాడులు ఆన్‌లైన్ మాధ్య మంగా జరుగుతున్నాయన్నారు.ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలను స్వర్ణభారతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పాలడుగుల సురేందర్, సిరి ఎన్జీవో డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌లు నివేదించారు. వర్క్‌షాప్‌లో ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, శ్రామిక వికాసం వికాస కేంద్రం నాగర్ కర్నూల్ డైరెక్టర్ లక్ష్మణరావు, సాధన సంస్థ డైరెక్టర్ మురళి తదితరలు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో సీజన్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో'గుయ్..గుయ్' అనే వార్తకు అప్పయ్య స్పందించి జిల్లా వ్యాప్తంగా దోమల నివారణ కోసం వైద్య ఆరోగ్య శాఖ చేపడుతున్న కార్యక్రమాల వివరాలను మంగళవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ప్రతీ మంగళ, శుక్రవారం నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో డ్రైడేను పాటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆయాలు, ఏఎన్ఎంలు ప్రతీ రోజు 25 గృహాలు పర్యటించి జ్వర పీడితుల వివరాలను సేకరిస్తున్నట్టు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

చెత్త తరలింపు వాహనాల జాప్యాన్ని ఉపేక్షించేదిలేదు

మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఇకపై చెత్త తరలింపు వాహనాల జాప్యంపై ఉపేక్షించేది లేదని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి హెచ్చరించారు. మంగళవారం బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డును కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు మేయర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనితీరుపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ..ఈ ప్రాంతంలో నివసించే నిరుపేదలకు డబుల్ బెడ్‌రూంలు కేటాయించిన నేపథ్యంలో ఖాళీ ఐన ప్రదేశం వరకు ప్రహరీ నిర్మించిగ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. షెడ్డు ప్రాం తంలో నల్ల రేగడి మట్టి వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని సీసీ రోడ్డు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. షెడ్డులో దొంగతనాలను నివారించేందుకు మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాంపూర్ డంప్ యార్డ్ వద్ద ఇద్దరు పంచర్ మెకానిక్‌లను నియమించాలన్నారు. సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్‌వో రమేష్, ఇంచార్జీ ఎస్ఈ మహేందర్, ఇంచార్జీ సీపీ రవీందర్ రాడేకర్, ఈఈలు రవికుమార్, మాధవిలత, శానిటరి సూపర్‌వైజర్ నరేందర్ పాల్గొన్నారు.



మునిసిపల్ వెహికిల్ షెడ్డును పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

బండి సంజయ్‌కు రేచీకటి

- జనహిత యాత్రపై ఆయన విమర్శలు అర్ధ రహితం
- మీడియాతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు రే చీకటి ఉందేమోనని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్‌పై విమర్శనాస్త్రాలు గుప్పించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేపట్టిన జనహిత యాత్రపై బండి సంజయ్ అర్ధ రహిత విమర్శలు చేస్తున్నారన్నారు. పాదయాత్ర రాత్రి వేళ చేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యలు చేయడం అవివేకమన్నారు. సాయంత్రం 5 గంటలకు యాత్ర నిర్వహించడం బండి సంజయ్‌కు రాత్రిగా కనిపిస్తుందా అని ప్రశ్నించారు. ఆయనకు రే చీకట్లు ఉన్నాయెమో అంటూ రాజేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జనహిత యాత్ర ద్వారా బీజేపీ ఓటు చోరీ, అధికారం కోసం అడ్డదారిలో వెళ్లడం, బీఆర్ఎస్ పదేళ్ల పాలన వైఫల్యాలు, రాష్ట్రంలో కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. దీనిని బండి సంజయ్ జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

బీజేపీ ఓటు చోరీని ఆధారాలతో సహా అధినేత రాహుల్‌గాంధీ బయటపెట్టారన్నారు. ఒక్కో ఇంటి నెంబర్‌పై వందల సంఖ్యలో దొంగ ఓట్లతో బీజేపీ వక్రమార్గంలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచారని పునరుద్ఘాటించారు. పదేళ్లకు పైగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏమి సాధించి పెట్టిందో బండి సంజయ్ జవాబివ్వాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ తెలంగాణను అభివృద్ధి చేస్తూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ప్రజలకు ఓటు అడిగే హక్కు తమకే ఉందన్నారు. కావాలంటే బండి సంజయ్ చర్చకు వస్తే వివరిస్తామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై బండి సంజయ్ నోరు మెదపడం లేదన్నారు. బీసీ నేత అయి సమర్థించడం లేదని, ఆయనకు సిగ్గుండాలంటూ రాజేందర్‌రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు.

జేఎన్ఎస్‌లో కొనసాగుతున్న క్రీడోత్సవాలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29న హాకీ దిగ్గజం దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ)ఆధ్వర్యంలో క్రీడా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో వెటరన్ వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. జేఎన్ఎస్ లోని వాలీబాల్ కోర్టులో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ఈ నెల 31వరకు ప్రతి రోజు జేఎన్ఎస్ క్రీడా మైదానంలో వివిధ క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వెటరన్ విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో 8 జట్లు పాల్గొనడం జరిగిందన్నారు. ఇందులో విజేత నిలిచిన జట్టుకు ఈ నెల 29న జేఎన్ఎస్‌లో బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు బత్తిని జీవన్‌గౌడ్, నరేందర్, రమేష్, కె. రమేష్, ఎమ్డీ అఫ్జల్, నేతాజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పిండి విజయ్‌కుమార్, సభ్యులు ఇంద్రసేనారెడ్డి, బొబ్బాలి వెంకట్‌రెడ్డి (పీడీ), సతీష్, డీఎస్ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రీడా ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్



ఏసీపీ గిరికుమార్‌ను సన్మానిస్తున్న అనితారెడ్డి, రమణ ఇతర అధ్యాపకులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కేయూ క్యాంపస్ ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ గిరికుమార్, కేయూపాలక మండలి సభ్యురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డిలు అన్నారు. మంగళవారం కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం విభాగం ఏసీపీ గిరికుమార్, ఎ.ప్రశాంత్‌కుమార్, కేయూ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డిలు హాజరై మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల నివారణ, సురక్షితమైన ఇంటర్నెట్ పద్ధతులు, ఆర్థికమోసాలను నివారించడానికి చర్యలు వంటి కీలక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జేఎన్ఎస్ క్రీడా మైదానానికి బెంచీల అందజేత

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత వ్యాయామ విద్య అధ్యాపక, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)కు బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌ను విశ్రాంత వ్యాయామ విద్యా అధ్యాపక, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం సభ్యులు కలిసి జేఎన్ఎస్‌లో బెంచీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పడంతో డీవైఎస్‌వో స్వాగతించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆర్. అనూప్‌కుమార్, కన్నెబోయిన సారయ్య, ఎన్. రాజయ్య, సుధీర్‌బాబు, బి.విక్రంమూర్తి, చంద్రయ్య, శ్రీహరి, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

బహురూపుడు భక్తసులభుడు

వైదిక సంప్రదాయంలో శ్రీ విఘ్నేశ్వరుడికి ఉండే ప్రథమ స్థానం గురించి ప్రత్యేకంగా వివరించవలసిన అవసరం లేదు. ఆది పూజను అందుకొనే గజాననుడు శైవ ఆగమాలలో 32 విభిన్న రూపాలలో దర్శనమిస్తాడు. కాగా.. 'చింత్యాగమం' అనే గ్రంథం గణపతిని షోడశ మూర్తిగా ఆవిష్కరిస్తూ... 16 రూపాలను వివరించింది. ఆ రూపాల ధ్యాన శ్లోకాలను పలిస్తూ... ఆయనను ఆరాధిస్తే కలిగే శుభ ఫలితాలను కూడా వివరించింది. వాటిలో ప్రధానమైన ఎనిమిది రూపాలు ఇవి...



శ్రీ బాల గణపతి:
బుద్ధి మాంద్యం కలిగినవారికే కాదు... తమ జ్ఞానం మరింత మెరుగ్గా వికసించాలని కోరుకొనే వారికీ బుద్ధి వికాసం కలిగించే ఈ స్వామి ప్రసన్నత కోసం ఈ కింది శ్లోకాన్ని పఠిస్తూ... సాష్టాంగ నమస్కారాలను సమర్పించాలి.
శ్లోకం: కరస్థకదలీ చూత పనసేక్షుకమోదకమ్
బాలసూర్యనిభం వందే దేవం బాలగణాధిపమ్

భావం: కుడివైపు రెండు చేతులలో మామిడి పండు (చూత), అరటి పండు (కదళీ), ఎడమవైపు రెండు చేతులలో పనస పండు, చెరుకుగడ (ఇక్షు దండం), తొండంతో మోదకం ధరించి బాలసూర్యుడిలా ప్రకాశిస్తున్న బాల గణపతికి నమస్కరిస్తున్నాను.



శ్రీ విజయ గణపతి:
చేపట్టిన ప్రతి కార్యంలో, సంకల్పించిన ప్రతి ఉన్నత ఆశయంలో అసాధ్యాన్ని సుసాధ్యాలు చేస్తూ... సర్వత్రా విజయాన్ని అందించే శ్రీ విజయగణపతి అనుగ్రహం పొందడానికి ఈ శ్లోకంతో ధ్యానించాలి.
శ్లోకం: పాశాంకుశస్వదంతామ్రఫల
వానాఖువాహనః
విఘ్నం నిహంతునః సర్వం రక్తవర్ణో
వినాయకః

భావం: ఎర్రని శరీరకాంతితో, ఎలుక వాహనాన్ని అధిరోహించి, నాలుగు చేతుల్లో తన దంతాన్ని, అంకుశాన్ని, మామిడి పండును, పాశాన్ని ధరించిన శ్రీ విజయగణపతిని సకల కార్యాల్లో అన్ని అడ్డంకులను తొలగించి, సర్వత్రా విజయాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను



శ్రీ భక్త గణపతి:
ఆరాధించినవారిని అనుగ్రహించి, వారిలో ఆత్మవిశ్వాసం బలపడేలా చేసి, ఇహపరసిద్ధులను కలిగించే శ్రీ భక్తగణపతిని ఈ శ్లోకంతో స్తుతించాలి.
శ్లోకం: నారికేళామ్రకదలీ గుడపాయస ధారిణమ్... శరచ్చంద్రాభవపుషం భజే భక్తగణాధిపమ్
భావం: తెల్లని శరీరకాంతితో ప్రకాశిస్తూ, చేతుల్లో మామిడి పండు, అరటి పండు, బెల్లంతో చేసిన పాయస పాత్రను, కొబ్బరి కాయను ధరించి, ఆశ్రయించిన వారిని గొప్ప భక్తులుగా మార్చే భక్తగణపతిని నిరంతరం స్తుతిస్తాను.



శ్రీ మహా గణపతి:
తనను ఉపాసించిన భక్తులను... వారి జాతక చక్రంలో దోషాల వల్ల కలిగే గ్రహ బాధలను నుంచి, వారు అనుభవిస్తున్న ప్రారబ్ధ కర్మల నుంచి, సకల కష్టాల నుంచి విముక్తులను చేసే శ్రీ మహా గణపతిని ఈ శ్లోకంతో ఉపాసించాలి.
శ్లోకం: హస్తీంద్రానన మిందుచూడ మరుణచ్ఛాయం త్రినేత్రం రసా
దాశ్లిష్టం ప్రియయా సపద్మకరయా స్వాంకస్థయా సంతతమ్
బీజాపూరగదేక్షుకార్ముకలసచ్చక్రాబ్జపాశోత్పల
వీహ్యగ్రస్వవిషాణరత్నకలశాన్ హస్తైర్వహంతం భజే

భావం: ఎర్రని శరీర కాంతితో, గజ ముఖంతో, నెలవంకతో కూడిన శిరోభూషణంతో, మూడు కన్నులతో... తన దంతం, దానిమ్మ పండు, కలువ పువ్వు, వరికంకులు, చక్రం, గద, చెరుకు విల్లు, పద్మం, పాశం ధరించి, తన ఎడమ తొడపై ఆశీనురాలైన (రెండు చేతులతో పద్మాలు ధరించిన) దేవేరిని ఒక చేతితో ఆలింగనం చేసుకొని, తొండంతో రత్న కుంభాన్ని పట్టుకున్న శ్రీ మహా గణపతిని నిత్యమూ భజిస్తాను.





శ్రీ శక్తి గణపతి:
జీవనయానంలో, దాంపత్య జీవితంలో అపోహలతో ఎప్పుడైనా నైరాశ్యానికి లోనైనట్టయితే... అలాంటి సమయాల్లో తనను ఆరాధించినవారికి ఆత్మస్థైర్యాన్ని కలిగించే శ్రీ శక్తి గణపతిని ఈ శ్లోకంతో పూజించాలి.
శ్లోకం: ఆలింగ్య దేవీం హరితాంగయష్టిం, పరస్పరాశ్లిష్ట కటి ప్రదేశమ్
సంధ్యారుణం పాశసృణీవహంతం, భయాపహం శక్తిగణేశమీడే
భావం: సంధ్యాకాంతి లాంటి ఎర్రని శరీరచ్ఛాయతో తేజోవంతుడై, ఆకుపచ్చని శరీరకాంతితో ప్రకాశించే దేవిని తన ఎడమ చేతితో ఆలింగనం చేసుకొని, ఆమె కటి ప్రదేశం మీద చేతిని ఉంచి, దంతాన్ని, అంకుశాన్ని, పాశాన్ని ధరించి ఉండే శ్రీ శక్తి గణపతిని అపోహలను, భయాన్ని దూరం చేయాల్సిందిగా ప్రార్థిస్తున్నాను.



శ్రీ లక్ష్మీ గణపతి:
సకల భోగ భాగ్యాలను ప్రసాదించేవాడు శ్రీ లక్ష్మీ గణపతి. తనను ఆరాధించినవారికి ధన, ధాన్య సమృద్ధిని, అష్టైశ్వర్యాలను అనుగ్రహించే ఆయనను ఈ శ్లోకంతో ప్రార్థించాలి.
శ్లోకం: బిభ్రాణః శుకబీజపూరకమిలన్మాణిక్య కుంభాంకుశాన్
పాశం కల్పలతాం చ ఖడ్గవిలస జ్యోతిః సుధాధానిర్ఝరః
శ్యామేనాత్తసరోరుహేణ సహితం దేవీద్వయం చాంతికే
గౌరాంగో వరదానహస్త సహితో లక్ష్మీగణేశోవతాత్

భావం: తెల్లని శరీరకాంతితో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ... ఇరువైపులా నల్ల తామర పూవులు ధరించి ఉన్న దేవేరులను ఆలింగనం చేసుకొని, చిలుక, దానిమ్మపండు, ఖడ్గం, అంకుశం, రత్న పాత్ర, కల్పలత, పాశాలను ధరించి, ఒక చేతితో వరదముద్రను ప్రదర్శించే శ్రీ లక్ష్మీ గణపతిని... సమస్త సన్మంగళాలను ప్రసాదించి, అందరినీ రక్షించాలని కోరుతూ ఆరాధిస్తున్నాను.



శ్రీ సిద్ధ గణపతి:
పూజించిన భక్తులకు సకల మనో కార్యాలు సిద్ధింపజేసి, వారిని సర్వదా విజేతలుగా శ్రీ సిద్ధ గణపతి తీర్చిదిద్దుతాడు. ఆయనను ఈ శ్లోకంతో ప్రసన్నం చేసుకోవాలి.
శ్లోకం: పక్వచూతఫలపుష్పమంజరీ
రిక్షుదండతిలమోదకైః సహ
ఉత్వహన్ పరశుహస్తతే నమః
శ్రీసమృద్ధియుత హేమపింగళ

భావం: లేత పసుపు రంగు శరీర కాంతితో ప్రకాశిస్తూ, కుడివైపు రెండు చేతుల్లో పండిన మామిడి పండు (పక్వ చూత), గొడ్డలి (పరశు), ఎడమవైపు రెండు చేతుల్లో పూలగుత్తి (పుష్పమంజరి), చెరుకుగడ (ఇక్షుదండం), తొండంతో నువ్వుల కుడుము (తిలమోదక) ధరించి, శ్రీ, సమృద్ధి అనే దేవేరులతో కూడిఉన్న ఓ సిద్ధ గణపతీ! నీకు నమస్కారం.



శ్రీ విఘ్న గణపతి:
సర్వ కార్యాల్లో సమస్త విఘ్నాలనూ తొలగించి, భక్తులకు ఐశ్వర్యాన్ని, యశస్సును శ్రీ విఘ్న గణపతి ప్రసాదిస్తాడు. ఆయనను ఈ శ్లోకంతో ధ్యానించాలి.
శ్లోకం: శంఖేక్షుచాప కుసుమేషు కుఠారపాశ, చక్రస్వదంత సృణిమంజరికా శరాద్యైః
పాణిశ్రితైః పరిసమీహితభూషణశ్రీః, విఘ్నేశ్వరో విజయతే తపనీయగౌరః

భావం: అగ్నిలో కాల్చిన బంగారం లాంటి పచ్చని శరీర కాంతితో, పది చేతుల్లో... దంతాన్ని (స్వదంత), పూల బాణాన్ని (కుసుమేషు), అంకుశాన్ని, గొడ్డలిని, చక్రాన్ని, పూలగుత్తిని (మంజరికా), చెరుకు వింటిని (ఇక్షు చాప), పాశాన్ని, రెల్లు గడ్డిని (శరౌఘ), శంఖాన్ని ధరించి, సర్వాభరణాలతో ప్రకాశించే శ్రీ విఘ్న గణపతికి వందనాలు.

● డి.యన్.వి. ప్రసాద్ స్థపతి, 9440525788



వినాయక చవితి విందు..!

వినాయకుడు స్వతహాగా భోజన ప్రియుడు. అందుకే ఆ స్వామికి అటుకులు, బెల్లం, శనగలు, ఉండ్రాళ్లు, కుడుములు, లడ్డు, పులిహోర... ఇలా ఎన్నింటినో నివేదిస్తూ ఉంటాం. వాటితోపాటు వినాయకచవితి రోజున నివేదించే విభిన్న నైవేద్యాల వివరాలు మీకోసం...



ఉండ్రాళ్లు పెసరపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

- పెసరపప్పు- అర కప్పు, బియ్యంపిండి- ఒక కప్పు, బెల్లం- ఒక కప్పు, నెయ్యి- అయిదు చెంచాలు, యాలకుల పొడి- అర చెంచా, చిక్కని కొబ్బరి పాలు- రెండు కప్పులు, జీడి పప్పులు- పది, బాదం పప్పులు- పది, కిస్మిస్‌లు- పది

తయారీ విధానం

- పెసరపప్పును శుభ్రంగా కడిగి కుక్కర్‌లో వేసి ఒక కప్పు నీళ్లు పోసి రెండు విజిల్స్ వచ్చే వరకు మెత్తగా ఉడికించాలి. తరవాత ఈ పప్పును మెత్తగా మెదిపి గిన్నెలోకి తీసుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి ఒకటింబావు కప్పుల నీళ్లు పోసి వేడి చేయాలి. అందులో మూడు చెంచాల బెల్లం, ఒక చెంచా నెయ్యి వేసి కరిగించాలి. తరవాత బియ్యంపిండి వేసి బాగా కలుపుతూ ఉడికించాలి. పిండి బాగా దగ్గరికి వచ్చాక స్టవ్ మీద నుంచి దించాలి. ఈ మిశ్రమాన్ని చల్లార్చి చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని చిన్న చిన్న ఉండ్రాళ్లు చేయాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి అందులో బెల్లం, రెండు కప్పుల నీళ్లు వేసి కరిగించాలి. బెల్లం కరిగిన తరవాత ముందుగా ఉడికించి పెట్టుకున్న పెసరపప్పు వేసి బాగా కలపాలి. పెసరపప్పు మొత్తం బెల్లం నీళ్లలో కలిశాక... బియ్యం పిండి ఉండ్రాళ్లు వేసి కలపాలి. వీటిని చిన్న మంట మీద పది నిమిషాలపాటు ఉడికించాలి. ఇవి బెల్లం-పెసరపప్పు మిశ్రమంలో ఉడికి బాగా ఉబ్బి పైపైన తేలుతుంటాయి. వెంటనే స్టవ్ మీద నుంచి దించి అందులో యాలకుల పొడి, కొబ్బరిపాలు వేసి బాగా కలపాలి.
- స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పులు, బాదంపప్పులు, కిస్మిస్‌లు వేసి దోరగా వేయించి... నేతితో సహా ఉండ్రాళ్ల మిశ్రమంలో వేసి కలపాలి. తియ్యని ఉండ్రాళ్లు- పెసరపప్పు పాయసం నైవేద్యానికి రెడీ..!

తుమ్మికూర పచ్చడి

కావాల్సిన పదార్థాలు

- తుమ్మికూర- ఒక కప్పు, పచ్చి చింతకాయ ముక్కలు- ఒక కప్పు, పచ్చిమిర్చి- తొమ్మిది, ఎండుమిర్చి- రెండు, వేయించిన జీలకర్ర- ఒక చెంచా, వేయించిన మెంతులు- పావు చెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, ఉప్పు- తగినంత, నూనె- తగినంత, ఆవాలు- పావు చెంచా, మినపపప్పు- అర చెంచా, కరివేపాకు- కొద్దిగా

తయారీ విధానం

- తుమ్మికూరను నీళ్లతో శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి నాలుగు చెంచాల నూనె వేసి వేడిచేయాలి. అందులో పచ్చి మిర్చి ముక్కలు, చింతకాయ ముక్కలు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. తరవాత నూనెలో కొద్దిగా ఇంగువ వేసి కలపాలి. వెంటనే తుమ్మికూరను కూడా వేసి బాగా వేపి మరో పళ్లెంలోకి తీయాలి. చిన్న రోలులో వేయించిన జీలకర్ర, వేయించిన మెంతులు, ఉప్పు వేసి మెత్తగా నూరాలి. తరవాత పచ్చిమిర్చి-చింతకాయల మిశ్రమం, వేయించిన తుమ్మికూర వేసి నూరాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీయాలి. స్టవ్ మీద నూనె గిన్నె పెట్టి మరో చెంచా నూనె వేసి వేడిచేయాలి. అందులో పసుపు, ఆవాలు, మినపపప్పు, ఎండుమిర్చి, కరివేపాకు వేసి ఎర్రగా వేపాలి. ఈ తాలింపును పచ్చడిలో వేసి కలపాలి. ఇలా తయారుచేసుకున్న తుమ్మికూర పచ్చడిని ఉండ్రాళ్లతోపాటు వినాయకునికి నివేదించాలి.



వినాయక చవితి రోజున 21 ఆకులతో గణనాథుణ్ణి పూజించడం సంప్రదాయం. 'ఏకవింశతి పత్రాలు'గా వ్యవహరించే ఈ ఆకులన్నీ ఆరోగ్యకారకాలని ఆయుర్వేదం చెబుతోంది.

ఏకవింశతి పత్రాలు... ఆరోగ్య సూత్రాలు!

1. **మాచీ పత్రం (మాచి పత్రి)**
ఆర్టీమీసియా వల్గారిస్- మంచి సువాసన గల పత్రి. తలనొప్పులు, కంటి దోషాలు తగ్గుతాయి.

2. **బృహతీ పత్రం (వాకుడు)**
దగ్గు, ఉబ్బసం, గొంతు, ఊపిరితిత్తుల సమస్యలను అరికట్టేందుకు ఉపయోగపడుతుంది.

3. **బిల్వ పత్రం(మారేడు)**
ఈ వృక్షం బహు ప్రయోజనకారి. ఆకు పసరు పలు చర్మ దోషాలను నివారిస్తుంది.

4. **దుర్వాయుగ్మం (గరిక)**
రక్త పైత్యానికి, మూత్ర సంబంధిత సమస్యలకు నివారకంగా పనిచేస్తుంది.

5. **దత్తూర పత్రం (ఉమ్మెత్త)**
ఆస్తమా, ఇతర దగ్గులకు, కీళ్లవాతాలకు మంచి మందు. ఆకురసం తేలు, జెర్రి, ఎలుక కాట్లకు విషహారిణిగా పనిచేస్తుంది.

6. **బదరీ పత్రం (రేగు)**
అజీర్తి, రక్త దోషాలను నివారిస్తుంది. వీర్యవృద్ధికి తోడ్పడుతుంది.

7. **అపామార్గ పత్రం (ఉత్తరేణి)**
గాయాలను మాన్పడంలో, ఇతర చర్మ సమస్యలకు అద్భుతంగా పనిచేస్తుంది.

8. **తులసీ పత్రం (తులసి)**
దగ్గు, జలుబు, జ్వరం, చర్మ వ్యాధులలను నివారిస్తుంది. క్రిములను నశింపజేస్తుంది. మొక్కలను చీడపీడల నుంచి కాపాడుతుంది.

9. **చూత పత్రం (మామిడి ఆకు)**
మామిడి భూమండలంలో అతి పురాతనమైన పండ్ల మొక్కల్లో ప్రధానమైనది. పాదాల బాధల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

10. **కరవీర పత్రం (గన్నేరు)**
తలలో చుండ్రును తగ్గిస్తుంది. ఈ మొక్క విష తుల్యం కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకొని వాడాలి.

11. **విష్ణుక్రాంత పత్రం (విష్ణుకాంత)**
దీర్ఘకాలిక దగ్గును, కఫవాతాలను, జ్వరాలను నివారిస్తుంది.

12. **దాడిమీ పత్రం (దానిమ్మ)**
శరీరంలో త్రిదోషాలైన వాత, పిత్త, కఫాలను హరింపజేస్తుంది.

13. **దేవదారు పత్రం (దేవదారు)**
దేవదారు తైలం చర్మవ్యాధులు, గొంతు సమస్యలు, పేగుల్లో పుండ్ల నివారణకు, కండరాల బలోపేతానికి ఉపయుక్తంగా ఉంటుంది.

14. **మరువక పత్రం (మరువం)**
నరాల ఉత్తేరణకు, చెవిపోటు, నొప్పులకు ఔషధంగా ఉపయోగపడుతుంది.

15. **సింధువార పత్రం (వావిలి)**
వాతం, శరీరం, తలమాడు నొప్పిలను తగ్గిస్తుంది. పంటి చిగుళ్ల, కీళ్ల బాధలను నివారిస్తుంది.

16. **జాజీ పత్రం (జాజి ఆకు)**
ఈ ఆకులు శరీరానికి వేడిని, శక్తిని అందించి, వాపుల్ని, నొప్పిని తగ్గిస్తాయి. రక్త శుద్ధి చేస్తాయి.


17. **గండకీ పత్రం (దేవకాంచనం)**
కడుపులో నులిపురుగులను హరిస్తుంది.

18. **శమీ పత్రం (జమ్మి ఆకు)**
ఈ ఆకురసం మాడుకు చల్లదనాన్నిచ్చి, జుట్టు నిగనిగలాడేందుకు ఉపకరిస్తుంది. ఈ చెట్టు పైనుంచి వీచే గాలి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

19. **అశ్వత్థ పత్రం (రావి ఆకు)**
శరీరంలో విషాల విరుగుడుకు, క్రిమిదోషాలను నివారించేందుకు వినియోగిస్తారు.

20. **అర్జున పత్రం (తెల్ల మద్ది)**
దీని బెరడు కషాయం గుండె ఆరోగ్యంగా, పదిలంగా ఉండడానికి దోహదం చేస్తుంది.

21. **అర్క పత్రం (తెల్ల జిల్లేడు)**
తెల్లజిల్లేడును సూర్యునికి ప్రతీకగా భావిస్తారు. దీనిలోని ఔషధగుణాలు శరీరాన్ని కాంతిమంతం చేస్తాయి.



మట్టి వినాయకుడిని తయారుచేద్దాం...రండి!

స్వహస్తాలతో గణపతిని రూపొందించి అందంగా అలంకరించి పూజిస్తే ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. అందుకే ఈ వినాయకచవితి పూజ కోసం మట్టితో సులువుగా వినాయకుడిని ఎలా తయారుచేయాలో తెలుసుకుందాం..!

1. బంకమట్టిని తెచ్చి నీళ్ల చల్లి మెత్తని ముద్దలా చేయాలి. దాన్ని పదినిమిషాలపాటు నాననివ్వాలి. దానితో అయిదు పెద్ద ఉండలు, అయిదు చిన్న ఉండలు చేసుకోవాలి. ఒక పెద్ద ఉండను తీసుకుని అరచేతిలో పెట్టుకుని ఒత్తుతూ దీర్ఘచతురస్రాకారపు పీఠంలా తయారు చేయాలి. ఈ పీఠం మధ్యలో మరో పెద్ద ఉండను పెట్టి బొజ్జ ఆకారంలో ఒత్తాలి.
2. మరో రెండు పెద్ద ఉండలను తీసుకుని కాళ్ల మాదిరిగా ఒత్తి బొజ్జకు ఇరు పక్కలా అమర్చాలి. ఈ కాళ్ల చివర్లలో కొద్దిగా నొక్కి పాదాల మాదిరిగా చేయాలి. సన్నని పుల్లతో వేళ్లు, అందెలు తీర్చిదిద్దాలి. బొజ్జ మీద మరో పెద్ద ఉండను ఛాతీ ఆకారంలో తీర్చిదిద్దాలి.
3. రెండు చిన్న ఉండలను చేతుల మాదిరి చేసి రెండింటినీ మధ్యకు కొద్దిగా వంచాలి. ఒక దాన్ని అభయ హస్తంలా చేయాలి. రెండోదానికి లడ్డూని ఉంచడానికి వీలుగా అరచేయి ఉండేలా వేళ్లతో నొక్కాలి. సన్నని పుల్లతో వేళ్లు, చేతులకు ఆభరణాలు గీయాలి. ఈ చేతులను ఛాతికి ఇరువైపులా అమర్చాలి. ఛాతిపైన మరో చిన్న ఉండను పెట్టి ముఖాకృతి వచ్చేలా నొక్కాలి. మిగిలిన రెండు చిన్న ఉండలతో చెవులు తయారుచేసి ముఖానికి ఇరువైపులా అతికించాలి.
4. కొద్దిగా బంకమట్టిని తీసుకుని తొండం మాదిరి చేసి కుడివైపునకు కొద్దిగా తిప్పాలి. దీన్ని ముఖం మధ్య భాగంలో అతికించాలి. తొండానికి ఎడమవైపున పూర్తి దంతం, కుడివైపున సగం దంతాన్ని అమర్చాలి. ముఖం మీద కళ్లు దిద్దాలి. ఇంకాస్త బంకమట్టిని తీసుకుని హారంలా చేసి ఛాతి మీద నుంచి బొజ్జ వరకు వచ్చేలా అతికించాలి. అలాగే యజ్ఞోపవీతం, నాగాభరణం కూడా పెట్టుకోవచ్చు.
5. మిగిలిన బంకమట్టితో మీకు నచ్చిన ఆకృతిలో కిరీటం తయారుచేసి తలమీద అతికించాలి. అంతే! వినాయకుడు పూజకు రెడీ..!

చిత్రజ్యోతి
SINCE 1965

సుందరకాండ నచ్చితే సపోర్ట్ చేయండి



- నారా రోహిత్

'ఒక సినిమా ప్రేక్షకుల ముందుకొస్తోంది అంటే అది హీరోగా నా ఒక్కడి గొప్పతనం కాదు. దానివెనుక ఎంతోమంది కష్టం ఉంది. థియేటర్‌కు వెళ్లి మా 'సుందరకాండ' సినిమా చూడండి. నచ్చితే సపోర్ట్ చేయండి. నచ్చకుంటే అదే విషయాన్ని చెప్పండి. కానీ సినిమా చూశాకే మీ అభిప్రాయాన్ని ఇతరులతో పంచుకోండి' అని హీరో నారా రోహిత్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వం వహించిన చిత్రమిది. సంతోశ్ చిన్నపొల్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మాతలు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నారా రోహిత్ మాట్లాడుతూ "నేను 'సుందరకాండ' సినిమా చేయడానికి ప్రధాన కారణం దర్శకుడు వెంకీ. ఈ సినిమా నటుడిగా నాకు పూర్తి సంతృప్తినిచ్చింది. వినాయక చవితి సందర్భంగా ఈ చిత్రం మీ ముందుకు వస్తోంది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలసి సినిమా చూడండి. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. మంచు మనోజ్ మాట్లాడుతూ 'నారా రోహిత్ మొదట్నుంచి భిన్నమైన కథలను ఎంచుకుంటూ, ఏ సపోర్ట్ లేకుండా సొంతంగా ఈ స్థాయికి వచ్చారు. ఈ సినిమాకు గొప్ప విజయాన్ని అందించండి' అని కోరారు. వెంకటేశ్ మాట్లాడుతూ 'నా జీవితంలో ఎప్పటికీ గుర్తుపెట్టుకునే సినిమా ఇది. క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది' అన్నారు. 'రోహిత్ గారి సహకారం వల్లే ఈ సినిమాను మీ ముందుకు తీసుకొస్తున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' తరహాలో 'సుందరకాండ' కూడా ప్రేక్షకులను అలరిస్తుంది' అని నిర్మాతలు చెప్పారు.

నా పాత్ర కొత్త తరహాలో సాగుతుంది



'త్రిబాణధారి బార్బరిక్' కథ మన చుట్టూనే జరుగుతున్నట్లు అనిపిస్తుంది. ఇప్పటివరకూ నేను ప్రతినాయక పాత్రలు ఎక్కువగా పోషించాను. కానీ ఇందులో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది' అని నటుడు వశిష్ఠ ఎన్ సింహా అన్నారు. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో విజయ్‌పాల్‌రెడ్డి అడిదల నిర్మించారు. ఈనెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వశిష్ఠ ఎన్ సింహా మీడియాతో ముచ్చటించారు. 'ఈ చిత్రం టైటిల్ వినగానే చాలా కొత్తగా అనిపించి, కథ విన్నాను. ఇప్పుడు పురాణ పాత్రల నేపథ్యంలో సినిమాలు ఎక్కువగా వస్తున్నాయి. బార్బరికుని పాత్ర స్ఫూర్తితో దర్శకుడు అద్భుతంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆయన శక్తిని, త్యాగాన్ని ఈ తరానికి తెలియజేప్పేలా సినిమా ఉంటుంది' అన్నారు.

అలరించే హారి 'కథ'



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'హరిగాని హరికథ'. హరి ఎడ్లపల్లి, ప్రియా హెగ్డే జంటగా నటించారు. సర్వేశ్ వైవి దర్శకత్వంలో సురభి హరీందర్ నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమౌతున్న ఈ చిత్రం నుంచి వినాయక చవితి సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది.

మిరాయ్.. వారం వెనక్కి



'హను-మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్ కొట్టిన తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన చిత్రం 'మిరాయ్'. మంచు మనోజ్, జగపతిబాబు, శ్రియా శరణ్, రితికా నాయక్ కీలక పాత్రలు పోషించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. సెప్టెంబరు 5న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేశారు మేకర్స్. అయితే, నిర్మాణంతర పనులు ఇంకా మిగిలుండడంతో సినిమా విడుదలను మరో వారం వాయిదా వేశారు. సెప్టెంబరు 12న చిత్రాన్ని 8 భాషల్లో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఈ నెల 28న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించి ఓ ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేశారు.

మనసా తెలుసా



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. గీతా ఆర్ట్స్ పతాకంపై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ 'నదివే' సినిమాపై అంచనాలను పెంచేసింది. తాజాగా చిత్రం నుంచి 'కలకలమను కలగలపిన కథ మొదలా.. కలవరమున తెగనలిగిన నిజము కలా, ఏం చేయను తడబడిన తప్పటడుగా.. ఏం జరుగుతోంది.. ఏం జరుగుతోంది మనసా తెలుసా' అంటూ సాగే పాటను విడుదల చేశారు మేకర్స్. రాకేందు మౌళి సాహిత్యం అందించగా, చిన్మయి ఆలపించారు. హేషమ్ అబ్దుల్‌వహాబ్ సంగీతం అందించారు.

సాదాబైనామాల రిజిస్ట్రేషన్‌కు పచ్చజెండా

» 2020 నాటి స్టేను ఎత్తేసిన హైకోర్టు

» కొత్త చట్టం వచ్చినందున పాత జీవోకు కాలం చెల్లిందని వ్యాఖ్య

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమమైంది. సాదాబైనామాల రిజిస్ట్రేషన్లను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సాదాబైనామాల రిజిస్ట్రేషన్లను నిలిపివేస్తూ 2020లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. కొత్తగా భూభారతి చట్టం వచ్చిన నేపథ్యంలో సదరు చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం సాదాబైనామాలను రిజిస్ట్రేషన్ చేసే అధికారం ప్రభుత్వానికి దఖలు పడిందని న్యాయస్థానం స్పష్టం చేసింది. సాదాబైనామాల రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం భూమిహక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం-1971 ప్రకారం 2020 అక్టోబరు 12న ఇచ్చిన జీవో 112కు కాలం చెల్లిందని తెలిపింది. సదరు జీవోను కొట్టేయాలన్న పిటిషనర్ విజ్ఞప్తికి సైతం కాలం చెల్లిపోయిందని వ్యాఖ్యానించింది. కావాలంటే తాజాగా భూభారతి చట్టాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేసుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు సాదాబైనామాల రిజిస్ట్రేషన్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిల్ విచారణను ముగిస్తూ తుది ఉత్తర్వులు జారీచేసింది.



ఇదీ విషయం..

సాదాబైనామాల రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తూ అప్పటి ప్రభుత్వం జారీచేసిన జీవోను కొట్టేయాలని నిర్మల్ జిల్లాకు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్ ఆ జీవోపై స్టే విధించింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టం-2025ను అమల్లోకి తెచ్చింది. సాదాబైనామాలపై కొత్త చట్టంలో ప్రత్యేకంగా నిబంధనలు రూపొందించామని.. గతంలో ఇచ్చిన స్టే ఎత్తేయాలని, రిజిస్ట్రేషన్లకు అనుమతించాలని ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టం తీసుకొచ్చిందని, అందులోని సెక్షన్ 6 ప్రకారం సాదాబైనామాలను క్రమబద్ధీకరించే అధికారం సర్కారుకు ఉందని తెలిపారు. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది జె.ప్రభాకర్ వాదిస్తూ.. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులు చాలా తక్కువ అని, తమ దరఖాస్తులను అనుమతించరనే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకోని చిన్న, సన్నకారు రైతులు చాలా మంది ఉన్నారని పేర్కొన్నారు. అనర్హుల దరఖాస్తులే ప్రస్తుతం అనుమతి పొందే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏజీ వాదనతో ఏకీభవించింది. 2020 అక్టోబరు 12 నుంచి 2020 నవంబరు 11 వరకు వచ్చిన సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించవచ్చని తెలిపింది. గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తేస్తున్నట్లు ప్రకటించింది. కొత్తగా అమల్లోకి వచ్చిన భూభారతి చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం ప్రభుత్వానికి అధికారం ఉందని తెలిపింది. 2014 జూన్ 2కు ముందు 12 ఏళ్లపాటు భూమి తమ అధీనంలో ఉందనేందుకు ఆధారాలు కలిగిన చిన్న, సన్నకారు రైతుల సాదాబైనామా దరఖాస్తులను క్రమబద్ధీకరించవచ్చని పేర్కొంది. ఈ తీర్పు నేపథ్యంలో 9 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుంది.

చైతన్యపురిలో 1,600 ఏళ్లనాటి చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి



చతుర్ముఖ నందీశ్వర లింగం

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ చైతన్యపురిలోని కొసగుండ్ల నరసింహ స్వామి దేవాలయంలో ఒక పురాతన చతుర్ముఖ నందీశ్వర లింగం వెలుగులోకి వచ్చింది. చరిత్రకారుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ఆదివారం దీన్ని గుర్తించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్యపురి ప్రాంతం సుమారు 1,600 ఏళ్ల క్రితం నిర్మించిన గోవిందరాజు విహార అనే హీనయాన బౌద్ధ విహారాన్ని సూచించే శాసనంతో ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం ఆ విహార స్థలాన్ని ఫణిగిరి కొసగుండ్ల నరసింహ స్వామి దేవాలయంగా పిలుస్తున్నారు. ఆ దేవాలయం వెనుక శిథిలాల్లో నందీశ్వర లింగం లభించింది. దాదాపు 2 అడుగుల చదరపు రాతి స్లాబ్‌పై, 4 దిక్కుల్లో ఒక్కోటి 8 అంగుళాల పరిమాణంలో నందులు, వాటి మధ్యలో శివలింగం, దాని చుట్టూ అభిషేక జలాన్ని బయటకు పంపే పానవట్టం చెక్కారు. ఇది దేశంలోనే అతి ప్రాచీన, అరుదైన లింగం అని సత్యనారాయణ తెలిపారు.

భద్రాచలం ఆలయ ఈవోగా దామోదర్‌రావు

భద్రాచలం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం దేవస్థానం ఈవోగా డిప్యూటీ కలెక్టర్ కె.దామోదర్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో భద్రాచలం ఆర్డీవోగా పనిచేసిన దామోదర్‌రావు, ఇటీవల దేవాదాయ శాఖకు బదిలీ అయ్యారు.

సైకిల్ అందుకున్న విద్యార్థిని భావోద్వేగం

» ఓదార్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్



విద్యార్థిని అర్చనను ఓదార్చుతున్న బండి సంజయ్

మానకొండూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): "సంజయన్నా మాది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు కూలి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తినడానికే ఇబ్బంది పడుతున్నాం. అలాంటి నాకు ఇంత పెద్ద సైకిల్ బహుమతిగా ఇచ్చారు" అంటూ ఓ విద్యార్థిని భావోద్వేగంతో కన్నీరుపెట్టుకుంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మానకొండూరు బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకరపట్నం మండలం తాడికల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని బూస అర్చన భావోద్వేగానికి గురయ్యారు. దీంతో సంజయ్ ఆమెను ఓదార్చారు.

యూరియాపై బీజేపీ తప్పుడు ప్రచారం: జాన్‌వెస్లీ

హైదరాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ మొదలై రెండు నెలలు గడుస్తున్నా యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కుంటి సాకులు చెబుతూ.. కృత్రిమ కొరత సృష్టించారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉండటాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జీర్ణించుకోలేకపోతున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. అమిత్‌షా గుజరాత్ హోంమంత్రిగా ఉన్నపుడు సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్‌కు సంబంధించి సుదర్శన్ రెడ్డి ఇచ్చిన తీర్పు వల్ల షా రెండేళ్లు రాష్ట్రం బయట ఉండాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్రం: జాజుల

హైదరాబాద్/బర్కత్‌పుర, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్రపతి భవన్, రాజ్‌భవన్‌లను కేంద్రం జేబు సంస్థగా మార్చుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాజుల మీడియాతో మాట్లాడారు. నాటి మండల్ నుంచి నేటి బీసీ బిల్లు వరకు బీజేపీ బీసీలను మోసం చేస్తూనే ఉందని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్ల సాధన ఉద్యమ కార్యాచరణకు గురువారం హైదరాబాద్‌లో బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

హైదరాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఇనేష్, కార్యదర్శిగా బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు. నాంపల్లి టీజీవో భవన్‌లో మంగళవారం టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. సహాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కోశాధికారిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా నాగేందర్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత ఎన్నియారు.

బీజేపీలో నాతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు

చంద్రశేఖర్ తివారీకి ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపిన ఎంపీ కొండా

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీలో తనతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జిల్లా పార్టీ అధ్యక్షులతో పాటు రాష్ట్ర పార్టీ ముఖ్యనేతల వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చారు. తనతో పాటు తీసుకువచ్చిన ఫుట్‌బాల్‌తో ఆయన నేరుగా చంద్రశేఖర్ తివారీ చాంబర్‌కు వెళ్లారు. తన నియోజకవర్గ పరిధిలో పార్టీపరంగా జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆయనకు ఫుట్‌బాల్ ఇచ్చారు. దీంతో విస్మయానికి గురైన తివారీ, ఆ తర్వాత ఆయనతో చర్చించారు. తన నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో సమన్వయలోపం ఉందని, రంగారెడ్డి రూరల్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుల వైఖరి వివరించేందుకు చంద్రశేఖర్ తివారీని కలిశారని, నేతల తీరుపట్ల ఆవేదన వ్యక్తం చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, తనకు పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని కొండా, 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. తనపై కావాలనే కొంతమంది ప్రచారం చేశారని పేర్కొన్నారు.

యూరియా వెతల వరుస

యూరియా కోసం చాంతాడంత క్యూలు, రైతుల్లో ఆగ్రహం.. ధర్నాలు, రాస్తారోకోలు

యూరియా సమస్యలు తీరుస్తాం: తుమ్మల

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

వినాయక చవితి పండుగ పనులు మానుకొని మరీ యూరియా కోసం క్యూలైన్లలో ఓపిగ్గా నిల్చున్నారు రైతులు! ఎప్పటిలాగే తమ వంతు వచ్చేసరికి సరుకు నిండుకోవడం వారిని ఆగ్రహం తెప్పించింది. ఫలితంగా యూరియా కోసం రోడ్డెక్కారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పండుగకు ముందురోజు, మంగళవారం కూడా యూరియా కోసం రైతులు ఆందోళన కొనసాగింది. తాను చంటిబిడ్డను ఎత్తుకొని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రెండ్రోజులుగా క్యూలైన్లో నిల్చున్నా యూరియా దొరకలేదని మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం గూడెంగడ్డ గ్రామంలో ఓ మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లాలోని శివ్వంపేటలో రాత్రి 11 గంటల నుంచే చెప్పులు, ఇటుకలు వరుసగా పెట్టి రైతులు యూరియా కోసం నిరీక్షించారు. జిల్లాలోని పుల్కల్, జిన్నారం, తొగుట, కంది, మద్దూరు, హుస్నాబాద్ వంటి ప్రాంతాల్లో కూడా రైతులు బారుల తీరారు. దౌల్తాబాద్‌లో జ్యోతి ఫర్టిలైజర్ యజమాని గోపిశెట్టి శ్రీనివాస్ టోకెన్లు ఉన్న రైతులకు కాకుండా మండలంలోని నర్సంపేట గ్రామంలో సోమవారం రాత్రి రహస్యంగా ఒక్కోటి రూ.360 చొప్పున 560 బస్తాలను అక్రమంగా విక్రయించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇది టోకెన్లు తీసుకున్న రైతులకు తెలియడంతో.. తమ వద్ద డబ్బులు తీసుకొని బయట విక్రయిస్తున్నారంటూ మండిపడ్డారు. ఫర్టిలైజర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని ధర్నా నిర్వహించారు. విచారణ చేసిన అధికారులు.. జ్యోతి ఫర్టిలైజర్, రోహిణి ఫర్టిలైజర్ దుకాణాలను సీజ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం రాజాపూర్‌లో తెల్లవారుజామున 3 గంటల నుంచే రైతులు క్యూలైన్లలో నిల్చున్నారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ పరిధిలోని రైతులు రాస్తారోకో చేశారు. ఖమ్మం జిల్లా కారేపల్లిలో అర్ధరాత్రి నుంచే యూరియా కోసం పడిగాపులు పడ్డారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట వద్ద వర్షాన్ని లెక్కచేయకుండా రైతులు క్యూలో నిల్చున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటలో రైతులు రోడ్డుపై బైఠాయించారు.



మహబూబాబాద్ జిల్లా గూడూరు సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

సమస్య పరిష్కరిస్తాం: తుమ్మల


యూరియా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో గాయాలపాలైన ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా గజ్వేల్, సిద్దిపేట జిల్లాలో నెలకొన్న యూరియా సమస్యను మంత్రి దృష్టికి అధికారులు తీసుకువెళ్లారు.. అధికారులతో చర్చించి త్వరలోనే యూరియా సమస్యను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. కాగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి తుమ్మల వస్తున్నారని తెలిసి.. ఆయిల్‌ఫెడ్ అధికారులు అక్కడికి వచ్చేందుకు కారులో బయలుదేరగా, వారి వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఆయిల్‌ఫెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్‌కుమార్, నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డిలు గాయపడ్డారు. వారు ప్రయాణిస్తున్న కారు గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామ శివార్లలో ముందు వెళ్తున్న కారును అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డికి కంటి వద్ద గాయం అవగా, ఈడీ ప్రశాంత్‌కుమార్‌కు చెయ్యి విరిగింది. కాలికి తీవ్రగాయమైంది. ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి స్వల్ప గాయాలయ్యాయి. వారిని గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల వారిని పరామర్శించారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని ఆదేశించారు. తన సొంత వాహనంలో వారిని హైదరాబాద్‌కు తరలించారు.

2న పంచాయతీల తుది ఓటరు జాబితా

స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న ఎస్ఈసీ

ఓటరు జాబితా రూపకల్పనకు నోటిఫికేషన్

28న ముసాయిదా ఓటరు జాబితా వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సిద్ధమవుతోంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. పంచాయతీల పరిధిలో ఓటరు జాబితా సవరణ, తుది ఓటరు జాబితా వెల్లడికి సంబంధించి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రామపంచాయతీల పరిధిలో తుది ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు, పోలింగ్ కేంద్రాల ఎంపిక, వాటి నిర్వహణకు తేదీలను నిర్ణయిస్తూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫై చేసిన అన్ని గ్రామపంచాయతీల్లో ఫొటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాల ప్రకారం.. ఈ నెల 28న గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితాను, పోలింగ్ కేంద్రాల సమాచారాన్ని ప్రదర్శించాలి. 29న జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలి. 30న మండల స్థాయిలో ఎంపీడీవోలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం కావాలి. 28 నుంచి 30 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి.. 31న వాటిని పంచాయతీలు, వార్డుల వారీగా గ్రామాల్లో ప్రదర్శించాలి. అనంతరం సవరించిన తుది ఓటరు జాబితాను సెప్టెంబరు 2న విడుదల చేయాలని అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

తొలుత సర్పంచ్ ఎన్నికలు..?

స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబరు 30లోపు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో ప్రభుత్వం కూడా ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని చూస్తోంది. అయితే గ్రామపంచాయతీ పరిధిలో ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ చేయడంతో.. తొలుత సర్పంచ్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదీ సెప్టెంబరులోనే జరుగుతాయని భావిస్తున్నారు. అయితే ఎన్నికల ప్రక్రియ ఎలా ఉంటుందన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహించాలన్నది ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి ఉంటుందని ఎస్ఈసీ అధికారి ఒకరు చెప్పారు.

మీ పాలన.. మా పాలనపై చర్చకు సిద్ధమా?

» బండి సంజయ్‌కు మహేశ్ కుమార్ గౌడ్ సవాల్

» కేటీఆర్, హరీశ్ ఏనాడైనా ఓయూకి వచ్చారా?: పీసీసీ



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ 12 ఏళ్ల పాలన, రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనపైన కరీంనగర్ నడిబొడ్డున చర్చకు సిద్ధమా? అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ సవాల్ విసిరారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా బండి సంజయ్ ఎన్నిసార్లు పోటీ చేసి ఓటమి పాలయ్యారో ఆయనకు గుర్తు లేదా? అని మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీకి ఘోర పరాజయం తప్పదని, రాజకీయ సన్యాసం తీసుకోవడానికి ఆయన సిద్ధంగా ఉండాలని అన్నారు. దేవుడి పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే బీజేపీ ప్రభుత్వం.. కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న దేవాలయాల అభివృద్ధికి ఒక్క పైసా అయినా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు.. ప్రాజెక్టుల కేటాయింపుల్లో అన్యాయంపై ప్రశ్నిస్తే.. దానికి సమాధానం చెప్పుకోలేక దాట వేస్తున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు, కరీంనగర్‌కు బండి సంజయ్ ఏమి చేశారో లెక్కలు చెప్పగలడా అని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులను కేంద్రం అడ్డుకుంటున్నా.. ఒక బీసీ బిడ్డగా బండి సంజయ్ ఎందుకు ప్రశ్నించట్లేదని నిలదీశారు. ఓట్ చోరీని రాహుల్‌గాంధీ ఆధారాలతో సహా నిరూపించడంతో బీజేపీ నేతలు సమాధానం చెప్పుకోలేకపోతున్నారన్నారు. బండి సంజయ్‌కు రాజకీయ సన్యాసం, మఠంలో స్థిరనివాసం ఖాయమని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కేటీఆర్, హరీశ్ రావులు ఒక్కనాడైనా ఉస్మానియా వర్శిటీ(ఓయూ)కి వచ్చారా అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ప్రశ్నించారు. పదేళ్లలో ఒక్కనాడూ ఓయూకి రాని బాల్క సుమన్.. ఓయూకి సీఎం రేవంత్ రాకపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ఇస్తుందని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతీ రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి ఆమె వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. కాగా, ఉప రాష్ట్రపతి పదవికి తాజా ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తరఫున సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంలో రేవంత్‌రెడ్డి కీలకంగా వ్యవహరించి జాతీయ రాజకీయాల్లో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచారని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు.

వార్డు సభ్యుడిగా కూడా గెలవని మహేశ్‌గౌడ్‌కు ఏం తెలుసు?

» దొంగ ఓట్లు ఉంటే ఈసీకి లేఖ రాయండి: బండి సంజయ్



కరీంనగర్/హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "దొంగ ఓట్లు ఉన్నాయని ఆరోపిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వాటిని తొలగించాలని ఈసీకి లేఖ రాయాలి. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు వెళ్దాం. ఒకవేళ కాంగ్రెస్ గెలిస్తే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో 2.25 లక్షల భారీ మెజారిటీతో బీజేపీని గెలిపించిన కరీంనగర్ ప్రజలను కాంగ్రెస్ అవమానిస్తోందని మండిపడ్డారు. ఒక్కసారైనా కనీసం వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని మహేశ్ గౌడ్‌కు దొంగ ఓట్ల గురించి ఏం తెలుసని ప్రశ్నించారు. దొంగ ఓట్లతో గెలవాలనుకుంటే 8 ఎంపీ సీట్లు మాత్రమే బీజేపీ ఎందుకు గెలుస్తుందని, మొత్తం ఎంపీ స్థానాలను గెలుచుకునే వాళ్లం కాదా అని పేర్కొన్నారు. మహేశ్‌గౌడ్‌ను చూస్తే గజిని సినిమా గుర్తుకొస్తోందని.. తనను బీసీ అన్నది ఆయనేనని, ఇప్పుడు దేశ్‌ముఖ్ అని అంటున్నదీ ఆయనేనని చెప్పారు. ఎన్నికలొస్తే టోపీలు పెట్టుకుని మసీదుల్లో ప్రార్థనలు చేస్తూ ఓట్లడిగే బిచ్చగాళ్లు కాంగ్రెస్ వాళ్లు అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు అని చెప్పి ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలున్నా, లేకున్నా హిందూ సమాజం, సనాతన ధర్మ పరిరక్షణ కోసం పోరాడే పార్టీ బీజేపీ మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వెళితే రాళ్లతో కొట్టేంత కోపంతో ప్రజలు ఉన్నారన్నారు.

దమ్ముంటే రాజీనామా చేయండి: రఘునందన్‌రావు

బీజేపీ ఓటు చోరీ చేస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 8 మంది ఎంపీలు ఎలా గెలిచారని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "ధైర్యముంటే మీ ఎంపీలను రాజీనామా చేయించండి. మేమూ రాజీనామా చేస్తాం. కొత్త ఓటరు జాబితాతో ఎన్నికలకు వెళదాం. ఎవరి సత్తా ఏమిటో తేలిపోతుంది" అని సవాల్ చేశారు. రాష్ట్రంలో వంద అసెంబ్లీ సీట్లు గెలుస్తామన్న నమ్మకముంటే తక్షణమే శాసనసభను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్‌కు రఘునందన్ సవాల్ చేశారు.

వచ్చే ఐదేళ్లలో భారత్‌లో రూ.70,000 కోట్ల పెట్టుబడులు

సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ

హన్సల్‌పూర్ (గుజరాత్): భారత్‌లో సంస్థ కార్యకలాపాలు పటిష్ఠం చేయడంపై జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ దృష్టి సారించింది. వచ్చే ఐదారేళ్ల కాలంలో ఇందుకోసం రూ.70,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ కారు ఈ-విటారా ఎగుమతులను, లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్ తయారీ విభాగాన్ని మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సుజుకీ మోటార్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ మాట్లాడుతూ.. తమ పెట్టుబడి ప్రణాళికలను వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా భారత మొబిలిటీ యానంలో సుజుకీ చురుకైన భాగస్వామిగా ఉన్నదని, పర్యావరణహితమైన హరిత మొబిలిటీని ప్రోత్సహించాలన్న భారత్ విజన్‌కు మద్దతుగా నిలుస్తుందని అన్నారు. ఏడాదికి 40 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం సాధించడం, అందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, ఆర్ అండ్ డీ ఏర్పాటు, కొత్త టెక్నాలజీలపై ఈ పెట్టుబడులుంటాయని మారుతి సుజుకీ ఇండియా చైర్మన్ ఆర్‌సీ భార్గవ చెప్పారు. రూ.35,000 కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు గత ఏడాది ప్రకటించిన రెండో ప్లాంట్ నిర్మాణం గురించిన ప్రశ్నకు స్పందిస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశం అనంతరం దానికి తాను సమాధానం చెప్పగలుగుతానన్నారు. మారుతి సుజుకీ ఇండియా భాగస్వామిగా ఉన్న సుజుకీ గ్రూప్ ఇప్పటికే దేశంలో రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టింది. ఈ పెట్టుబడితో అందుకు సంబంధించిన విభాగాల్లో 11 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయని భార్గవ అన్నారు. ఈ-విటారా ఎగుమతి మార్కెట్ల కోసం తయారు చేస్తున్నామని, దేశీయ మార్కెట్లో దాన్ని విడుదల చేయడానికి నిర్దిష్ట కాలపరిమితి ఏదీ పెట్టుకోలేదని ఆయన వెల్లడించారు. ఆ కారును దేశీయ మార్కెట్లో విడుదల చేయకపోవడానికి ఎగుమతి కట్టుబాట్లతో పాటు ధర కూడా ప్రధానమని చెప్పారు. బ్యాటరీల దిగుమతి కారణంగా దేశంలో ఈవీల ధరలు అధికంగా ఉన్నాయన్నారు. గుజరాత్ ప్లాంట్‌లో తయారైన మేడ్ ఇన్ ఇండియా ఈ-విటారాను జపాన్, యూరప్ సహా 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ఆయన చెప్పారు. 10 లక్షల కార్ల తయారీ లక్ష్యంతో ఈ యూనిట్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ తయారీ హబ్ కానుందని ఆయన వెల్లడించారు. కాగా దేశంలో తొలి లిథియం అయాన్ బ్యాటరీ తయారీ యూనిట్ ప్రారంభించడాన్ని ఒక మైలురాయిగా సుజుకీ అభివర్ణించారు.



ఈ-విటారా ఎగుమతులను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ, తొషిహిరో సుజుకీ

లిథియం సరఫరానే పెద్ద సమస్య

లిథియం కోసం మనం చైనాపై అధికంగా ఆధారపడాల్సి రావడమే పెద్ద సమస్య అని, అందుకే బ్యాటరీ సెల్స్ తయారీ విభాగంలో భారీ ఎత్తున ప్రవేశించేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంలేదని భార్గవ అన్నారు. వెలుపలి సరఫరాలపై ఆధారనీయత తగ్గించుకోగల ప్రత్యామ్నాయ టెక్నాలజీలను భారత శాస్త్రవేత్తలు కనుగొనగలరన్న ఆశాభావం ఆయన ప్రకటించారు. బ్యాటరీ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న పని అని పేర్కొంటూ బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.20,000 కోట్ల పెట్టుబడి అవసరమన్నది పరిశ్రమ అంచనా అని చెప్పారు. ప్లాంట్ ఏర్పాటుకు ఎవరైనా ముందుకు వచ్చినా ముడిసరుకు లేకపోవడం అనేది పెద్ద రిస్క్‌గా అంచనా వేయవచ్చన్నారు.

అమెరికా ఫెడ్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన

న్యూయార్క్: తనఖా రుణాల అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌కు ఉద్వాసన చెప్పాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం నిర్ణయించారు. ఫెడ్‌కు గవర్నర్‌గా నియమితురాలైన తొలి ఆఫ్రికన్-అమెరికన్ ఆమె. ట్రంప్ నియమించిన ఫెడరల్ హౌసింగ్ ఫైనాన్స్ ఏజెన్సీ చీఫ్ విలియం పుల్టే.. లిసా తనఖా పెట్టిన రెండు నివాసాలు ఆమెకు సంబంధిచినవేనని ఆరోపించారు. దీన్ని ఆధారం చేసుకుని లిసాను రాజీనామా చేయాలని ఈ నెల 20న ట్రంప్ ఆదేశించారు. అంతేకాకుండా "మిమ్మల్ని పదవి నుంచి తొలగించేందుకు తగిన ఆధారాలున్నట్టు నేను నిర్ధారించుకున్నాను" అని ట్రంప్ ఆమెకు రాసిన లేఖలో పేర్కొన్నారు. తనఖా దరఖాస్తుల్లో ఆమె తప్పుడు సమాచారం ఇచ్చారని కూడా ఆరోపించారు. ఫెడ్ నాయకత్వంలో మార్పులు చేయాలన్న తన ప్రయత్నంలో భాగంగా ట్రంప్ అనుసరిస్తున్న ఒత్తిడి వ్యూహమని విశ్లేషకులంటున్నారు. వడ్డీరేట్ల తగ్గింపు విషయంలో ఫెడ్‌కు, ట్రంప్‌కు మధ్యన విభేదాలున్న విషయం విదితమే.

ఫార్మాపై జీఎస్‌టీని హేతుబద్ధీకరించాలి

కీలక అంశాలనూ పరిష్కరించాలి
డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీష్ రెడ్డి



నూఢిల్లీ: ప్రతిపాదిత జీఎస్‌టీ సంస్కరణలు ఫార్మా పరిశ్రమకు తోడ్పడేలా ఉండాలని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సంస్కరణలు హేతుబద్ధంగా, ఫార్మా కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేలా ఉండాలన్నారు. చాలా కాలంగా ఫార్మా కంపెనీలు ఔషధాలపై తక్కువ పన్ను, ముడి పదార్థాలపై ఎక్కువ పన్నుల సమస్యను ఎదుర్కొంటున్న విషయాన్ని గుర్తు చేశారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగి, రోగులకూ ఔషధాలు అందుబాటు ధరల్లో లేకుండా పోతున్నాయన్నారు. త్వరలో చేపట్టే సంస్కరణలు ఈ కీలక సవాళ్లను అధిగమించేలా ఉంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా ప్రతి పౌరుడికి అత్యవసర మందుల ధర అందుబాటులో ఉండే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లోనూ మన కంపెనీల పోటీ సామర్థ్యం పెరిగి సరికొత్త ఔషధాలనూ ఉత్పత్తి చేయగలుగుతామని సతీష్ రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమకు మేలు చేసే సంస్కరణల కోసం ప్రభుత్వంతో కలిపి పని చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం తుది ఔషధాలపై 12 శాతం, వాటి తయారీ కోసం వినియోగించే ముడి పదార్థాలపై 18 శాతం జీఎస్‌టీ అమల్లో ఉంది. సంస్కరణల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న నాలుగు జీఎస్‌టీ శ్లాబులను ప్రభుత్వం 5, 18 పేరుతో రెండు శ్లాబులుగా మార్చాలని యోచిస్తోంది.

దేశీ మార్కెట్లోకి లినాక్లోటైడ్ ఔషధం

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ దేశీయ మార్కెట్లోకి జెనరిక్ మలబద్ధకాన్ని తగ్గించే ఔషధం లినాక్లోటైడ్‌ను తీసుకువచ్చింది. కొలోజో బ్రాండ్ పేరుతో దీన్ని విక్రయించనుంది. ఈ ఔషధం పెద్దలు, 6 నుంచి 17 ఏళ్ల వయసు కలిగిన వారిలో తలెత్తే మలబద్ధకాన్ని నివారిస్తుందని తెలిపింది.

మార్కెట్లో మళ్లీ టారిఫ్ కల్లోలం

81,000 దిగువకు సెన్సెక్స్

రూ.5.41 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: భారతీయ వస్తువులపై అమెరికాలో బుధవారం నుంచి అమల్లోకి రానున్న 25% అదనపు టారిఫ్‌లు ఈక్విటీ మార్కెట్లలో కల్లోలం సృష్టించాయి. అదనపు టారిఫ్‌లకు సంబంధించి అమెరికా ముసాయిదా నోటీసు జారీ చేయడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పరుగులు తీశారు. ఫలితంగా సెన్సెక్స్ 849.37 పాయింట్లు నష్టపోయి 80,786.54 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 25 నష్టాల్లోనే ముగిశాయి. ఇంట్రాడేలో సూచీ 949.93 పాయింట్లు నష్టపోయి 80,685.98 వరకు దిగజారింది. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.5,41,542.83 కోట్లు నష్టపోయి రూ.449 లక్షల కోట్లకు దిగజారింది. మరోవైపు నిఫ్టీ 255.70 పాయింట్ల నష్టంతో 24,712.05 వద్ద క్లోజైంది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి కూడా డాలర్ మారకంలో 13 పైసలు దిగజారి 87.69 వద్ద ముగిసింది.

నేడు మార్కెట్లకు సెలవు

బుధవారం వినాయక చవితి సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సహా కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. గురువారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

ఆర్డీ ఇంజనీరింగ్ ఇష్యూకు సెబీ ఓకే

రూ.580 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఆర్డీ ఇంజనీరింగ్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.580 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్యూలో భాగంగా రూ.500 కోట్లకు కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా ప్రమోటర్ చంద్రశేఖర్ మోటూరు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.80 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నట్లు ఐపీఓ ముసాయిదా పత్రాల్లో వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నెలలో కంపెనీ ఐపీఓకి దరఖాస్తు చేసింది. ఇష్యూ ద్వారా సమీకరించిన మొత్తాల్లో రూ.279.60 కోట్లను తెలంగాణలోని సీతారాంపూర్‌లో కొత్తగా రెండు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వినియోగించనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని పరవాడలో రూ.44.8 కోట్లతో సమీకృత మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. రూ.65 కోట్ల మొత్తాలను సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం వినియోగించనుంది.

సగ్స్ లాయడ్ ఇష్యూ ధర రూ.117-123: ఇంటిగ్రేటెడ్ ఈపీసీ కంపెనీ సగ్స్ లాయడ్ పబ్లిక్ ఇష్యూ వచ్చే శుక్రవారం ప్రారంభమై మంగళవారంతో (సెప్టెంబరు 2) ముగియనుంది. షేరు ధరల శ్రేణిని రూ.117-123గా ప్రకటించారు.

సాయి లైఫ్ సైన్సెస్‌కు టీపీజీ గుడ్‌బై

14.72 శాతం వాటా రూ.2,675 కోట్లకు విక్రయం

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఫార్మా కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్‌కి అమెరికా కేంద్రంగా పనిచేసే ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ టీపీజీ గుడ్‌బై చెప్పింది. సాయి లైఫ్ ఈక్విటీలో తనకు ఉన్న 3.07 కోట్ల షేర్లను (14.72 శాతం) మంగళవారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా రూ.2,675.64 కోట్లకు విక్రయించింది. మూడు విడతలుగా ఒక్కో షేరును రూ.871.01-871.86 మధ్య విక్రయించింది. ఇందులో 14.06 లక్షల షేర్లను ప్యారిస్ కేంద్రంగా పనిచేసే సొసైటీ జనరల్, గోల్డ్‌మన్ శాచ్ సింగపూర్ 11.04 లక్షల షేర్లను కొనుగోలు చేశాయి. మిగతా వాటాలను ఎవరు కొన్నారనే విషయం ఇంకా వెల్లడి కాలేదు. ఈ ఏడాది జూన్‌లోనూ టీపీజీ.. సాయి లైఫ్ సైన్సెస్ ఈక్విటీలో 10 శాతం వాటాను రూ.1,505 కోట్లకు విక్రయించింది.

ఫ్లిప్‌కార్ట్-ఎస్‌బీఐ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్

ఎస్‌బీఐ కార్డ్.. ఈ- కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ కో- బ్రాండెడ్ క్రెడిట్ కార్డును ఆవిష్కరించాయి. 'ఫ్లిప్‌కార్ట్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్' పేరుతో విడుదల చేసిన ఈ కార్డు ద్వారా మింత్రాలో చేసిన కొనుగోళ్లపై 7.5%, ఫ్లిప్‌కార్ట్, షాప్సీ, క్లియర్‌ట్రిప్‌లో కొనుగోళ్లపై 5% క్యాష్‌బ్యాక్ పొందవచ్చని తెలిపాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27 తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	550
వరంగల్	502	గోదావరి	540
చిత్తూరు	558	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	112
వరంగల్	98	గుంటూరు	112
కరీంనగర్	98	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	88
కర్నూలు	98	నెల్లూరు	93
విశాఖపట్నం	116	అనంతపురం	93
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,060 ▲	93,550 ▲	1,30,000 ▼
విజయవాడ	1,03,800 ▲	97,000 ▲	1,19,200 ▼
విశాఖపట్నం	1,03,940 ▲	93,050 ▲	1,30,000 ▲
రాజమండ్రి	1,02,050 ▲	93,550 ▲	1,19,500 ▲
ప్రొద్దుటూరు	1,02,250 ▲	94,070 ▲	1,19,100 ▲
ముంబై	1,00,884 ▲	92,410 ▲	1,15,870 ▼

రూ.90 కోట్లతో తెలంగాణ ప్లాంట్ విస్తరణ

యూబీఎల్

హైదరాబాద్: యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్)కి చెందిన కేన్డ్ బీరు తెలంగాణలో మరింతగా అందుబాటులోకి రానుంది. కంపెనీ ఇందుకోసం సంగారెడ్డి వద్ద ఉన్న నిజాం బ్రూవరీ ప్లాంట్‌లో రూ.90 కోట్ల పెట్టుబడితో ప్రత్యేకంగా కేన్డ్ లైన్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏటా నాలుగు కోట్ల లీటర్ల కేన్డ్ బీరు ఉత్పత్తి చేసేలా ఏర్పాటు చేసే ఈ లైన్ నిర్మాణం ఏడాదిలో పూర్తవుతుందని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం కంపెనీ ఈ కేన్డ్ బీరును మహారాష్ట్రలోని యూనిట్ల నుంచి దిగుమతి చేసుకుని రాష్ట్రంలో పంపిణీ చేస్తోంది. తెలంగాణలో కేన్డ్ బీరుకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోనే కేన్డ్ బీరు ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు యూబీఎల్ వెల్లడించింది.

అమెరికాకు చెందిన శివమ్ కాంట్రాక్టింగ్ ఇంక్ (ఎస్‌సీఐ)లో రూ.52 కోట్ల (60 లక్షల డాలర్లు) పెట్టుబడులు పెట్టేందుకు సెల్విన్ ట్రేడర్స్ లిమిటెడ్ (ఎస్‌టీఎల్) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. డీల్‌లో భాగంగా శివమ్ కాంట్రాక్టింగ్‌లో 60 శాతం వాటాను ఎస్‌టీఎల్ చేజిక్కించుకోనుంది. డిసెంబరు నాటికల్లా ఈ డీల్‌ను ముగించనున్నట్లు ప్రకటించింది. కాగా ఎస్‌సీఐ అమెరికాలో నిర్మాణ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. అంతర్జాతీయంగా శివమ్ కార్యకలాపాలను విస్తరించేందుకు మరో రూ.260 కోట్ల పెట్టుబడులను సెల్విన్ పెట్టనుంది.

స్పోర్ట్స్

చోప్రాకు కఠిన సవాల్



- రేపు డైమండ్ లీగ్ ఫైనల్
- రాత్రి 11.15 నుంచి..

న్యూఢిల్లీ: మరోసారి డైమండ్ లీగ్ (డీఎల్) టైటిల్ సొంతం చేసుకోవాలనుకొంటున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు గట్టిపోటీ ఎదురుకానుంది. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో గురువారం రాత్రి జరిగే డీఎల్ ఫైనల్లో సమకాలీన ప్రత్యర్థులు.. డిఫెండింగ్ చాంప్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జూలియన్ వెబర్ (జర్మనీ) కూడా బరిలో నిలవనున్నారు. రెండు ఒలింపిక్ పతకాలు నెగ్గిన చోప్రా సెలెసియా, బ్రస్సెల్స్‌లో జరిగిన డైమండ్ లీగ్‌ల్లో పాల్గొనలేదు. దోహా, పారిస్ ఈవెంట్లలో బరిలోకి దిగిన నీరజ్ నాలుగో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. గత మేలో దోహాలో జరిగిన ఈవెంట్‌లో చోప్రా 90.23 మీటర్ల దూరం విసిరినా.. వెబర్ తర్వాత రెండో స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2022లో డైమండ్ లీగ్ టైటిల్ నెగ్గిన చోప్రా.. 2023, 2024లో రన్నరప్‌గా నిలిచాడు.

సిఫ్ట్ కౌర్ డబుల్ గోల్డ్

ఆసియా షూటింగ్



షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సిఫ్ట్ కౌర్ సమ్రా డబుల్ ధమాకా సృష్టించింది. వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు కొల్లగొట్టింది. మంగళవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్లో చైనా షూటర్ యాంగ్ యూజీ (458.8 పాయింట్లు)ని ఓడించిన కౌర్ (459.2) పసిడి నెగ్గింది. ఇక, టీమ్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్, ఆషి చోక్సీ, అంజుమ్ మౌద్గిల్ త్రయం ఫైనల్లో 1753 పాయింట్లతో టాప్‌లో నిలిచి పసిడి పతకాన్ని నెగ్గింది. మరోవైపు జూనియర్ షూటర్లు పతకాల పంట పండించారు. జూ. మహిళల 50 మీ. రైఫిల్ 3 పొజిషన్స్‌లో అనుష్క వ్యక్తిగత స్వర్ణంతోపాటు ప్రాచీ గైక్వాడ్, మహిత్ సంధుతో కలిసి టీమ్ పసిడిని కూడా సొంతం చేసుకొంది. పురుషుల 25 మీ. ర్యాపిడ్ ఫైర్ టీమ్ ఈవెంట్‌లో సూరజ్, అభినవ్, సమీర్‌ల టీమ్ స్వర్ణం సాధించగా.. ఇదే ఈవెంట్‌లో సమీర్‌కు వ్యక్తిగత కాంస్యం దక్కింది. మహిళల ట్రాప్‌లో హరీస్, ఆద్య స్వర్ణ, రజతాలు గెలిచారు. ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో సబీరా, ఆద్య, భవ్య త్రిపాఠిల త్రయం, పురుషుల్లో అర్జున్, ఆర్యవంశ్, ఉద్ధవ్ రాథోడ్‌ల టీమ్‌లు బంగారు పతకాలు కొల్లగొట్టాయి. ఆర్యవంశ్ వ్యక్తిగత విభాగంలో రజతం సాధించాడు.

అల్కారజ్ అలవోకగా..

- రెండో రౌండ్‌కు స్వియటెక్, రూడ్
- కీస్, స్విటోలినా, వీనస్ ఇంటిబాట

యూఎస్ ఓపెన్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో రెండో రోజు పురుషుల సింగిల్స్ బరిలోకి దిగిన స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కారజ్‌తో పాటు కాస్పర్ రూడ్, ఖచనోవ్, ఆండ్రీ రుబ్లెవ్, హోల్గర్ రూన్, ఫ్రాన్సెస్ టియాఫోలాంటి సీడెడ్‌లంతా రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మహిళల్లో మాత్రం ఆరో సీడ్ మాడిసన్ కీస్, ఉక్రెయిన్ స్టార్ స్విటోలినా, వెటరన్ ఏస్ వీనస్ విలియమ్స్ ఆరంభంలోనే ఇంటిబాట పట్టారు. స్థానిక ఆటగాడు రిలీ ఓపెల్కాతో జరిగిన పోరును మాజీ చాంపియన్ అల్కారజ్ 6-4, 7-5, 6-4తో వరుససెట్లలో ముగించాడు. కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను మూడేళ్ల క్రితం (2022) ఇక్కడే నెగ్గిన 22 ఏళ్ల అల్కారజ్.. గ్రాండ్‌స్లామ్స్‌లో తొలి రౌండ్ విజయాల రికార్డును 19-0తో మరింత పదిలం చేసుకున్నాడు. 11వ సీడ్ రూన్ 6-3, 7-6 (4), 7-6 (2)తో బొటిక్ వాన్‌పై, 12వ సీడ్ రూడ్ 6-1, 6-2, 7-6 (5)తో సెబాస్టియన్‌పై, 15వ సీడ్ రుబ్లెవ్ 6-4, 6-4, 6-4తో ప్రిజ్మిక్‌పై, 17వ సీడ్ టియాఫో 6-3, 7-6 (6), 6-3తో నిషిఒకపై గెలిచారు.

కీస్.. 89 తప్పిదాలు: ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న అమెరికా స్టార్ క్రీడాకారిణి మాడిసన్ కీస్‌కు సొంతగడ్డపై మాత్రం చుక్కెదురైంది. మెక్సికోకు చెందిన 82వ ర్యాంకర్ రెనటా జరజువా 6-7 (12), 7-6 (3), 7-5తో కీస్‌ను కంగుతినిపించి రెండో రౌండ్ చేరింది. 3 గంటలా పది నిమిషాల హోరాహోరీ పోరులో కీస్.. ఏకంగా 89 అనవసర తప్పిదాలు, 14 డబుల్ ఫాల్ట్స్ చేసి మ్యాచ్‌ను చేజార్చుకుంది. గతంలో ఇక్కడ రెండుసార్లు విజేతగా నిలిచిన 45 ఏళ్ల వీనస్‌ను 11వ సీడ్ ముచోవా 6-3, 2-6, 6-1తో ఓడించింది. 12వ సీడ్ స్విటోలినా 2-6, 4-6తో అన్నా బొండర్ చేతిలో చిత్తయింది. రెండో సీడ్ స్వియటెక్ 6-1, 6-2తో ఎమిలియానో అరంగాను, ఐదో సీడ్ మిర్రా ఆండ్రీవ 6-0, 6-1తో అలిసియాను, 15వ సీడ్ కసత్కినా 7-5, 6-1తో ఎలెనాను, సక్కారి 6-3, 6-2తో మరియాను ఓడించి రెండో రౌండ్లో ప్రవేశించారు.

వావ్.. వాంగ్: హాంకాంగ్‌కు చెందిన 21 ఏళ్ల కోల్‌మన్ వాంగ్ 6-4, 7-5, 7-6 (4)తో అలెగ్జాండర్‌ను ఓడించి రెండో రౌండ్ చేరాడు. ఈ క్రమంలో ఓపెన్ ఎరా (1968 నుంచి)లో గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ మ్యాచ్ నెగ్గిన తొలి హాంకాంగ్ ఆటగాడిగా వాంగ్ చరిత్ర సృష్టించాడు.

పోరాడి ఓడిన బసవా రెడ్డి

అమెరికాకు చెందిన తెలుగు సంతతి ఆటగాడు నిశేష్ బసవా రెడ్డి తొలి రౌండ్లోనే వెనుదిరిగాడు. 9వ సీడ్ ఖచనోవ్‌తో జరిగిన పోరులో తొలి సెట్ గెలిచిన బసవా రెడ్డి 7-6 (5), 3-6, 5-7, 1-6తో ఓడాడు. ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన బసవా రెడ్డి కుటుంబం అమెరికాలో స్థిరపడింది.

స్టయిల్ అదిరింది

కార్లోస్ అల్కారజ్ ఈ గ్రాండ్‌స్లామ్‌కు విభిన్నమైన గెటప్‌లో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఎప్పటిలా సాధారణ హెయిర్ కట్‌లో గాకుండా ఈసారి గుండు చేయించుకున్నాడు. గతానికి కాస్త భిన్నంగా స్లీవ్‌లెస్ టీ షర్ట్ ధరించిన అతను.. పూర్తిగా హెయిర్ కట్ చేయించుకొని తొలి రౌండ్ మ్యాచ్‌లో పోటీపడ్డాడు. మ్యాచ్ అనంతరం తన కొత్త హెయిర్ స్టయిల్‌పై అల్కారజ్ మాట్లాడుతూ.. 'నా సోదరుడు తన బార్బర్ నైపుణ్యాలను చూపించాడు. టోర్నీ ఆరంభానికి ముందు మెషీన్‌తో నా హెయిర్ కట్‌ను సరిచేసే క్రమంలో ఇలాగైంది. ఇది చాలామందికి నచ్చిందనే అనుకుంటున్నా. ఏమంటారు.. మీరంతా?' అని ప్రేక్షకులను అడిగాడు. వారంతా.. సూపర్బ్ అని గట్టిగా అరవడంతో.. 'ఇది బాగుందని మీరు అంగీకరిస్తున్నారు' అని అల్కారజ్ గట్టిగా నవ్వాడు. అయితే, సహచర ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫో మాత్రం.. 'వామ్మో.. భయంకరంగా ఉంది. అయినా, ఇదో రకం స్టయిల్ అనుకోవడమే' అని అనడం గమనార్హం.



సింధు, ప్రణయ్ ముందంజ

వరల్డ్ చాంపియన్‌షిప్

పారిస్: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్లు పీవీ సింధు, హెచ్ఎస్ ప్రణయ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో మాజీ చాంపియన్ సింధు 23-21, 21-6తో కలోయనా నల్బంటోవా (బల్గేరియా)పై వరుస గేమ్‌ల్లో గెలిచింది. తొలి గేమ్ ఆరంభంలో తడబడిన సింధు 0-4తో వెనుకబడింది. అయితే, 2-6తో ఉన్న సమయంలో నల్బంటోవా తప్పిదాలతో సింధు 5-7తో ఆధిక్యం తగ్గించింది. కానీ, బల్గేరియా షట్లర్ 11-7తో బ్రేక్‌కు వెళ్లింది. తిరిగి వచ్చిన తర్వాత పవర్‌ఫుల్ స్మాష్‌లతో విరుచుకుపడ్డ సింధు 12-12తో స్కోరు సమం చేసింది. 20-20 వద్ద మరోసారి స్కోరు సమం చేసిన సింధు.. గేమ్‌ను తన ఖాతాలో వేసుకొంది. రెండో గేమ్‌లో సింధు జోరుకు నల్బంటోవా చేతులెత్తేసింది. ఇక పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో ప్రణయ్ 21-18, 21-15తో జొయాకిమ్ ఓల్డోర్ఫ్ (ఫిన్లాండ్)పై సులువుగా నెగ్గాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని జోడీ 18-21, 21-16, 21-18తో లియాంగ్-వెంగ్ చి నెగ్‌పై గెలిచి ముందంజ వేసింది.



'జోర్డాన్, బ్రయాంట్' కార్డుకు వేలంలో రూ. 113 కోట్లు

న్యూయార్క్: అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజాలు మైకేల్ జోర్డాన్, కోబ్ బ్రయాంట్ మరోసారి చరిత్ర సృష్టించారు. ఈసారి బాస్కెట్‌బాల్ కోర్టులో కాదు.. బయట. ఈ ఇద్దరూ సంతకాలు చేసిన బాస్కెట్‌బాల్ కార్డుకు వేలంలో ఏకంగా రూ. 113 కోట్ల ధర పలకడం విశేషం. 2007-08లో జోర్డాన్, బ్రయాంట్ ధరించిన జెర్సీలు, వాళ్ల సంతకాలతో కూడిన లోగోను ముద్రించిన ఆ కార్డును ఈనెల 23న వేలం వేశారు. క్రీడా చరిత్రలో వేలంలో ఓ కార్డుకు ఇంత ధర పలకం ఇదే తొలిసారి. ఈ క్రమంలో 2022లో బేస్‌బాల్ దిగ్గజం మికీ మాంటెల్ సంతకంతో కూడిన కార్డుకు పలికిన రూ. 110 కోట్ల ధర రికార్డును జోర్డాన్, బ్రయాంట్ కార్డు అధిగమించారు. కాగా బ్రయాంట్ 2020లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే.

టాప్‌లో ప్రజ్ఞానంద

సెయింట్ లూయిస్ (యూఎస్): సింక్వెఫీల్డ్ కప్‌లో ప్రజ్ఞానంద (4.5 పాయింట్లు) రెండో విజయంతో సంయుక్తంగా టాప్‌లోకి దూసుకెళ్లాడు. వరుసగా ఐదు గేమ్‌లు డ్రా చేసుకొన్న ప్రజ్ఞానంద మంగళవారం జరిగిన ఏడో రౌండ్‌లో అలీరెజా (ఫ్రాన్స్)పై 31 ఎత్తుల్లో నెగ్గాడు. కాగా, సో వెస్లీ (అమెరికా) చేతిలో గుకేష్ పరాజయం పాలయ్యాడు.

సత్తాచాటిన నయనశ్రీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఆసియా ఓపెన్ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో తెలుగమ్మాయి తాళ్లూరి నయనశ్రీ నాలుగు పతకాలు సాధించింది. డెహ్రాడూన్‌లో జరిగిన ఈ పోటీల్లోని స్పీడ్ స్కేటింగ్ 500, 1500 మీటర్లలో కాంస్యాలు, 1000 మీ..లో రజతం, 3000 మీటర్లలో రజతం సాధించింది. ఖమ్మంకు చెందిన నయనశ్రీ ఈ ప్రదర్శనతో జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడం విశేషం.

పుజార పెన్షన్ రూ. 70వేలు

న్యూఢిల్లీ: చటేశ్వర్ పుజార ఇటీవలే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. దీంతో ఇప్పుడతనికి పెన్షన్ రూపంలో బీసీసీఐ నుంచి నెలకు ఎంత లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, 103 టెస్టులు ఆడిన పుజారకు అప్పర్ టైర్ (ఎక్కువ టెస్టులు ఆడడం) నిబంధనల ప్రకారం బీసీసీఐ నెలకు రూ. 70 వేలు చెల్లిస్తుంది.

కోయల్ వరల్డ్ రికార్డు

అహ్మదాబాద్: కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో కోయల్ బార్ (భారత్) యూత్ వరల్డ్ రికార్డు నెలకొల్పింది. 53 కి.విభాగంలో కోయల్ 192 (85+107) కిలోల బరువునెత్తి స్వర్ణం దక్కించుకొంది. క్లీన్ అండ్ జెర్క్‌లోనూ 107 కిలోలు ఎత్తి నయా రికార్డు సృష్టించింది.

ఆంధ్రను వీడిన విహారి

వచ్చే సీజన్ నుంచి త్రిపుర తరపున బరిలోకి
ఏసీఏ నుంచి సహకారం లేదన్న హనుమ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): వైసీపీ ప్రభుత్వంలో అనేక అవమానాలనెదుర్కొని ఆంధ్ర క్రికెట్ జట్టును వీడి.. మళ్లీ వెనక్కివచ్చిన హనుమ విహారి తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే సీజన్‌లో త్రిపుర తరఫున ఆడేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆంధ్ర సీనియర్ జట్టు బాధ్యతలు పూర్తిగా తనకే అప్పగిస్తామని పెద్దలు చెప్పినా అలా జరగలేదని విహారి వాపోయాడు. ఏసీఏలో పెద్దగా మార్పులేమీ రాలేదని, అప్పుడు, ఇప్పుడు ఒకేలా ఉందని అన్నాడు. తనకు వైట్‌బాల్ క్రికెట్‌లో అవకాశం ఇస్తారన్న నమ్మకం లేదన్నాడు. మరోవైపు త్రిపుర నుంచి ప్రతిపాదన వచ్చిందని తెలిపాడు. దీంతో తాను ఏసీఏను నిరభ్యంతర పత్రం కావాలని అడిగానని, వారు మంజూరు చేశారని చెప్పాడు. ఇక, దీనిపై ఏసీఏ కార్యవర్గంలోని ఒక కీలక సభ్యుడు స్పందిస్తూ గత సీజన్‌లో విహారికి అన్ని మ్యాచ్‌లు ఆడేందుకు అవకాశం ఇచ్చామని తెలిపారు. 'యువ క్రికెటర్లకు అవకాశం ఇవ్వాలని విహారి కోరినందునే సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీకి విహారిని ఎంపిక చేయలేదు. ఏపీఎల్‌లో అద్భుతంగా ఆడినందున అతడికి ఈ సీజన్‌లో అన్ని ఫార్మాట్లలో అవకాశం ఇవ్వాలని అనుకున్నాం. కానీ, మమ్మల్ని సంప్రదించకుండా ఏకపక్షంగా త్రిపుర వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాడు' అని ఆ కార్యవర్గ సభ్యుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో స్వశక్తి చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల

త్వరలో నేతన్నలకు 33 కోట్ల రుణమాఫీ

» స్వశక్తి మహిళలకు రెండు చీరల చొప్పున అందిస్తాం: తుమ్మల

సిరిసిల్ల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ చేసినట్లే నేత కార్మికుల రుణాలను క్యాబినెట్‌లో చర్చించి త్వరలోనే మాఫీ చేస్తామని చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ముఖ్యమంత్రి నేతన్నలకు సంబంధించి రుణమాఫీ చేయడానికి నివేదిక తయారు చేయాలని సూచించిన మేరకు రూ.33 కోట్లు రుణాలు ఉన్నట్లు లెక్కలు తేలాయని తెలిపారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేతన్న పొదుపు(త్రిఫ్ట్), నేతన్న బీమా పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఇదే సందర్భంలో దసరాకు స్వశక్తి మహిళలకు అందించే ఏకరూప చీరలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జౌళి శాఖ కార్యదర్శి శైలజారామయ్యర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మహిళలు గౌరవంగా స్వీకరించేలా నాణ్యమైన చీరలు అందిస్తామన్నారు. ఒక్క చీరపై రూ.480 ఖర్చు చేస్తూ 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గతంలో ఏం జరిగిందో.. ఇప్పుడు ఏం జరుగుతుందో గమనించాలన్నారు.

'నారాయణపేట' ఎత్తిపోతలకు టీవోఆర్ జారీ

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖకు చెందిన రాష్ట్ర పర్యావరణ ప్రభావ మదింపు అథారిటీ(ఎస్ఈఐఏఏ) టర్మ్ అండ్ రిఫరెన్స్(టీవోఆర్)ను జారీ చేసింది. ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగిన ఈ అథారిటీ సమావేశం మినిట్స్ మంగళవారం విడుదలయ్యాయి. తాజా నిర్ణయంతో వాతావరణ, శబ్ద కాలుష్యంతో పాటు పర్యావరణంపై పడే ప్రభావంపై సమగ్ర నివేదికను సిద్ధం చేయనున్నారు. ఆ తర్వాతే పర్యావరణ అనుమతి కోసం దరఖాస్తు పెట్టుకోనుంది.

ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు రూ.వెయ్యి కోట్లు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు రూ.వెయ్యి కోట్లు విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్ తెలిపారు. 2.04లక్షల ఇళ్ల పనులు ప్రారంభం కాగా లక్ష ఇళ్లు బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు, డిప్యూటీ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై గౌతమ్ సమీక్ష నిర్వహించారు.

ఎఫ్ఎంజీఈ స్క్రీనింగ్ టెస్టుకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్(ఎఫ్ఎంజీఈ) నిర్వహించనున్నట్లు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం టెస్టు షెడ్యూల్‌ను విడుదల చేసింది. సెప్టెంబరు 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. తుది గడువు సెప్టెంబరు 30 అని తెలిపింది.

కేసు విచారణ నుంచి నేను తప్పుకొంటున్నా!

» ఇందులో ఒక పక్షానికి అనుకూలంగా ఉండాలంటూ.. ఉన్నత న్యాయవ్యవస్థకు చెందిన సభ్యుడొకరు కోరారు

» ఎన్‌సీఎల్ఏటీ న్యాయమూర్తి జస్టిస్ శరద్‌కుమార్ శర్మ

న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థకు చెందిన అత్యంత గౌరవనీయమైన సభ్యుడొకరు.. ఒక కేసులో.. ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరించాల్సిందిగా కోరారంటూ నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)కి చెందిన న్యాయమూర్తి, జస్టిస్ శరద్‌కుమార్ శర్మ కేసు విచారణ నుంచి తప్పుకొన్నారు. హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ లిమిటెడ్, ఏఎస్ మెట్ కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మధ్య నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్‌లో కేసు నడిచింది. అక్కడి తీర్పును కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ కంపెనీ.. చెన్నై బెంచ్‌లో సవాల్ చేసింది. ఈ కేసులో జూన్ 18న బెంచ్ తీర్పును రిజర్వు చేసింది. అయితే.. ఆగస్టు 13న ఈ కేసులో ఆదేశాలు వెలువరించడానికి ముందు.. అనూహ్యంగా ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్టు జస్టిస్ శరద్‌కుమార్ శర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆరోపణలు చేశారు. "ఈ దేశంలోని ఉన్నత న్యాయ వ్యవస్థలోని అత్యంత గౌరవనీయమైన సభ్యులలో ఒకరు, ఒక నిర్దిష్ట పార్టీకి అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ మాలో ఒకరిని సంప్రదించడం నాకెంతో బాధ కలిగించింది. అందువల్ల, నేను ఈ విషయాన్ని విచారించడానికి నిరాకరిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. కేసు నుంచి తప్పుకోవడానికి ముందు.. ఆయన తన మొబైల్‌ఫోన్‌కు వచ్చిన ఒక సందేశాన్ని ఈ కేసులో వాదనలు వినిపిస్తున్న లాయర్లకు చూపించినట్టు సమాచారం. అయితే.. రెండు పార్టీల్లో ఎవరి తరఫున సంప్రదించారు? ఇంతకీ న్యాయవ్యవస్థలో ఆ గౌరవనీయుడైన సభ్యుడు ఎవరు? అనే దానిపై మాత్రం స్పష్టత రాలేదు. కాగా.. న్యాయవ్యవస్థకు సంబంధించిన వార్తలను ప్రచురించే 'బార్ అండ్ బెంచ్' వెబ్‌సైట్‌లో దీనిపై ఆగస్టు 13నే ఒక కథనం ప్రచురితమైంది. అందులో.. ఒక పక్షానికి అనుకూలంగా ఆదేశాలివ్వాలంటూ జస్టిస్ శరద్‌కుమార్ శర్మను సంప్రదించింది.. ఒక రిటైర్డ్ హైకోర్టు జడ్జి అని పేర్కొనడం గమనార్హం.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

సోన్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని.. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య హత్య చేసిన ఘటన నిర్మల్ జిల్లాలో జరిగింది. ఈ నెల 22న జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో నివాసముండే తిరునగరి నాగలక్ష్మికి 30ఏళ్ల క్రితం హరిచరణ్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన అంకం మహేశ్ తో నాగలక్ష్మీ వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం భర్తకు తెలియడంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రియుడితో కలిసి గొంతుని టవల్‌తో చుట్టి ఊపిరాడకుండా చేసి భర్తను హత్య చేసింది. హరిచరణ్‌కు మూర్ఛ వచ్చిందని, బాత్రూంలో కాలు జారిపడి మృతి చెందాడని బంధువులను నమ్మించింది. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులు నాగలక్ష్మీ, మహేశ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హరిచరణ్ మరణాన్ని తప్పుదోవ పట్టించిన ఆర్ఎంపీ వైద్యుడు రమేష్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

టార్చ్‌లైట్‌తో తలపై కొట్టి భర్త హత్య

పెనుగొండ, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): భర్త దుబాయ్ నుంచి తిరిగొచ్చేశాడని భార్య కోపం!. భార్య తనతో కాపురం చేయడం లేదని భర్త గొడవ. దీనిపై న్యాయం చెప్పండని భర్త పెద్దల వద్ద పంచాయితీ పెట్టాడు. అయితే అదే రోజు రాత్రి ఆమె భర్త తలపై టార్చ్ లైట్‌తో కొట్టి హతమార్చింది. పశ్చిమగోదావరి జిల్లా కొఠాలపర్రు శివారు వీరప్పచెరువు గ్రామంలో ఈ దారుణం చోటు చేసుకుంది. వీరప్పచెరువు గ్రామానికి చెందిన కౌరు వెంకట నారాయణ (48).. తన మొదటి భార్య చనిపోవడంతో బేబీ సరోజిని అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు కూతురు (23), కొడుకు (16) ఉన్నారు. వెంకటనారాయణ జీవనోపాధి నిమిత్తం గతంలో దుబాయ్ వెళ్లి కొంత కాలం అక్కడ పనిచేశాడు. ఆరు నెలల క్రితం గ్రామానికి వచ్చిన అతడు, భార్యపై అనుమానం కలిగి తరచూ గొడవ పడేవాడు. ఆ తర్వాత మళ్లీ దుబాయ్ వెళ్లినా, వారం క్రితం పూర్తిగా స్వగ్రామానికి తిరిగొచ్చేశాడు. . భర్త దుబాయ్ నుంచి పూర్తిగా వచ్చేయడంపై బేబీసరోజిని ఆగ్రహంగా ఉంది. అయితే, భార్య తనతో కాపురం చేయడం లేదంటూ ఆమెపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవ పడుతున్నాడు. ఈ విషయమై సోమవారం రాత్రి 9 గంటల సమయంలో వెంకటనారాయణ గ్రామ పెద్దలను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఆ రోజు రాత్రి భార్యాభర్తలు మళ్లీ గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో భార్య స్టీల్ టార్చ్ లైట్‌తో వెంకట నారాయణ తల వెనుక భాగాన బలంగా కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

2036 ఒలింపిక్ బిడ్‌కు కసరత్తు

(మొదటిపేజీ తరువాయి)

అకాడమీల స్థాపన, ఎల్బీ, సరూర్‌నగర్ స్టేడియాల ఆధునీకరణ, హకీంపేటలో పారా అథ్లెటిక్స్ సాధనకు మౌలిక సదుపాయాల కల్పనపై బోర్డు చర్చించనుంది. 56 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాల నిర్మాణంపై చర్చించనున్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నారు. సమావేశంలో బోర్డు సభ్యుల్లోని కార్పొరేట్ ప్రముఖులు కొణిదెల ఉపాసన, సంజీవ్ గోయెంకా, కావ్యా మారన్, విటా దని, శశిధర్, క్రీడా ప్రముఖులు అభినవ్ బింద్రా, పుల్లెల గోపీచంద్, బైచుంగ్ భూటియా, రవికాంత్ రెడ్డి, కపిల్‌దేవ్, క్రీడాశాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

మంత్రుల కమిటీ నివేదిక ఆలస్యం

» జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీతో సంప్రదింపుల్లో బీసీలకు 42శాతంపై రాని స్పష్టత!

» మరికొందరు నిపుణులతో చర్చించనున్న కమిటీ

» క్యాబినెట్ భేటీలోపు నివేదిక సమర్పించే అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశంపై మంత్రుల కమిటీ.. టీపీసీసీకి నివేదిక ఇవ్వడం కొంత ఆలస్యం కానుంది. హైదరాబాద్‌లో ఆదివారం అడిటర్ జనరల్‌తో, ఢిల్లీలో సోమవారం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మంత్రుల కమిటీ సమావేశమై చర్చించిన విషయం తెలిసిందే. అయితే ఈ భేటీలో స్పష్టత రాకపోవడంతో మరికొందరు న్యాయ నిపుణుల అభిప్రాయాలనూ తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. వాస్తవానికి టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకు న్యాయనిపుణులతో మంత్రుల కమిటీ సంప్రదింపులు పూర్తి చేసి మంగళవారం కల్లా టీపీసీసీకి నివేదిక సమర్పించాల్సి ఉంది. అయితే మరికొందరు నిపుణులనూ సంప్రదించాలన్న నిర్ణయం నేపథ్యంలో నివేదిక సమర్పణ ఒకటి, రెండు రోజులు ఆలస్యం కానుంది. శాసనసభ తీర్మానం ఆధారంగా జీవో ఇచ్చి ముందుకు వెళ్లాలా? లేక పార్టీ పరంగా నిర్ణయం తీసుకుని వెళ్లాలా? అన్నదానిపైన స్పష్టత రాకపోవడం వల్లనే మంత్రుల కమిటీ విస్తృత అభిప్రాయ సేకరణ చేపట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెల 30న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ లోపే మంత్రుల కమిటీ.. అభిప్రాయ సేకరణ పూర్తి చేసి నివేదికను పార్టీకి సమర్పించనుందని, ఆ నివేదికపై టీపీసీసీ కోర్ కమిటీ సమావేశమై ఒక నిర్ణయానికి రానుందని అంటున్నారు. కోర్ కమిటీలో తీసుకున్న నిర్ణయానుసారం.. ప్రభుత్వ పరంగా క్యాబినెట్లో నిర్ణయం జరగనుందని చెబుతున్నారు.

ఆస్టిన్ సాయిబాబా గుడిలో

నిధుల గోల్‌మాల్!

» 17 కోట్లు తినేసిన ఆలయ పాలకవర్గం

» డొల్ల కంపెనీలకు మ్యాచింగ్ గ్రాంట్ నిధులు

» కుట్రలో ఇద్దరు ప్రవాసాంధ్రుల హస్తం

» ఆర్థిక అవకతవకలపై రంగంలోకి ఫెడరల్ సంస్థలు

(డల్లాస్ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)



అమెరికాలో మరోసారి కార్పొరేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధుల అవకతవకలకు ప్రవాసాంధ్రులు బలయ్యారు. ఇప్పటి వరకు తెలుగు సంఘాలకే పరిమితమైన ఈ కుంభకోణం, ఇప్పుడు ఆలయాల్లో సైతం జరగడం గమనార్హం. తాజాగా టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ సమీపంలోని సీడర్ పార్కులో గల శ్రీ షిర్డి సాయి బాబా టెంపుల్ (ఎస్ఎస్‌బీటీ)లో సుమారు రూ.17 కోట్లను కార్పొరేట్ మ్యాచింగ్ గ్రాంట్ పథకం ద్వారా సేకరించిన బోర్డు సభ్యులు.. సరైన ఆమోదం లేకుండా స్వలాభానికి వినియోగించుకున్నారు. ఈ సొమ్ములను రికవరీ చేసి కార్పొరేట్ సంస్థలకు తిరిగి చెల్లించాలని ప్రస్తుత కార్యవర్గం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. మ్యాచింగ్ గ్రాంట్ నిధులను స్వలాభానికి వాడుకోవడమే గాక, డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి.. భక్తులు ఇచ్చిన విరాళాలను దారి మళ్లించారనే అభియోగాలపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఆలయాల్లో ఇలాంటి అక్రమాలు జరగడం దురదృష్టకరమని ప్రవాసాంధ్రులు అభిప్రాయపడుతున్నారు.

కుంభకోణం బయటపడిందిలా..

2007లో హవాయి నుంచి ఆస్టిన్ వచ్చిన జిల్ ఎడ్వర్డ్స్, క్రెయిగ్ ఎడ్వర్డ్స్ దంపతులు సీడర్ పార్కులో 5 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 2010లో బాబా ఆలయాన్ని ప్రారంభించారు. నాన్-మెంబర్ సంస్థగా మొదలైన ఈ ఆలయానికి క్రెయిగ్ ఛైర్మన్‌గా, జిల్ కార్యదర్శిగా వ్యవహరించారు. నాన్-మెంబర్ సంస్థ అయినప్పటికీ మెంబర్ సంస్థ రీతిలో ఒక్కో కుటుంబం నుంచి 10-20 వేల డాలర్లు వసూలు చేసి, సభ్యులను చేర్చుకున్నారు. అలా 150 మందిని ట్రస్టీలుగా ఏర్పాటు చేసుకున్నారు. 2010-14 మధ్య కాలంలో జిల్-క్రెయిగ్ దంపతులు ఆలయాన్ని తమ కనుసన్నల్లో నడిపించారు. వీరికి బాలాజి, కిషోర్ అనే ఇద్దరు ప్రవాసాంధ్రులు సహకరించారు. వీరంతా కలిసి ఆలయ బోర్డుగా ఏర్పడి మ్యాచింగ్ గ్రాంట్స్ కుంభకోణానికి పాల్పడ్డారు. ఆలయ ప్రాంగణంలో 2015లో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించారు. క్రెయిగ్ మృతితో ఇద్దరు ప్రవాసాంధ్రులు జిల్‌తో చేతులు కలిపి 2016 నుంచి మ్యాచింగ్ గ్రాంట్ల పథకం ద్వారా అడ్డదారిలో నిధులు పోగేసుకునేందుకు భక్తులను పావులుగా వాడుకున్నారు. ఆలయంలో వాలంటీరుగా పనిచేసే ఒక భక్తుడిని ఈ కార్యవర్గం మ్యాచింగ్ గ్రాంట్ల ద్వారా నిధులు తేవాలని కోరింది. ఆ భక్తుడు యాపిల్ సంస్థలో తనకిచ్చిన షేర్లలో కొన్నింటిని విక్రయించగా వచ్చిన 40 వేల డాలర్లతో పాటు తన ముగ్గురు సహోద్యోగుల ద్వారా మొత్తం 1.20 లక్షల డాలర్లను ఆలయ ఖాతాలో జమచేశారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో ఆ నలుగురు ఉద్యోగాలు కోల్పోయారు. ఇలాగే మ్యాచింగ్ గ్రాంట్ల అవకతవకలకు పాల్పడిన 20 మందికి పైగా యాపిల్‌లో ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. వీసా సంస్థలో సీనియర్ డైరెక్టర్‌గా ఉన్న మరో వ్యక్తి ఇలాగే నిధుల సేకరణ జరిపి, ఆ వివరాలను సంస్థ అంతర్గత బృందాల్లో చాటింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. అతని కారణంగా మరో 100 మందకిపైగా ఉద్యోగాలు కోల్పోయారని స్థానికులు చెబుతున్నారు. మొత్తంమీద 120 మంది ప్రవాసాంధ్రుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. యాపిల్, వీసాతో పాటు డెల్ సంస్థ ఉద్యోగులు కూడా బాధితుల్లో ఉన్నట్లు చెబుతున్నారు. ఉద్యోగాలు కోల్పోవడమేగాక, వారికి లభించే ప్రయోజనాలన్నీ కలిపితే రూ.వందల కోట్లు నష్టపోయినట్లవుతుంది. కాగా, అక్రమంగా సేకరించిన రూ.17 కోట్లను అప్పటి కార్యవర్గం తమ అద్దెలు చెల్లించడానికి వాడారని, ఇండియాకు మనీ లాండరింగ్ చేశారని, డొల్ల కంపెనీ అయిన సాయి చారిటీస్‌కు బదలాయించారని అభియోగాలు ఎదుర్కొంటున్నారు. 40 వేల డాలర్లు కోల్పోయిన వ్యక్తి తన బాధను వెలిబుచ్చుతూ 2023 నవంబరులో ఆలయ ట్రస్టీలకు మెయిల్ పంపడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ నాయకత్వంలో మార్పు కోసం తిరగబడ్డారు. శ్వేత జాతీయురాలితో పాటు ఇద్దరు ప్రవాసాంధ్రులు రాజీనామా చేశారు. కొత్త కార్యవర్గం జరిపిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఆస్టిన్‌ను వీడిన జిల్..

క్రెయిగ్ మృతి తర్వాత జిల్ రెండో పెళ్లి చేసుకుంది. నూతన కార్యవర్గం 2024 అక్టోబరులో సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. 2025 జనవరిలో డొల్ల కంపెనీలను మూసేసిన జిల్.. ఆస్టిన్ నుంచి వెళ్లిపోయింది. ప్రస్తుతం ఫెడరల్ సంస్థలు ఆలయంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేస్తున్నాయి.

మ్యాచింగ్ గ్రాంట్స్ అంటే..?

సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా అమెరికాలోని పెద్ద కంపెనీలు తమ ఉద్యోగులు విరాళం ఇచ్చే ప్రతి డాలరుకు వాటి అంతర్గత విధివిధానాలను అనుసరించి రెండింతలు జోడిస్తాయి. అంటే ఉద్యోగి 100 డాలర్లు ఇస్తే.. కంపెనీ 200 డాలర్లు ఇస్తుంది. మొత్తం 300 డాలర్లనూ సేవా కార్యక్రమాలకు వెచ్చించాలి.

గవర్నర్, సీఎం వినాయక చవితి శుభాకాంక్షలు

ప్రజల జీవితాల్లో విఘ్నాలు తొలగాలని ఆకాంక్ష

హైదరాబాద్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా తెలంగాణ ప్రజలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏర్పడే సకల విఘ్నాలను తొలగించాలని ఆ వినాయకుడిని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ పర్వదినం సందర్భంగా అందరూ మట్టి గణపతులను పూజించాలని గవర్నర్ సూచించారు. మంగళవారం ఆయన రాజ్‌భవన్ సిబ్బందికి మట్టి గణపతి విగ్రహాలను అందించారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలను తొలగించి అందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం ప్రసాదించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం సైతం వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాన ప్రతి ఒక్కరి జీవితంలో విఘ్నాలు తొలగి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతన్నల కుటుంబాల్లో సుఖశాంతులు వెల్లివిరిసేలా గణనాథుడు దీవించాలని ఆకాంక్షించారు.

టీచర్ల పదోన్నతుల ప్రక్రియ పూర్తి

పాఠశాల విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 880 మంది స్కూల్ అసిస్టెంట్లు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. వారిలో మల్టీజోన్-1లో 490, మల్టీ జోన్-2లో 390 మంది ఉన్నారు. అలాగే, ప్రాథమిక పాఠశాలల్లో బోధించే 3,574 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ) కూడా పదోన్నతులు పొందారు. వీరిలో 811 మంది ప్రధానోపాధ్యాయులుగా, 2,763 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందినవారు కొత్త స్థానాల్లో చేరేందుకు 15 రోజుల గడువు ఉంది. అప్పటిలోగా తమ స్థానాల్లో చేరాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ఆదేశించారు.

జూబ్లీ ఎన్‌క్లేవ్ కూల్చివేతలపై

హైడ్రాకు షాక్!

» ఆ స్థలాన్ని వెంటనే ఖాళీ చేయండి.. బోర్డులూ తీసేయండి

» ప్రాథమిక రికార్డులను బట్టి ప్రైవేటు స్థలం అని అర్థమవుతోంది

» తదుపరి ఉత్తర్వులిచ్చే దాకా ఎలాంటి జోక్యం చేసుకోవొద్దు: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ ఎన్‌క్లేవ్ కూల్చివేతలపై హైడ్రాకు షాక్ తగిలింది. అక్కడ హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు మాదాపూర్‌లోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో సర్వే నంబరు 66, 67లో హైడ్రా స్వాధీనం చేసుకున్న 2వేల చదరపు గజాల స్థలాన్ని వెంటనే ఖాళీ చేయాలని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నాం అంటూ అక్కడ ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలని స్పష్టం చేసింది. ప్రాథమికంగా రికార్డులు పరిశీలిస్తే ఆ స్థలం ప్రైవేటుదని అర్థమవుతోందని.. తదుపరి ఉత్తర్వులిచ్చేవరకు ఆ స్థలంలో జోక్యం చేసుకోరాదంటూ.. హైడ్రా, జీహెచ్ఎంసీ, పురపాలక శాఖ, జూబ్లీఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లకు హైకోర్టు మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కాగా జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కును అక్రమించి.. నిర్మాణాలు చేపట్టారంటూ అక్కడి ఓనర్స్ అసోసియేషన్ ఫిర్యాదు చేయడంతో ఈనెల 23న హైడ్రా అక్కడ కూల్చివేతలు చేపట్టింది. ఆ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి.. స్వాధీనం చేసుకున్నట్లుగా బోర్డులు పెట్టింది. అయితే తమకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని, ఇది అక్రమం అంటూ యజమానులు వెంకటరెడ్డి, జగాల్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారించిన కోర్టు తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చే దాకా ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని హైడ్రాకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

రాహుల్.. ప్రియాంక.. మధ్యలో రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే అంశం ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. దీనిపై మంత్రుల కమిటీ నియామకం, న్యాయ నిపుణుల సూచన మేరకు ముందుకెళ్లాలని టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీలో నిర్ణయం తీసుకున్న విషయాన్ని రాహుల్‌కు సీఎం రేవంత్ వివరించారు. దీనిపై ఈ నెల 30న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. కాగా, ఓటరు అధికార యాత్రలో తెలంగాణ నుంచి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. యాత్ర ముగిసిన తర్వాత.. దర్భంగా విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం, మంత్రులు హైదరాబాద్‌కు చేరుకున్నారు.

బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసులో

యువకుడికి 51 ఏళ్ల జైలుశిక్ష

» నల్లగొండ జిల్లా రెండో అదనపు జడ్జి సంచలన తీర్పు

» పోక్సో కేసులో 20 ఏళ్లు, కిడ్నాప్‌కు 10 ఏళ్లు.. అట్రాసిటీ చట్టం కింద 20 ఏళ్లు.. బెదిరింపులకు ఏడాది జైలు

నల్లగొండ క్రైం/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి, లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 51 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. దీనితోపాటు రూ.80 వేల జరిమానా విధించింది. బాధిత బాలికకు జిల్లా న్యాయసేవా సహకార సంస్థ ద్వారా రూ.7లక్షలు పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ మేరకు నల్లగొండ జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, ఎస్సీఎస్టీ కోర్టు, అత్యాచారం, పోక్సో కేసుల ప్రత్యేక కోర్టుల న్యాయాధికారి ఎన్.రోజారమణి మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల మేరకు.. నల్లగొండ జిల్లా తిప్పర్తికి చెందిన ప్రైవేట్ కారు డ్రైవర్ మహమూద్ ఖయ్యూం ఓ బాలికను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ఆమె అంగీకరించకపోవడంతో బలవంతంగా కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఖయ్యూం నుంచి తప్పించుకున్న బాలిక.. తల్లిదండ్రుల వద్దకు చేరుకుని జరిగిన దారుణాన్ని వివరించింది. తల్లిదండ్రులతో కలిసి వెళ్లి 2021 డిసెంబర్ 5న తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో, ఐపీసీ, ఎస్సీ- ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయాధికారి మంగళవారం తీర్పు వెలువరించారు. బాలికపై లైంగికదాడి నేరానికి పోక్సో చట్టం సెక్షన్-4 కింద 20 ఏళ్ల జైలుశిక్ష రూ.25వేలు జరిమానా.. ఆమె ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందినదని తెలిసీ దారుణానికి పాల్పడ్డందుకు ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద 20ఏళ్ల జైలు, రూ.25 వేల జరిమానా.. బాలికను కిడ్నాప్ చేసిన నేరానికి ఐపీసీ సెక్షన్ 366 ప్రకారం పదేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా.. నేరపూరిత బెదిరింపులకు పాల్పడినందుకు ఐపీసీ సెక్షన్ 506 ప్రకారం ఏడాది జైలు, రూ.5వేల జరిమానా.. మొత్తంగా 51 ఏళ్ల జైలుశిక్ష, రూ.80 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.7 లక్షలు పరిహారాన్ని జిల్లా న్యాయ సేవా సహకార సంస్థ ద్వారా అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

బాలుడిపై లైంగికదాడి.. యువకుడికి జీవిత ఖైదు

ఏడేళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి ప్రత్యేక న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి ఎన్.అమరావతి తీర్పు వెలువరించారు. బిహార్‌కు చెందిన గిరిధర్ (32) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జగద్గిరిగుట్ట మగ్దూమ్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. 2017 జూన్ 26న అదే ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన బాలుడి తండ్రి జూలై 13న జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదనలు విన్న జడ్జి గిరిధర్‌ను దోషిగా నిర్ధారించి.. జీవిత ఖైదుతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. బాధిత బాలుడి కుటుంబానికి 2లక్షల పరిహారం అందజేయాలని ఆదేశించారు.

లైంగిక వేధింపులు తాళలేక బాలిక మృతి !

వీడియోలు తీసి బెదిరిస్తూ ముగ్గురు యువకుల ఆకృత్యం

మానసిక క్షోభతో అనారోగ్యంపాలైన బాధితురాలు, మరణం

అంతకముందే రాసిన లేఖ, సెల్‌ఫోన్ వల్ల బయటపడ్డ ఘోరం

ఇల్లంతకుంట, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తల్లికి దూరంగా తండ్రితో కలిసి జీవిస్తున్న ఓ బాలిక(17)పై ముగ్గురు యువకులు ఆకృత్యానికి పాల్పడ్డారు. ఆ వేధింపులు తాళలేక, కష్టాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానసిక్ష క్షోభతో అనారోగ్యం పాలై ఆ బాలిక మరణించింది. పోలీసులు తెలిపిన వివరాలమేరకు రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన బాధిత బాలిక తల్లిదండ్రులు విభేదాల వల్ల వేర్వేరుగా ఉంటున్నారు. బాలిక తండ్రితో కలిసి నివసిస్తుండగా.. తల్లి, సోదరుడు మరో జిల్లాలో ఉంటున్నారు. తండ్రితో కలిసి సంతలో కూరగాయలు అమ్మే ఆ బాలికకు వినోద్ అనే యువకుడితో పరిచయమైంది. వారిద్దరూ సన్నిహితంగా ఉన్నప్పుడు తీసిన వీడియోను వినోద్ తన స్నేహితుడు సతీశ్‌కు పంపాడు. సతీశ్ ఆ వీడియోను బాలికకు చూపించి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ వీడియోను జాషు అనే యువకుడికి పంపగా అతడు కూడా లైంగిక వేధింపులకు దిగాడు. తాము చెప్పినట్టు వినకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతామని బెదించి బాలికపై ముగ్గురూ లైంగిక వేధింపులకు తెగబడ్డారు. భరించ లేకపోయిన ఆ బాలిక తనపై జరుగుతున్న ఆకృత్యాన్ని వివరిస్తూ కొద్ది రోజుల క్రితం ఓ లేఖ రాసుకుంది. మానసిక క్షోభతో కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యింది. జ్వరంతో బాధపడుతున్న బాలికకు సోమవారం ఫిట్స్ రావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాలికను సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణం విడిచింది. అయితే, బాలిక ఉండే గదిలో ఆమె రాసిన లేఖతోపాటు ఓ సెల్‌ఫోన్‌ను కుటుంబసభ్యులు గుర్తించారు. ఆ సెల్‌ఫోన్‌లో యువకులు పంపిన వీడియోలను చూసి అవాక్కయ్యారు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సతీష్, వినోద్, జాషులపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

మరణం అంచున పునరుజ్జీవం!

» కణాలకు ఆ శక్తి ఉంటుందని గుర్తించిన సీసీఎంబీ శాస్త్రజ్ఞులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): ఒక కణం చనిపోవడం ప్రారంభించిన తరువాత ఆ ప్రయాణాన్ని రివర్స్ చేయడం అసాధ్యం అనే నమ్మకాన్ని వమ్ము చేసే విషయం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రజ్ఞుల పరిశోధనలో వెల్లడైంది. మరణం అంచున్న ఉన్నా కూడా తమంత తామే పునరుజ్జీవం పొందే అంతర్గత విధానం కణాల్లో ఉంటుందని సీసీఎంబీకి చెందిన డాక్టర్ సంతోష్ చౌహాన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం గుర్తించింది. ఈ ప్రక్రియ కణాల పెరుగుదలను అనుకరిస్తుందని వారు పేర్కొన్నారు. కణాల్లో జరిగే ఈ ప్రక్రియను వారు 'ప్రోగ్రామ్‌డ్ సెల్ రివైవల్'గా అభివర్ణించారు. ఈ ప్రక్రియ పలు జీవుల్లో కణజాలాల మరమ్మతు, పునరుద్ధరణను వేగవంతం చేస్తుందని వారు పేర్కొన్నారు. కణాలు అలా పునరుజ్జీవం పొందడం యాదృచ్ఛికంగా జరిగే ప్రక్రియ కాదని.. చనిపోయే కణాలు తమనుతాము పునరుజ్జీవింపజేసుకోవడానికి అవసరమైన అన్ని ముఖ్యమైన ప్రక్రియలనూ (అభివృద్ధి, జీవక్రియ, రోగనిరోధక శక్తి మార్గాలను) రీబూట్ చేసుకుంటాయని డాక్టర్ చౌహాన్ వెల్లడించారు. ఎలుకల్లో చర్మంపై గాయాలు, కాలినగాయాలు వేగంగా నయం కావడానికి.. చిరుకప్పల్లో తోక పునరుత్పత్తిని ఉత్తేజితం చేయడానికి, సీ-ఎలిగాన్స్‌లో నాడుల మరమ్మతులను ప్రోత్సహించడంలో.. ఫ్రూట్‌ఫ్లైస్‌లో రక్త మూలకణాల ఉత్పత్తిని పెంచడంలో ఈ ప్రోగ్రామ్‌డ్ సెల్ రివైవల్ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతోందని డాక్టర్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ రెస్క్యూ మెకానిజం అన్ని జీవుల కణాల్లోనూ అంతర్గతంగా ఉంటుందని.. గాయాలు నయం చేయడానికి, దెబ్బతిన్న కణజాలాలకు మరమ్మతు చేయడానికి దీన్ని ఉపయోగించవచ్చని ఆయన వివరించారు. అదే సమయంలో.. ఈ మెకానిజం క్యాన్సర్ చికిత్సలను మరింత క్లిష్టతరం చేస్తుందని కూడా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా క్యాన్సర్ చికిత్సల ప్రధాన లక్ష్యం క్యాన్సర్ కణాలను చంపడమే. కానీ, ఆ కణాలు ఈ మెకానిజంతో బతికితే క్యాన్సర్ కణితులు చికిత్సకు స్పందించకుండా పోయే ప్రమాదం ఉందని డాక్టర్ చౌహాన్ ఆందోళన వ్యక్తం చేశారు. గాయాలను నయం చేయడానికి, డీజెనరేటివ్ డిసీజ్‌లను నయం చేయడానికి, అవయవాల పునరుత్పత్తికి సంబంధించి కొత్త చికిత్సలను అభివృద్ధి చేయడానికి తాము గుర్తించిన ఈ అంశాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

ఇతర పార్టీలూ మద్దతిస్తున్నాయి!

- ఉపరాష్ట్రపతి.. రాజకీయ పదవి కాదు
- రెండో అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవి
- ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

లక్నో/న్యూఢిల్లీ, ఆగస్టు 26: విపక్ష కూటమి ఇండియా తరఫున ఉపరాష్ట్రపతి పదవికి పోటీ పడుతున్న తనకు.. ఇండియాయేతర పార్టీలు కూడా మద్దతిస్తున్నాయని జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం లక్నోలో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను కలుసుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి పదవి రాజకీయ పదవి కాదని, దేశంలోని రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి అని.. కాబట్టి, తాను రాజకీయాలు మాట్లాడనని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ జాకిర్‌హుస్సేన్, కేఆర్ నారాయణన్, హమీద్ అన్సారీ వంటి మేధావులు, తత్వవేత్తలు, విద్యావేత్తలు ఈ పదవిని ఇంతకుముందు అధిష్ఠించారని.. వారి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానన్నారు.

'ఉప రాష్ట్రపతి'గా మాజీ జడ్జి పోటీయే సరికాదు

న్యూఢిల్లీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి ఉప రాష్ట్రపతి పదవికి పోటీ చేయడం సరైంది కాదని మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పి. సదాశివం, జస్టిస్ రంజన్ గొగోయ్‌తోపాటు 56 మంది విశ్రాంత న్యాయమూర్తులు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి సల్వాజుడుం కేసులో ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పలువురు మాజీ న్యాయమూర్తులు విడుదల చేసిన ప్రకటనను వీరు తీవ్రంగా తప్పుబట్టారు.

ఇండీ కూటమి నేతలకు క్షమాపణలు

- పరమేశ్వర్‌ను సమర్థించే క్రమంలోనే ఆర్‌ఎస్‌ఎస్ గీతాలాపన: డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): 'నమస్తే సదా వత్సలే మాతృభూమి' అంటూ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థనా గీతాన్ని శాసనసభలో ఆలపించినందుకు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ క్షమాపణ చెప్పారు. కాంగ్రెస్ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఆయన మంగళవారం స్పందించారు. విధాన సౌధలో మీడియాతో మాట్లాడారు. తాను ఎటువంటి తప్పు చేయలేదని, ఎవరి మనసునూ నొప్పించే ఉద్దేశం తనకు లేదని తెలిపారు. ఇండియా కూటమి నాయకులకు బాధ కలిగి ఉంటే క్షమాపణలు చెబుతున్నానన్నారు. తాను ఆర్‌ఎస్‌ఎస్‌ను పొగడలేదని, కానీ ప్రత్యర్థుల గురించి తెలుసుకోవడం తన కర్తవ్యమని అన్నారు. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందడంపై గత గురువారం శాసనసభలో మాట్లాడుతున్న సందర్భంలో తమ నాయకుడు పరమేశ్వర్‌ను సమర్థించే క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించానని తెలిపారు. తాను పుట్టుకతో కాంగ్రెస్‌వాదినని, చివరి దాకా ఇందులో మార్పు ఉండబోదని శివకుమార్ స్పష్టంచేశారు.

ల్యాబ్‌లో తయారైన మానవ కిడ్నీ

- 34 వారాలు క్రియాశీలకంగా మూత్రపిండం
- ఇజ్రాయెల్ ఆస్పత్రి వైద్యుల సృష్టి

న్యూఢిల్లీ, ఆగస్టు 26: కృత్రిమ అవయవాల వైద్యం కొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన ఓ మానవ మూత్రపిండం నమూనా వైద్య చరిత్రలోనే అత్యధిక రోజులు క్రియాశీలకంగా ఉండి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఆ కిడ్నీ ఆర్గనాయిడ్‌ను ఇజ్రాయెల్ డాక్టర్లు ఓ ల్యాబ్‌లో తయారు చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఆ కిడ్నీ రికార్డు స్థాయిలో 34 వారాలకు పైగా పనిచేసింది. ఇది అవయవాల పునరుత్పత్తి వైద్యంలో ఓ మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. దీర్ఘకాలం ఉన్న కిడ్నీని ల్యాబ్‌లో సృష్టించడం విజయవంతమైన నేపథ్యంలో ఇక క్లినికల్ పరీక్షలకు సిద్ధమవుతున్నారని ఓ అధ్యయనం వెల్లడించింది. ప్రఖ్యాత ఎంబో జర్నల్ ఆ అధ్యయనాన్ని ప్రచురించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ హషోమెర్‌లో ఉన్న షెబా మెడికల్ సెంటర్ బృందం, టెల్ అవీవ్ యూనివర్సిటీతో కలసి 3డీ సింథటిక్ కిడ్నీని అభివృద్ధి చేసింది. గతంలో ఇలాంటి కృత్రిమ కిడ్నీలు నాలుగు వారాలు మాత్రమే ఉంటే.. ఇది అంత కంటే చాలా ఎక్కువ కాలం పనిచేసింది. అయితే ఇది ఇంకా అవయవ మార్పిడికి సిద్ధం కాలేదు. కృత్రిమ అవయవాల్లోని జీవ అణువుల ద్వారా మూత్రపిండాలను మరమ్మతు చేసే అవకాశం ఉందని డాక్టర్ బెంజమిన్ డెకెల్ చెప్పారు.

వాన్‌పిక్ క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు

- జగన్ అక్రమాస్తుల కేసులో నిందితుల జాబితా నుంచి తొలగింపునకు నిరాకరణ

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో నిందితుల జాబితాలో ఉన్న వాన్‌పిక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో భాగంగా సీబీఐ తమపై నమోదు చేసిన కేసు కొట్టేయాలని పేర్కొంటూ వాన్‌పిక్ కంపెనీ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. వాస్తవానికి ఈ పిటిషన్‌ను 2022లోనే హైకోర్టు అనుమతించింది. దానిపై తమ వాదన వినకుండా హైకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో మరోసారి ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కేసును తిప్పి హైకోర్టుకు పంపింది. ఈ నేపథ్యంలోనే ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టి వాన్‌పిక్ పిటిషన్‌ను కొట్టేస్తూ సీబీఐకి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.



జమ్మూతోపాటు కశ్మీర్ లోయలో మంగళవారం కురిసిన భారీ వర్షంతో జన జీవనం అస్తవ్యస్తమైంది. విరిగి పడ్డ కొండ చరియలు, చెట్లు, రహదారులపైకి దూసుకొచ్చిన రాళ్లతో ట్రాఫిక్ స్తంభించింది. మాతా వైష్ణోదేవి ఆలయ మార్గంలో విరిగి పడ్డ కొండ చరియల కింద ఆరుగురితో పాటు 10 మంది మృత్యువాత పడగా, 14 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో వైష్ణోదేవి యాత్రను నిలిపేశారు. మరోవైపు అరుణాచల్ ప్రదేశ్‌లోని వెస్ట్ కామెంగ్ జిల్లాలో కొండ చరియలు విరిగి పడటంతో తవాంగ్, దిరాంగ్ జిల్లాల మధ్య రహదారులు దెబ్బ తినడంతో ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడింది.

డ్రగ్స్ కలకలం!

మత్తు మందులు సేవిస్తున్న 50 మంది విద్యార్థులు



- ముగ్గురు విద్యార్థులు, మరో వ్యక్తి అరెస్టు
- ఈగల్ బృందాల విస్తృత తనిఖీలు
- గంజాయి, ఓజీ కుష్ స్వాధీనం
- నైజీరియన్ నుంచి మత్తుమందులు
- ఢిల్లీ, బీదర్ నుంచి గంజాయి సరఫరా
- 'మల్నాడు' లింకులతో బయటపడ్డ దందా

హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మహీంద్ర విశ్వవిద్యాలయంలో మత్తుమందుల రాకెట్‌ను సైబరాబాద్ ఈగల్ పోలీసు బృందాలు బట్టబయలు చేశాయి. 50 మంది విద్యార్థులు డ్రగ్స్ సేవిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు.. మత్తు మందుల రవాణా, విక్రయాలతో సంబంధం ఉన్న ముగ్గురు విద్యార్థులతో పాటు మరొక బయటి వ్యక్తిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 1.15 కిలోల గంజాయి, 47 గ్రాముల ఓజీ కుష్ స్వాధీనం చేసుకున్నారు. ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య కథనం మేరకు... గతంలో జరిగిన మల్నాడు కిచెన్ డ్రగ్స్ దందా కేసులో మత్తుమందులు కొరియర్ పార్శిళ్ల ద్వారా వస్తున్నట్లు వెల్లడైంది. ఢిల్లీలోని రాజేశ్ ఎంటర్‌ప్రైజెస్ (శ్రీ మారుతి కొరియర్స్ ఫ్రాంచైజీ) ద్వారా మత్తుమందులు హైదరాబాద్‌కు రవాణా అయినట్లు అప్పట్లో ఈగల్ టీం గుర్తించింది. దీంతో హైదరాబాద్‌లోని కొరియర్ డెలివరీ బాయ్స్‌ను ఈగల్ బృందాలు పలుమార్లు కలిసి కొన్ని కీలక సూచనలు ఇచ్చారు. తమకు ఏ విధంగా సమాచారం అందించాలనే విషయాలను తెలియచేశారు. ఈ క్రమంలో వారిచ్చిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి ఈ రాకెట్ ఛేదించారు. న్యూఢిల్లీలోని రాజేశ్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి మహీంద్ర విశ్వ విద్యాలయంలోని హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థి దినేశ్‌కు రెండు పార్శిళ్లు వచ్చినట్లు ఈగల్ బృందాలు గుర్తించాయి. అలాగే ఇదే వర్సిటీ విద్యార్థి భాస్కర్.. నైజీరియన్ నిక్‌కు రెండుసార్లు ఆన్‌లైన్‌లో డబ్బులు పంపినట్లు తెలుసుకున్నాయి. ఇక్కడ భాస్కర్ మత్తుమందుల కోసం పేమెంట్ చేస్తే పార్శిల్ డెలివరీ తీసుకుంది మాత్రం దినేశ్ కావడం గమనార్హం. నిక్ ద్వారా వీరికి అందిన డ్రగ్స్‌ను క్వాక్ ఏరినా పబ్‌కు తీసువెళ్లి అక్కడ భాస్కర్, దినేశ్ మరో ముగ్గురు స్నేహితులు కలిసి సేవించేవారు. అలాగే, మణిపూర్‌కు చెందిన విద్యార్థి నెవెల్లే తాంగ్జ్రేమ్ ఢిల్లీ నుంచి నిక్ నెట్‌వర్క్ కాకుండా మరో నెట్‌వర్క్ ద్వారా మత్తుమందులు తెప్పించి భాస్కర్‌కు అందజేసేవాడు. భాస్కర్ ఆ మత్తుమందును నాలుగు గ్రాముల ప్యాకెట్లుగా మార్చి ఇతర విద్యార్థులకు అత్యధిక ధరలకు అమ్మేవాడు. వీరే కాకుండా మరో విద్యార్థి మహ్మద్ అశ్వర్ జావేద్ ఖాన్ సైతం గురుగామ్, ఢిల్లీ నుంచి గంజాయి తెప్పించి విద్యార్థులకు విక్రయించేవాడు. వీరికి ఢిల్లీ నుంచి మత్తుమందులు రావడం ఆలస్యమైతే మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న శివకుమార్ బీదర్ నుంచి గంజాయి తెచ్చి ఇచ్చేవాడు.

తీగలాగి.. డొంక కదిపి..

గతంలో మల్నాడు కిచెన్ కేసులో సూర్య ద్వారా నిక్‌కు డబ్బు ఆన్‌లైన్‌లో అందినట్లు గుర్తించిన పోలీసులు అప్పటి నుంచి నిక్ బ్యాంకు లావాదేవీలపై దృష్టి పెట్టడంతో ఈ విద్యార్థుల విషయం బయటపడింది. దీంతో వారం రోజుల పాటు ఈగల్ బృందాలు వర్సిటీలో రహస్యంగా పలు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించాయి. మత్తుమందులు అమ్ముతున్న ఇద్దరు విద్యార్థుల ఫోన్ నంబర్లు, వారి బ్యాంకు ఖాతాల వివరాలు ఈగల్ బృందాలు తెలుసుకున్నాయి. వారిద్దరూ వర్సిటీ హాస్టల్ నుంచి బయటకు వచ్చి సూరారంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ విద్యార్థుల బ్యాంకు ఖాతాల లావాదేవీలను పరిశీలించినపుడు 50 మంది ఇతర విద్యార్థులు తరచుగా డబ్బు చెల్లించి వీరి వద్ద నుంచి మత్తుమందులు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు.

మరికొంత మందిని అరెస్టు చేస్తాం: సందీప్ శాండిల్య

అరెస్టయిన నలుగురిలో ముగ్గురు విద్యార్థులు కాగా, ఒకరు బయటి వ్యక్తి అని మొత్తం రెండు గ్రూపులుగా వీరంతా ఇతర విద్యార్థులకు మత్తుమందులు అమ్ముతున్నట్లు తమవిచారణలో వెల్లడైందని సందీప్ శాండిల్య వివరించారు. నెవెల్లే డ్రగ్స్‌కు అలవాటు పడిన విద్యార్థుల ఫోన్ నంబర్లను గణేశ్, అశ్వర్‌లకు ఇస్తుండేవాడని, ఢిల్లీలో 28 గ్రాముల ఓజీ కుష్‌ను రూ.30 వేలకు కొని, ఇక్కడ ఒకో గ్రామును విద్యార్థులకు రూ.2,500లకు అమ్మారని ఆయన తెలిపారు. భాస్కర్, దినేశ్‌లు నైజీరియన్ నుంచి ఎండీఎంఏ మత్తుమందులు తెప్పిస్తుండగా.. నెవెల్లే, గణేశ్, అశ్వర్, శివకుమార్‌లు గంజాయి, ఓజీ కుష్ దందాలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో మరికొంత మందిని త్వరలో అరెస్టు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటి వరకు సింబోసిస్ కాలేజీ, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీ, కలినరి అకాడమీ, సీబీఐటీ, ఐఐటీ బాసర, జేఎన్‌టీయూ జోగిపేట,మెడిసిటీ మెడికల్ కాలేజీ, ఉస్మానియా, ఇక్ఫాయ్ విశ్వ విద్యాలయాల్లో సోదాలు నిర్వహించినట్లు ఆయన వివరించారు.

కల్తీమద్యం @ హైదరాబాద్

- యథేచ్ఛగా తయారీ..ముఠా ఆట కట్టించిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్
- ఇద్దరు నిందితుల అరెస్టు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రంగా కల్తీ మద్యం పెరిగిపోతోంది. ప్రజలకు హాని కలిగించే స్పిరిట్‌తో కేటుగాళ్లు యథేచ్ఛగా నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నారు. ఖరీదైన మద్యం బాటిళ్లపై నకిలీ లేబుళ్లు, స్టిక్కర్లు అతికించి విక్రయాలు సాగిస్తున్నారు. నకిలీ మద్యం తయారీకి వాడే ప్రధాన ముడిసరుకు స్పిరిట్ కూడా అక్రమ మార్గంలో సరఫరా అవుతుండటంతో కల్తీ మద్యం తయారీ మరింత సులువుగా మారింది. ఒకప్పుడు ఒడిశా కేంద్రంగా సాగిన ఈ వ్యవహారం మూడు, నాలుగేళ్లుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు విస్తరించింది. ఇలాంటి కల్తీ మద్యాన్ని తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పట్టుబడ్డ కల్తీ మద్యం రాకెట్ నిందితుల దగ్గర నుంచి 15 రకాల ముద్రణ సామగ్రిని, అత్యంత ప్రాచుర్యం పొందిన ఎనిమిది బ్రాండ్లకు సంబంధించిన ప్రింటింగ్ ప్లేట్లను అధికారులు గుర్తించారంటే కల్తీ మద్యం ఏ స్థాయిలో తయారవుతుందో తెలుసుకోవచ్చు. సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువు మండలంలో ఇటీవల కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దీంతో తీగ లాగితే డొంక కదిలినట్టూ నగరంలో ఈ రాకెట్ గుట్టురట్టయ్యింది.

కుషాయిగూడలో నకిలీ మద్యం లేబుళ్లు

కుషాయిగూడ కేంద్రంగా నకిలీ మద్యం లేబుళ్లు తయారుచేస్తున్న ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోదాల్లో రూ. 50లక్షల విలువైన ప్రింటింగ్ మిషన్లు, నకిలీ లేబుళ్లు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, తయారీ యూనిట్‌ను సీజ్ చేశారు. ఇక్కడ తయారవుతున్న నకిలీ లేబుళ్లను ఖరీదైన మద్యం సీసాలకు అతికించి ఏపీ, కర్ణాటకల్లో కల్తీ మద్యం తయారు చేస్తున్న కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సూర్యాపేట ఘటనపై విచారణను ముమ్మరం చేసిన పోలీసులు.. ఈ రెండు ముఠాలకు ఉన్న లింకులపై ఆరా తీశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ బృందం.. కల్తీ మద్యం తయారీదారుల బ్యాంకు లావాదేవీలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే సోమవారం శివసాయి నగర్ కాలనీ, నాగార్జున కాలనీ మధ్య గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్న యూనిట్‌పై దాడి చేశారు. ఈ గోడౌన్‌ను గడ్డమీది నవీన్ గౌడ్ అనే వ్యక్తికి సంబంధించినదిగా గుర్తించిన పోలీసులు అతడితో పాటు, అక్కడే పని చేస్తున్న నివావత్ రాజేష్‌ను అరెస్టు చేశారు.

నకిలీ మద్యానికి స్పిరిట్ సరఫరా..

హైదరాబాద్‌లోని కృష్ణా పరిశ్రమ కేంద్రంగా తయారు చేస్తున్న స్పిరిట్‌ను ఏపీ, తెలంగాణ, కర్ణాటకతోపాటు రాజస్థాన్, గుజరాత్ ప్రాంతాలకు సరఫరా అయినట్లు విచారణలో గుర్తించామని పోలీసులు వెల్లడించారు. ఈ ఒక్క పరిశ్రమ నుంచి దాదాపు రూ.4 కోట్ల విలువ చేసే స్పిరిట్‌ను విక్రయించారని వారు గుర్తించారు.

ఆమె.. తాటకి, పూతన, లంఖిణి!

అవినీతి అనకొండ.. వేల కోట్ల లూటీ.. కట్టే చీర ధర రూ.లక్షన్నరకు పైనే

- రూ.50 లక్షల విలువైన 11 విగ్గులు
- సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మిని ఉద్దేశించి భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలు



తిరుపతి, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి పేరెత్తకుండానే వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. "ఆమె తాటకి, పూతన, లంఖిణి.. ఆధునిక రజియా సుల్తానా." అంటూ మంగళవారం సెల్ఫీ వీడియోలో మండిపడ్డారు. "తిరుపతిలో టీడీఆర్ బాండ్ల అవినీతి జరిగిందంటూ ప్రచారం జరగడానికి కారణం ఓ మహిళా ఐఏఎస్ అధికారిణి." అంటూ శ్రీలక్ష్మిపై ఆరోపణలు గుప్పించారు. తిరుపతిలో గత ప్రభుత్వంలో తాము మాస్టర్ ప్లాన్ కింద 21 రోడ్లు కొత్తగా వేస్తుండగా, ఆ రోడ్ల నిర్మాణంతో స్థలాలు కోల్పోయే వారిని టీడీఆర్ బాండ్ల పేరుతో దోపిడీ చేయడానికి, తద్వారా రూ.వందల కోట్లు నొక్కేయడానికి ఆవిడ కుటిల పన్నాగం పన్నారని ఆరోపించారు. దాన్ని తాము అడ్డుకున్నామన్న దుగ్ధతో ఆమె తమ పక్క జిల్లా టీడీపీ నేతలకు ఆ విషయం చెప్పి, రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని తమపై ఎంత ప్రచారం చేశారో అందరికీ తెలుసునన్నారు. అవినీతిలో ఆమె అనకొండ అని ఆరోపించారు. "ఈ అవినీతి అధికారిణి గత 30-35 ఏళ్లుగా ఎక్కడ పనిచేసినా వందల, వేల కోట్ల రూపాయలు లూటీ చేశారు. చివరికి అత్యున్నత న్యాయస్థానంతో కూడా 'మీ నీతి గురించి మాకు చాలా బాగా తెలుసులే' అని అనిపించుకున్నారు." అని భూమన ఎద్దేవా చేశారు. పూతనకు ఏమాత్రం తక్కువ కాదని, లంఖిణి కంటే చాలా విపరీతమైన చేష్టలున్న అధికారిణి అని ఆరోపించారు. ఐఏఎస్ శ్రీలక్ష్మి వస్త్రాలపైనా భూమన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె రోజూ ధరించే చీర ఖరీదు కనీసంలో కనీసం రూ.లక్షన్నరకు పైగా ఉంటుందన్నారు. "ఆమె చేసే ఉద్యోగమేంటి?. ఆమెకు వచ్చే జీతమెంత?. ధరించే చీరల ఖరీదు ఎంత?" అని ప్రశ్నించారు. రూ.50 లక్షలకు పైగా ఖరీదు చేసే విగ్గులు ఆమెకు 11 ఉన్నాయని, ఒక్కో రోజు ఒకో విగ్గు ధరిస్తూ ఆఫీసులో దర్శనమిస్తుంటారని ఆరోపించారు.

ఎట్టకేలకు.. పెంపుడు తల్లిదండ్రుల చెంతకు!

- సుప్రీం తీర్పుతో చిన్నారుల అప్పగింత

పంజాగుట్ట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఆ నలుగురు చిన్నారులూ తమను పెంచుకుంటున్న తల్లిదండ్రుల చెంతకు చేరారు! 15 నెలల న్యాయపోరాటం ఫలించి.. సుప్రీం తీర్పుతో ఆ చిన్నారులు తమకే చెందడంతో.. వారి పెంపుడు తల్లిదండ్రులు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు!! చిన్నారులను విక్రయించే ముఠా నుంచి 9 మంది పిల్లలను అక్రమంగా దత్తత తీసుకుని, వారిని పెంచుకుంటున్న 9 మంది దంపతుల్లో నలుగురు దంపతులు పిల్లలను తమకే అప్పగించాలని సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సర్వోన్నత న్యాయస్థానం వారికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో.. వారంతా సోమవారం రాత్రే హైదరాబాద్‌లోని శిశువిహార్‌కు వెళ్లారు. సంబంధిత అధికారులు వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి చిన్నారులను అప్పగించారు.

సౌండ్ సిస్టం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకే

మీటర్లతో ధ్వని స్థాయిని పోలీసులు పర్యవేక్షించాలి

- గణేశ్ నిమజ్జనం తర్వాత మండపాల ప్రాంగణం శుభ్రం చేయాలి
- నిబంధనలు పాటించాలి: హైకోర్టు



హైదరాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాల వద్ద కాలుష్య చట్టంలోని నిబంధనల ప్రకారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్‌ను అనుమతించాలి. మైక్‌లను నిర్దేశించిన డెసిబెల్ స్థాయి దాటకుండా పరిమితి పాటించాలి. ఆస్పత్రులు, పాఠశాలలు, వృద్ధాశ్రమాల వైపు లౌడ్ స్పీకర్లు పెట్టరాదు. డెసిబుల్ మీటర్లతో ధ్వని స్థాయిని పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ట్రాఫిక్ ఆగిపోకుండా చూసుకునే బాధ్యత నిర్వాహకులదే. నిమజ్జనాల తర్వాత మండపాల ప్రాంగణాన్ని శుభ్రం చేసే బాధ్యతా వారిదే. ఇవే కాదు.. గణేశ్ మండపాల నిర్వాహకుల కోసం మరిన్ని మార్గదర్శకాలను తాజాగా హైకోర్టు జారీచేసింది. ఆ మండపాలను నిర్వహించే వ్యక్తులు చట్టప్రకారం వ్యవహరించాలని, నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. నివాస ప్రాంతాల్లో శబ్ద కాలుష్య పరిమితి దాటి సౌండ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయొద్దని స్పష్టం చేసింది. అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలు వెళ్లేందుకు వీలుగా.. ట్రాఫిక్‌కు సమస్య లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలని పేర్కొంది. శబ్దకాలుష్యం కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు గతంలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలను గుర్తుంచుకోవాలని.. విద్యుత్తు కనెక్షన్ కోసం అనుమతి పొందాలని, ఆ కనెక్షన్ పక్కాగా ఏర్పాటు చేయకపోతే విద్యుదాఘాతం, అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉంటుందని పేర్కొంది. తన ఇంటిని ఆనుకునే అనుమతి లేకుండా గణేశ్ మండపాన్ని ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సికింద్రాబాద్ ఎంఈఎస్ కాలనీకి చెందిన ప్రభావతి అనే 80 ఏళ్ల వృద్ధురాలు, అనధికారికంగా మండపాలు ఏర్పాటు చేశారని పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. హైకోర్టు పిటిషనర్ల అభ్యంతరాలను పరిష్కరించాలని చెప్పినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. వీటిపై జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పండగ పేరుతో ఎవరినీ ఇబ్బంది పెట్టరాదని స్పష్టంచేసింది. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను, సమస్యలను దృష్టిలో ఉంచుకుని విగ్రహాల ఏర్పాటుకు మునిసిపల్ అధికారులు, పోలీసులు అనుమతివ్వాలని పేర్కొంది.

ఇవీ నిబంధనలు..

గణేశ్ విగ్రహాల ఏర్పాటు కోసం స్థానిక పోలీసులు, మునిసిపల్ అధికారుల నుంచి అనుమతి తప్పనిసరి. ట్రాఫిక్ సజావుగా సాగేలా, ఇళ్లు, ఆస్పత్రుల ప్రవేశాలకు ఆటంకం లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలి. అంబులెన్స్, అగ్నిమాపక యంత్రాలు.. ఇలా అత్యవసర పరిస్థితులు ఉంటే వాటిని అడ్డుకునేలా ఉండకూడదు. వీలైనంత వరకు విగ్రహాలను వివిధ ప్రాంతాల్లోని కమ్యూనిటీ మైదానాలు, బహిరంగ ప్రదేశాల్లో నెలకొల్పాలి. అగ్ని ప్రమాదాలు జరగకుండా పందిళ్లకు విద్యుత్తు కనెక్షన్ పక్కాగా తీసుకోవాలి. ట్రాఫిక్ పోలీసులతో ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందించుకోవాలి. స్థానికుల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు పోలీస్ స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలి. నిమజ్జనం, ఊరేగింపుల సమయంలో మునిసిపల్, పోలీస్ అధికారులు గతంలో హైకోర్టు, సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలి. కాలుష్యాన్ని తగ్గించేందుకు పర్యావరణ అనుకూల విగ్రహాలు, పూజా వస్తువులను ఎంచుకోవాలి. శబ్ద, పర్యావరణ నియమాలను పాటించే బాధ్యతను నిర్వాహకులే తీసుకోవాలి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.